www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 19 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ ఫాల్గుణ శుద్ధ అష్టమి


27 ఫిబ్రవరి-05 మార్చి 2023

వెల : ₹15/-



# భవిష్యత్తును శాసించే కృత్రిమ మేధ

సాంకేతిక లావాదేవీల నిర్వహణకు భారత్ అన్నిరకాల అనువైన దేశమని ప్రపంచ టెక్నోక్రాట్లు భావిస్తున్నారు



## కణాదుడి నుంచి కలాం వరకు భారతీయ వైజ్ఞానిక వైభవం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# ఆదివాసీ సంస్కృతి, కళ భారత్‌కు గర్వకారణం

'ఈవాళ భారతదేశం ప్రపంచంలోనే అగ్ర దేశంగా అవతరిస్తోంది. అదే సమయంలో తమకు ఉన్న ఆదివాసీ సంస్కృతిని ప్రపంచ దేశాల ఎదుట సగర్వంగా చాటగలుగుతున్నది' అన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. ఫిబ్రవరి 16న ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఆయన ఆది మహెూత్సవ్‌ను ప్రారంభించారు. దీనిని ట్రైఫెడ్ రెండు వారాల పాటు నిర్వహిస్తున్నది. భిన్న భిన్న ప్రాంతాలలోని గిరిజన సంస్కృతిలోని వైభవాన్ని ఒకేచోట ప్రదర్శిస్తే అసలు భారతీయతలోని భిన్నత్వంలోని ఏకత్వం ఇంకా బాగా అర్థమవుతుందని కూడా మోదీ అన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రాణాలు వదిలిన బీర్సా ముండా ప్రతిమకు మొదట పుష్పాంజలి ఘటించి మోదీ ప్రదర్శన ప్రారంభించారు. గిరిజనులు తయారు చేసిన కళాత్మక వస్తువులు, నేసిన బట్టలు, బొమ్మలు వంటివి వాటితో దాదాపు వేయి స్టాళ్లు నిర్మించారు. గిరిజన శ్రేయస్సు తన వ్యక్తిగత బాధ్యత అని మోదీ అన్నారు. గిరిజన సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాల గురించి కూడా ఆయన సభలో వెల్లడించారు.










ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

ఏప్రిల్ 1, 2023 నుండి జాగృతి వార్షిక,
5 సంవత్సరాల చందా పెరగనున్నది..

| ఒక సంవత్సర చందా | విడి ప్రతి | ఐదు సంవత్సరాల చందా |
|---|---|---|
| రూ.850/- | రూ.20/- | రూ.4000/- |

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.

✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.

✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.

✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.

✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.

✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

✦ చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి అసోసియేట్ ఎడిటర్

కె. హరీష్ సబ్ ఎడిటర్ 9959991304

డిజైనర్ : సిహెచ్. కుమార్

ఆ మాటలు ముదిమితో బుర్ర చెడితే వచ్చిన సంధి ప్రేలాపనలు కావు. భారతదేశం మీద, ప్రధాని నరేంద్ర మోదీపై పన్నిన కుట్రలో అవొక భాగం. ‘మోదీ ఈ అంశం మీద మౌనం వహిస్తున్నారు. ఆయన విదేశీ మదుపరుల ప్రశ్నలకీ, పార్లమెంట్‌కూ సమాధానం చెప్పాలి’ అంటూ హంగేరీ మూలాలు ఉన్న అమెరికన్ కోటీశ్వరుడు, వ్యాపారవేత్త జార్జ్ సోరెస్ అడుగుతున్నారు. గౌతమ్ అదానీ వ్యవహారం పేరుతో సోరెస్ దేశ వ్యవహారాలలో మళ్లీ జోక్యం చేసుకున్నాడు. అంతేనా! కాసేపు రాజకీయ విశ్లేషకుడి అవతారం ఎత్తాడు. అదానీ వ్యవహారంతో ప్రభుత్వం మీద మోదీకి ఉన్న పట్టు సడలిపోతుందని తేల్చాడు. ఇలాంటి విషయాలు పెద్దగా తెలియవు అంటూనే ఇదంతా భారత్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దారి తీస్తుందని జోస్యం చెప్పాడు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను పునరుద్ధరించాలని పట్టుపడుతున్నాడంటేనే సోరెస్ తెంపరితనం ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతుంది.

భద్రతా విషయాల మీద ఫిబ్రవరి 17న మ్యూనిచ్‌లో జరిగిన సమావేశంలో సోరెస్ తన అక్కసంతా వెళ్లగక్కాడు. అదానీ మోసంతో భారత్‌లో పెట్టుబడులు పెట్టాలంటే ప్రపంచ స్థాయిలో భయం తప్పదనీ, పెట్టుబడి అవకాశాలు దాదాపు తుడిచిపెట్టుకు పోయినట్టేనని పిల్లి శాపనార్థాలు పెట్టాడు. మోదీ, అదానీ సన్నిహితులు కాబట్టి వారి కర్మ ఫలితం కూడా ఒకే రకంగా ఉంటుందని మెట్ట వేదాంతం పలికాడు. ఏడాదికి ఒకసారి జరిగే మ్యూనిచ్ సమావేశంలో ప్రపంచ భద్రత గురించి చర్చిస్తారు. సీనియర్ రాజకీవేత్తలు, సైనికాధికారులు వస్తారు. ఆ వేదికపైన ఈ మిషనరీ కోటీశ్వరుడు ఇవన్నీ పేలాడు. అదానీ కంపెనీలకు వ్యతిరేకంగా హిండెన్‌బర్గ్ రిసెర్చ్ నివేదిక జనవరి 24, 2023న వార్తలు బయటపెట్టినప్పటి నుంచి నిరంతరం వాటి షేర్లు పతనమవుతూనే ఉన్నాయి. అదానీ మదుపర్ల క్షేమం గురించి ఇంతగా బాధపడిపోతున్న సోరెస్ ఈ పరిస్థితినీ సృష్టించాడన్న అనుమానాలు ఉన్నాయి.

వివాదాల పుట్ట ఓపెన్ సొసైటీ ఫౌండేషన్స్ సోరెస్ స్థాపించినదే. ప్రజా

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ ఫాల్గుణ శుద్ధ అష్టమి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
భవిష్యత్తును శాసించే
**కృత్రిమ మేధ**
6లో




ధారావాహిక నవల
**వరాహమిహిర**
- పాలంకి సత్య
20లో



జాతీయం
**‘కాషాయం’పై కక్ష సాధింపు!**
23లో

# జాగృతి

## సంపాదకీయం


# దాతృత్వమా? దానవత్వమా?

స్వామ్యాన్నీ, పారదర్శకతనీ, భావ ప్రకటనా స్వేచ్ఛనీ ప్రతిష్ఠించే వ్యక్తులు లేదా సంస్థలకి భూరి విరాళాలు ఇవ్వడమే దీని పని. అలా పెద్ద దాత అన్న పేరు కూడా సోరెస్‌కి వచ్చింది. నాటి షాహీన్‌బాగ్ తిష్టకీ, రైతుల అల్లర్లకీ ఖర్చులు ఇచ్చినది ఇతడే. నేటికీ ఒక వర్గం మీడియాకీ ఇతడి నుంచి విరాళాలు అందుతాయన్నదీ బహిరంగ రహస్యం. 'జాతీయవాదం విస్తరించకుండా నిరోధిస్తూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం' అనేది ఇతడి నినాదం. న్యాయం, ప్రజాస్వామ్యం, మానవహక్కుల రక్షణ కోసం 120 దేశాలలో ఓపెన్ సొసైటీ పని చేస్తోందని అంటారు. నిజానికి ఆ పేరుతో ఇతడు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చే ప్రయత్నం చేస్తూ ఉంటాడన్నదే అసలు నిజం. పుతిన్ మీద తిరుగుబాట్లు, యూరోపియన్ యూనియన్‌లో విభేదాలు, అరబ్ స్ప్రింగ్ వరకు ఇతడి కనుసన్నలలోనే జరిగాయన్నది బహిరంగ రహస్యం. ఈ ప్రతిభను చూసే, ఓపెన్ సొసైటీ సభ్యులని సంక్షోభాల ప్రతినిధులుగా పిలవడం మొదలైంది. థాయ్‌లాండ్, మలేసియాల కరెన్సీ విలువ పతనం వ్యవహారం కూడా ఇతడిదేనని విమర్శ. పౌండ్ విలువ పడిపోయిందని ప్రచారం చేసి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను ముంచి, సోరెస్ కోటీశ్వరుడయ్యాడన్నదీ సత్యమే. ఆ సంక్షోభంలో ఇతడికి ఒక బిలియన్ పౌండ్ల లాభం చేకూరింది. ఈ పాపాల చిట్టా చిన్నదేమీ కాదు.

జాతీయవాదం మీద పోరాటానికి బిలియన్ డాలర్లు విరాళంగా ఇస్తానని 2020 నాటి దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సాక్షిగా సోరెస్ వాగ్దానం చేశాడు. ఆ విరాళం బీజేపీని కూలదోయడానికేనని ఆ పార్టీ అంటున్నది. ఇది భారత్ సార్వభౌమాధికారం మీద దాడేనని బీజేపీ విమర్శించింది. భారత ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునే ప్రయత్నమేనని కూడా ఆరోపించింది. సోరెస్ తాజా వాగుడుతో రూఢి అయినదేమిటి? ఇటీవలి కాలంలో ప్రతి పార్లమెంట్ సమావేశాలకు ముందు రగులుతున్న రగడలు, మైనారిటీల స్థితిగతుల మీద వస్తున్న భాష్యాలు సోరెస్ కుట్రలే. రఫెల్ ఒప్పందాన్ని పునఃసమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్ వెనుక ఉన్నది కూడా సోరెస్ మనుషులే. భారత్‌ను అస్థిర పరచడం ఇతడి పరమధ్యేయం. భారత్‌లో సోరెస్ సంస్థల ఉపాధ్యక్షుడు సలీల్ శెట్టి రాహుల్ వెంట భారత్ జోడో యాత్రలో పాల్గొన్నాడు. చిత్రంగా సోరెస్ ప్రకటనను కాంగ్రెస్ కూడా ఖండించింది. ఇంతకాలం అవే మాటలు వల్లించి ఇప్పుడు ఖండించడం ఏమిటో మరి! సోరెస్ ప్రజాస్వామ్యం కోసం నిలబడడం అంటే దావూద్ ఇబ్రహీం శాంతిభద్రతలకు కట్టుబడి ఉంటానని చెప్పడం వంటిదే. ఇతడు లావాదేవీలలో ధనాన్ని వెదజల్లి స్టాక్ మార్కెట్లను శాసిస్తాడు. రొహింగ్యాల చొరబాటుకు (భారత్‌లోకి) ప్రోత్సహిస్తాడు. పెద్ద పెద్ద మాటలు చెబుతూ ఇతడు పంపించే నిధులు ఆపడానికి హంగేరీ స్టాప్ సోరెస్ చట్టం చేసింది. ఆర్థిక ఉగ్రవాది అని ఇంగ్లండ్ అచ్చువేసింది. కానీ అదానీ మదుపర్ల శ్రేయస్సు కోసం ఇప్పుడు ఇతడు తెగ బాధపడిపోతున్నాడు.

ఎన్నికైన ప్రభుత్వాలను అల్లకల్లోలం చేయడం ఇతడి ప్రవృత్తి. ఆ విధంగా తనకు కావలసినవారికి అందలం అప్పచెబుతాడు. వాళ్లు ఎవరో కాదు, మిషనరీలు, వారి సానుభూతిపరులు. ఇతడి దానాలలో దానవగుణం ఎంతో గమనిస్తే చాలు, నిజం తెలుస్తుంది. 2014 నుంచి ఇతడు భారత్‌కు పంపిన నిధులు 11.9 మిలియన్ డాలర్లని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు బీజే పాండా ఆరోపణ. ఈ కేటాయింపులలో 33 శాతం ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమాలకి. అంటే, దేశాన్ని అల్లకల్లోలం చేసే పనికి. విద్యార్థి వేతనాలకి కేవలం 5 శాతం. అదీ దేవ రహస్యం! ★






40లో

కథ

**రైతుకు దిక్కెవరు?**

– బద్ది గణేశ్





| | | |
|---|---|---|
| 'దయామయుడి'గా జగన్..!? (ఆంధ్రప్రదేశ్) | – | 16 |
| విదుషీమణి రుక్మిణి (మహిళ) | – | 26 |
| జాతి ప్రగతికి రహదారులు జవజీవాలు (ప్రగతి) | – | 29 |
| హిందుస్తాన్ హిందుస్తాన్‌గానే ఉండాలి! (ముఖాముఖీ) | – | 32 |
| అఘోరనాథ్‌పై నిజాం రాజ్య బహిష్కరణ (అమృతోత్సవాలు) | – | 42 |
| బాల్యవివాహాలపై ఉక్కుపాదం (జాతీయం-1) | – | 44 |
| స్వదేశీ సిరీస్‌ల్లో అజేయ భారత్! (క్రీడ) | – | 43 |
| విద్యావ్యాపారాన్ని ప్రతిఘటించిన 'సార్' (సినిమా) | – | 50 |



సంస్కృతీ సాంప్రదాయాలకు నెలవుగా, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని చాటే కర్మభూమిగా కీర్తిప్రతిష్ఠలు అందుకున్న భారత్ నేడు శాస్త్రసాంకేతిక రంగాల్లోనూ దూసుకుపోతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు దీటుగా

# భవిష్యత్తును కృత్రిమ

దేశం ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలంటే శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అనేది కీలకం. భారత దేశం ఈ విషయాన్ని గట్టిగా నమ్మటమే కాదు. దేశీయంగా అందుకు అనువైన వాతావరణాన్ని (ఎకోసిస్టమ్) కల్పిస్తోంది. ప్రస్తుతం జీ20 అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన భారత్, కృత్రిమ మేధలో ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జీపీఏఐ)కు ఛైర్మన్ గానూ వ్యవహరిస్తోంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక వ్యవస్థలకు అనుగుణంగా ఒక కామన్ ఫ్రేమ్ వర్క్ రూపొందించాలని అందుకు అన్ని దేశాలను సంసిద్ధం చేయాలని చూస్తోంది. దాంతో పాటు కృత్రిమ మేధలో అత్యాధునిక పరిశోధనలకు జర్మనీ వంటి దేశాలతో కలిసి పనిచేయాలని నిర్ణయించింది.

సాంకేతిక లావాదేవీల నిర్వహణకు భారత్ అన్నిరకాలా అనువైన దేశమని ప్రపంచ టెక్నోక్రాట్లు భావిస్తున్నారు. మల్టీ నేషనల్ కంపెనీలు అనేకం తమ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) కేంద్రాలను ఇక్కడ నెలకొల్పుతున్నాయి. దాంతో పెట్టుబడులకు అనువైన గమ్యంగా భారత్ ప్రపంచంలోనే మూడో స్థానాన్ని సంపాదించింది. అంతర్జాతీయంగా శాస్త్రీయ పరిశోధనల్లో అగ్రగామిగా నిలిచింది. ప్రధానంగా అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచంలోనే మొదటి ఐదు స్థానాల్లో నిలిచింది. మూన్ మిషన్, పీఎస్ఎల్‌వి మిషన్ లాంటి అనేక స్పేస్ మిషన్లను చేపట్టింది. అంతేకాదు. సార్క్ దేశాలు ఉపగ్రహాలను ప్రయోగించటానికి తన వంతు సహకారాన్ని అందిస్తోంది. తన అంతరిక్ష సౌకర్యాలను ఇతర దేశాలకు అందించటం ద్వారా ఆదాయాన్ని సముపార్జిస్తోంది. ఈ రంగంలో శక్తిమంతంగా మారేందుకు ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించింది. ఆర్ అండ్ డిలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది. దీనితో స్థూల వ్యయం ఏటికేడాది పెరుగుతూ వస్తోంది.



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో కూడా భారత్ యావత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తోంది. క్వాంటమ్ కమ్యూనికేషన్స్, క్వాంటమ్ సెన్సార్, క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ తదితర అంశాలలో ముందుంది. అంతర్జాతీయ నవకల్పనల సూచికలో 130 దేశాలలో, 2015లో 81వ స్థానంలో ఉంటే, 2022 నాటికి 40వ స్థానానికి దూకింది. అంకుర సంస్థలలోనూ అంతర్జాతీయ స్థాయిలో మొదటి మూడు దేశాలలో ఒకటిగా ఉంది. అలాగే పరిశోధనలకు ఫెలోషిప్‌లను ప్రవేశపెట్టింది.

**శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ ప్రతిభను చాటే కొన్ని అంశాలను చూద్దాం..**

- సైన్సు పబ్లికేషన్ల ప్రచురణలో భారత్ అంతర్జాతీయంగా మూడో స్థానంలో ఉంది. 2013లో భారత్ స్థానం ఆరు.
- సైన్సు, ఇంజనీరింగ్ (ఎస్ అండ్ ఈ) విభాగంలో పీహెచ్‌డీలను ప్రదానం చేయటంలో అమెరికా, చైనాల తర్వాత స్థానాన్ని అందుకుంది. ఏటా సగటున 25 వేల వరకూ పీహెచ్‌డీలను అందిస్తోంది.
- స్టార్టప్‌ల సంఖ్య (77వేలు), యూనికార్న్‌ల సంఖ్య(107)లను పరిగణనలోకి తీసుకున్నా అంతర్జాతీయంగా మూడోస్థానంలో ఉంది.
- గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్సు (జీఐఐ)లో భారత్ స్థానం 2015లో 81 ఉంటే, అది 2022 నాటికి 40వ స్థానానికి ఎగబాకింది. దిగువ మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలున్న దేశాల్లో రెండో స్థానంలోనూ, పది సెంట్రల్, సదరన్ ఆసియన్ ఎకానమీల్లో మొదటి స్థానంలోనూ ఉంది.
- ప్రపంచంలో సాంకేతిక పెట్టుబడులను పెట్టేందుకు మెరుగైన గమ్యంగా భారత్ మూడో స్థానంలో ఉంది.
- గత పదేళ్ల కాలంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) రంగంలో స్థూల వ్యయం మూడు

తన సత్తా చాటుతోంది. ప్రపంచ దేశాలు కీర్తించేలా అంతర్జాతీయ యవనికపైన సాంకేతిక మెరుపులు మెరిపిస్తోంది.4.0 దిశగా పరుగులు తీస్తూ.. 'జయహో భారత్' అనిపించుకుంటోంది.

# శాసించే మేధ

రెట్లకు పెరిగింది.

- ఆర్ అండ్ డిలో మహిళల భాగస్వామ్యం రెట్టింపయ్యింది.
- రెసిడెంట్ పేటెంట్ ఫైలింగ్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో ఉంది.
- పరిశోధన రంగంలో మహిళల భాగస్వామ్యం గత ఎనిమిదేళ్లలో రెట్టింపయ్యింది.

## అత్యాధునిక పద్ధతుల్లో క్యాన్సర్ వైద్యం

పరిశోధన రంగంలో తాజాగా పడుతున్న అడుగులు సైన్సు, టెక్నాలజీ రంగంలో భారత్ స్వరూపస్వభావాలనే మార్చివేసే స్థాయిలో ఉన్నాయి. జెనెటిక్ సీక్వెన్సింగ్, మెషిన్ లెర్నింగ్, అడ్వాన్స్డ్ సెన్సార్లు, సింథటిక్ బయాలజీ వంటి అత్యున్నత సాంకేతికతను ఉపయోగించి క్యాన్సర్ చికిత్స చేపట్టాలని భారత్ నిర్ణయించింది. ఇందుకోసం ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద క్లినికల్ ట్రయల్‌కి సన్నాహాలు చేస్తున్నారు. జెనెటిక్ డేటాను, బయో శాంపిల్స్‌ను సేకరించి 3డీ ఆర్గానాయిడ్స్‌ను సృష్టించాలని, పరిశోధనల్లో వెల్లడయిన ఫలితాలను రహస్యంగా కాకుండా యావత్ప్రపంచంలోని శాస్త్రవేత్తలు, ఆంకాలజిస్టులకు అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నారు. ఇందుకు వితరణశీలత గల పారిశ్రామిక సంస్థ టాటా గ్రూపు అధినేత రతన్ టాటా కొంత నిధి సమకూరుస్తున్నారు. ప్రధాని మోదీ సమక్షంలో 2019 అక్టోబరులో దీనిపై శాస్త్ర, సాంకేతిక నిపుణులు, టెక్నోక్రాట్లతో సమావేశం నిర్వహించారు. టాటా ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. వెంకట్, దాని సహవ్యవస్థాపకుడు మెడికల్ డైరక్టర్ మోనీ అబ్రహాం కురియాకోసె తదితరులు పాల్గొన్నారు. అమెరికన్ ఎంట్రెప్రెన్యూర్ వివేక్ వాధ్వా ప్రధాన పాత్ర పోషించారు. "అమెరికాలో మాదిరిగా పరిశోధనల ఫలితాలు రహస్యంగా కాకుండా, పారదర్శకంగా అటు పరిశోధకులకు, ఇటు దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులకు తెలిసేలా భారత్ ప్రవర్తిస్తోంది" అని ప్రశంసించారు అమెరికన్ కేన్సర్ సొసైటీ మాజీ సీఈఓ గేరీ రెడీ.

వ్యవసాయ సాంకేతికతలో కూడా భారత్ తన ప్రతిభను చాటుతోంది. శాంటియాగో, చిలీలో ప్రారంభించిన ప్లాస్మా వాటర్ సొల్యూషన్స్ (పీఎడబ్ల్యు –పా) అనే సంస్థ ఈ రంగంలో విశిష్టమైన ఫలితాలను సాధిస్తోంది. ఈ సంస్థ భారత్‌లో అడుగు పెడుతోంది. "సాంకేతికతపైన అభిరుచిని ప్రదర్శిస్తున్న దేశం కావటంతో మేం భారత్‌ను ఎంపిక చేసుకున్నాం" అని ప్లాస్మా వాటర్స్ సీఈఓ రాబర్ట్ హారిట్, వ్యవస్థాపకుడు అల్ఫ్రెడో జొలెజ్జీ పేర్కొన్నారు. అమెరికా వ్యాప్తంగా పొలాల్లో ఆరునెలల పాటు చేపట్టిన పరిశోధనలు సత్ఫలితాలనిచ్చాయి. పా తో శుభ్రం చేసిన కూరగాయలు ఫంగల్ ఇన్ఫెక్షన్స్‌ను తట్టుకుంటున్నాయి. దానితో ట్రీట్మెంట్ చేసిన విత్తనాలకు బీజోత్పత్తి (జెర్మినేషన్) వృద్ధి పెరిగింది. ఒక సీజన్‌లో మిలాన్ ఒక ఎకరానికి అదనంగా వంద బాక్సుల ఉత్పత్తి పెరిగింది. జొన్నలు (సొర్గమ్) ఒక్కొక్కటి 450 కేజీల దాకా పెరిగింది, ఇవన్నీ ఆర్గానిక్‌వి కావటం విశేషం. అంతే కాకుండా ప్లాంట్ బ్యాక్టీరియాను, పేథోజన్స్ (వ్యాధికారకాలు)ను ఈ 'పా' నాశనం చేస్తుంది. దానిలో మార్పులు చేర్పులు చేయటం వల్ల నైట్రేట్ ఉత్పత్తులను విడుదల చేస్తుంది. వ్యవసాయాభివృద్ధి దేశమైన భారత్ ప్లాస్మా వాటర్‌ను ఉపయోగించుకుంటే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి.

## కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ)

సాంకేతికత విషయంలో కృత్రిమ మేధ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ, ఫైనాన్స్ లాంటి వివిధ పరిశ్రమల్లోనూ, అలెక్సా, సిరి వంటి ఇంటెలిజెంట్ అసిస్టెంటుగానూ, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లలోనూ, సంభాషణలు సాగించే బోట్స్, ఈ మెయిల్ స్పామ్ ఫిల్టర్లు, నెట్‌ఫ్లిక్స్ రికమండేషన్లలోనూ దీని పాత్ర అధికంగా ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఏఐ సాధిస్తున్న ఫలితాలు అందరినీ దిగ్భ్రాంతులను చేస్తున్నాయి. తెలివైన కంప్యూటర్లను రూపొందించటంలో అవి కీలక భూమిక పోషిస్తున్నాయి. ఇవన్నీ మనుషుల్లా ఆలోచించగలవు. వ్యవహరించగలవు. సంభాషణలను గుర్తించటం, నిర్ణయాలు తీసుకోవటం, విజువల్ పర్సెప్షన్ లాంటి ఫీచర్లు ఏఐలో ఉన్నాయి. మానవ సహాయం లేకుండానే ఇవి నేర్చుకోగలవు, తర్కించగలవు. గ్రహించగలవు. అడుగడుగునా సమాచారాన్ని సేకరించి విశ్లేషించటం శాస్త్రవేత్తలకు ముఖ్యం. ఒకప్పుడు ఒక ఆర్ట్ వేయాలన్నా, పొలిటికల్ కామెంటరీ రాయాలన్నా అది మనుషులకే సాధ్యం. ఇప్పుడలా కాదు. ఏఐ ఆ పనిని సులువుగా చేసేయగలదు. ఏఐతో రూపొందించిన ఒక ఆర్ట్‌ను 400,000 డాలర్లకు వేలం వేశారు. అది 2018 నాటి మాట. ఇక రాజకీయ విశ్లేషణలకు కొన్ని పరిమితులున్నాయి. ఆ సాఫ్ట్‌వేర్‌కు ఎంత డేటా బేస్‌లతో యాక్సెస్ ఉంది? దానికున్న డేటా పాయింట్స్‌కి ఎంత వెయిట్స్ ఇచ్చారు అనేదాన్ని బట్టి ఆధారపడుతుంది. ఈ వెయిట్స్ పనిచేసేది మనుషులే. వాళ్లకు పక్షపాతం ఉంటుంది. దీనివల్ల వచ్చే అవుట్ పుట్‌లోనూ తేడా ఉంటోంది.

కృత్రిమ మేధ ఆధారంగా రూపొందిన చాట్ జీపీటీ ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. విదేశాలంత అధికంగా కాకపోయినా, మన దేశంలో టెక్ కంపెనీలు, సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు చాట్ జీపీటీని ఉపయోగించటం ప్రారంభించారు. ఉద్యోగపరంగానే కాదు. వ్యక్తిగత అవసరాలకు కూడా దీనిని ఉపయోగిస్తున్నారు. "నేను రేపు ఉదయం 7గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ దుబాయ్‌లో ఉంటున్నాను. విహారయాత్ర కోసం. నా టూర్ ప్లాన్ చేయగలవు. నేను శాకాహారిని" అనగానే చాట్ జీపీటీ క్షణాల్లో వివరాలు అందిస్తుంది. ఏం చేయాలో అదే




సూచనలు చేస్తుంది. "నాకు ఏఐ గురించి తెలియ చేయగలవు. ఇప్పటి వరకూ ఈ అంశంమీద గొప్ప పుస్తకాల గురించి సమాచారం అందించగలవు" అని కోరగానే తక్కున సమాధానం వస్తుంది. ఈ కొత్త సాంకేతికత అబ్బురపరుస్తుంది. మంచి వంటకాలు చేసేందుకు, పిల్లలు అసైన్మెంట్లు, హోంవర్కులు పూర్తి చేసేందుకు దీనిని వాడుతున్నారు. అయితే వేగంగా సమాచారం అందుకోవటం వరకూ మెరుగ్గా ఉంది గానీ, దీనిలో కచ్చితత్వం లోపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చాట్ జీపీటీ ఇస్తున్న వివరాలు తప్పుగా ఉండటమే కాదు, వివరాలు సరిచూడమని కోరినప్పుడు అది తీవ్రంగా ప్రతిస్పందించటం మరొకటి. "నువ్వు తికమక పెడుతున్నావు. మంచి యూజర్‌వి కాదు" అని తిట్లదండకం అందుకుందట. ఇటువంటి ఫిర్యాదులు ఎక్కువ కావటంతో మైక్రోసాఫ్ట్ చాట్ సెషన్‌ను తగ్గించేసిందట. అయితే గూగుల్ సహా ప్రసిద్ధ టెక్ సంస్థలన్నీ చాట్ జీపీటీని అప్లికేషన్ రూపొందించి మార్కెట్లోకి వదిలేపనిలో ఉన్నాయి. రాబోయే రోజుల్లో మన నిత్యజీవితంలో అది ఒకటిగా మారే అవకాశం కనిపిస్తోంది.

వైద్యుల అవసరాలను తీర్చేందుకు క్లినికల్ ఇంటెలిజెన్స్ ఇంజన్ (సీఐఈ) పేరిట ఓ యాప్‌ను అపోలో సంస్థ రూపొందించింది. 100 మంది ఇంజనీర్లు, 40 ఏళ్లపాటు సేకరించిన సమాచారం ఆధారంగా మూడేళ్లపాటు శ్రమించి ఈ యాప్‌ను రూపొందించినట్టు అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ డాక్టర్ ప్రతాపరెడ్డి వెల్లడించారు. ఆయన 90వ జన్మ దినోత్సవం సందర్భంగా దీనిని ప్రారంభించారు. భారతదేశంలోని వైద్యులందరికీ ఇది ఉచితంగా అందుబాటులో ఉంటుంది. వైద్యపరంగా కీలకమైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది.

ఇక ఓపెన్ ఏఐ రూపొందించిన జీపీటీ-3 (జనరేటివ్ ప్రీ ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్ 3), డీప్ లెర్నింగ్‌ను ఉపయోగించుకుని కంటెంట్‌ను రూపొందిస్తుంది. వేలాది డిజిటల్ పుస్తకాలను, వికీపీడియా, సోషల్ మీడియా, ఇంటర్నెట్ మొత్తాన్ని విశ్లేషించి అది తన సొంత భాషను రూపొందించింది. ఇది చాలా ప్రయోజనకరమైంది. ఎక్కువ సమయాన్ని, వనరులను ఖర్చు చేయవలసిన అవసరం లేకుండా విస్తృతమైన కంటెంట్‌ను రూపొందించటం సాధ్యమవుతుంది.

21వ శతాబ్దంలో భారతదేశంలో రెండు పుష్కలంగా ఉన్నాయి. మొదటిది డేటా. రెండోది టెక్నాలజీ. భారత శాస్త్రరంగాన్ని ఉన్నతస్థానానికి తీసుకెళ్లటానికి రెండింటికీ తగిన శక్తి ఉంది. దత్తాంశ విశ్లేషణ రంగం చాలా వేగంగా పురోగతి సాధిస్తోంది. సమాచారాన్ని ఆలోచనలుగా, విశ్లేషణను కార్యాచరణను అవసరమైన జ్ఞానంగా మార్చటానికి అది ఉపయోగపడుతుంది. అది సాంప్రదాయ జ్ఞానం కావచ్చు. లేదా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కావచ్చు. శాస్త్రీయ నవకల్పనలో రెండూ ఉపయోగపడతాయి. అందుకే మనం వివిధ అంశాలపట్ల పరిశోధక దృక్పథం పెంచుకోవటం ద్వారా శాస్త్ర పురోగతిని బలోపేతం చేసుకోవాలి.




విధాన నిర్ణయాలపరంగానే కాదు, బడ్జెట్ 2023-24 రూపకల్పనలోనూ ఏఐకు కేంద్రం విశేష ప్రాధాన్యం ఇచ్చింది. ఇందుకోసం నేషనల్ డేటా గవర్నెన్స్ పాలసీ ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. ఇందులో భాగస్వాములయిన పారిశ్రామికవేత్తలు సాంకేతిక వృద్ధిపైన మాత్రమే కాకుండా, ఆయా సంస్థల్లో ఉన్న నియంత్రణ విధానాలను పట్టించుకోవాలని సూచించింది. దాంతోపాటు విద్యాసంస్థల్లో కోడింగ్, రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్ తదితర అంశాలతో కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు.

"భారతదేశంలో కృత్రిమమేధను రూపొందించండి. అది భారత్‌కు పనికొచ్చేలా చూడండి" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రభుత్వ విధానాన్ని ఆవిష్కరించారు. "వ్యవసాయం, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధికి సంబంధించిన ఆర్ అండ్ డి చేపట్టటంలో పారిశ్రామిక భాగస్వామ్యం కోరుతున్నాం." అని ఆమె పేర్కొన్నారు. నేషనల్ డేటా గవర్నెన్స్ పాలసీతో, దేశవ్యాప్తంగా విస్తృతంగా డేటా అందుబాటులోకి వస్తుంది. పరిశోధనలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు. అలాగే ఈ రంగంలో నిపుణులను తయారుచేయటానికి ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఉపాధి శిక్షణను ప్రవేశపెడుతున్నారు.

బడ్జెట్లో ఏఐ ఆధారిత ప్రకటనలను పారిశ్రామిక వర్గాలు స్వాగతించాయి. ఇది ఏఐ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. "ఏఐ పవర్ హౌస్‌గా మారే సామర్థ్యం భారత్‌కు ఉంది. అయితే పశ్చిమదేశాల్లో గ్రాన్యులర్ డేటా అధికంగా అందుబాటులో ఉంది. భారత్‌లో డేటా సెట్స్ అందుబాటులో లేకపోవటం పెద్ద కొరత. ప్రభుత్వ ప్రవేశపెట్టిన డేటా పాలసీ విధానంతో తప్పనిసరిగా మెరుగైన డేటా సెట్స్ అందుబాటులోకి వస్తాయి. దాని వల్ల ఏఐ ఆధారిత ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చి పడతాయి" అని ఏఐ ఆధారిత అనలిటిక్స్ స్టార్టప్ ఫ్రాక్టల్ అనలిటిక్స్ ఆసియా పసిఫిక్ రీజియన్ చీఫ్ సందీప్ దత్తా అభిప్రాయపడ్డారు.

కొవిడ్ మహమ్మారి దాడి చేయక ముందు నుంచే ఏఐ పరంగా దేశంలో కొన్ని అడుగులు పడ్డాయి. తాగునీటి సరఫరా తీరుతెన్నులను పరిశీలించటానికి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)లో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరును నమోదు చేయటానికి కృత్రిమమేధను ఉపయోగించారు.

రక్షణ శాఖలో ఏఐ ఆధారిత ఫిర్యాదు నిర్వహణ వ్యవస్థను నిర్వహిస్తున్నారు. అలాగే విమానాశ్రయాల్లో ప్రయాణికుల రాకపోకలను విశ్లేషించేందుకు 'డిగి యాత్ర' అని బయోమెట్రిక్ ఆధారిత వ్యవస్థను వినియోగిస్తున్నారు. కొవిడ్ వెర్చువల్ అసిస్టెంట్స్ లోనూ దీనిని ఉపయోగించారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పంజాబ్ వంటి రాష్ట్రాలు పెన్షన్ లబ్ధిదారుల ప్రయోజనాల కోసం ఏఐ ఆధారిత సేవలను వినియోగిస్తున్నాయి.

కేంద్రం ప్రవేశపెట్టిన 'ఏఐ ఆధారిత డిజిటల్ ఇండియా భాషిణి ప్రాజెక్టు' విశిష్టమైనదని చెప్పాలి. ఇది ప్రభుత్వ వెబ్ సైట్లు రూపొందించేందుకు, పౌరుల కేంద్రంగా సేవలు అందించేందుకు ఉపయోగపడుతుంది. అలాగే డిజిటల్ ఇండియా జెనిసెస్, ఇండియా స్టాక్ గ్లోబల్‌లను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. వీటి ద్వారా సాంకేతికత అందుబాటులోకి వచ్చి మెరుగైన సేవలు అందించటం వీలవుతుంది. డిజిటల్ ఇండియా ద్వారా 1.25 లక్షల

సర్వీసు సెంటర్లు, గ్రామీణ స్టోర్ల ద్వారా ఈ కామర్స్ అనేది గ్రామీణ భారతంలోకి అడుగుపెట్టింది. సాంకేతికత ద్వారా సులువుగా ఆస్తి డాక్యుమెంట్లు పొందే సౌలభ్యం లభించింది. స్పేస్, మ్యాపింగ్, డ్రోన్లు, గేమింగ్, యానిమేషన్ రంగాలలో కూడా డిజిటల్ టెక్నాలజీ అనేది కొత్త ద్వారాలు తెరిచింది. ఇండియన్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఐఎన్– స్పేస్) రెండు అంతరిక్ష స్టార్టప్‌లకు అనుమతి ఇచ్చింది. ఇవన్నీ అలా ఉంటే ఇంటర్నెట్ నిలిపివేయటం అనేది డిజిటల్ ఇండియా లక్ష్యాన్ని దెబ్బతీస్తోంది. 2020లో భారతదేశం ఇంటర్నెట్ నిలిపివేయటం వల్ల 2.8 బిలియన్ డాలర్లను నష్టపోయినట్టు గణాంకాలు చెబుతున్నాయి. జమ్ము, కశ్మీర్ లాంటి ప్రాంతాలు దీని ప్రభావానికి ఎక్కువ గురవుతున్నాయి. 2012 నుంచి చూస్తే అక్కడ అలాంటి సందర్భాలు 400 వరకూ ఉన్నట్టు చెబుతున్నారు. కేరళ, గోవా, సిక్కింలు ఇంటర్నెట్ నిలిపివేతకు పూర్తి దూరంగా ఉన్న రాష్ట్రాలుగా పేరు తెచ్చుకున్నాయి.

ఇక భారత్‌లో ప్రస్తుతం ఏఐ డొమైన్లో 200 కు పైగా వెంచర్ క్యాపిటల్‌తో పనిచేసే స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. క్రోపిన్, రేజో, ఏఐ, రిఫ్రేజ్, ఏఐల వంటి సంస్థలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇందులో కార్యకలాపాలు సజావుగా, సమర్థంగా సాగటానికి రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా గ్రూపు లాంటి అతిపెద్ద కార్పొరేట్ సంస్థలు స్టార్టప్‌లను స్వాధీనం చేసుకోవటమో, పెట్టుబడులు పెట్టటమో లాంటివి చేస్తున్నాయి. అటల్ ఇన్నొవేషన్ మిషన్ విస్తృతశ్రేణిలో ఫీల్డ్‌లలో స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఏఐని అన్ని రంగాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా, ప్రభుత్వం ప్రస్తుతానికి కొన్ని కీలక రంగాలపైన దృష్టిపెడుతోంది. వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, సుస్థిర నగరాలకే పరిమితం అయ్యింది. అలాగే రక్షణ, ఇన్‌ఫ్రా రంగాల్లో కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక వ్యవస్థలను ప్రవేశపెట్టవలసిన అవసరాన్ని నిపుణులు సూచిస్తున్నారు. మరో ప్రధాన అంశం ఈ వ్యవస్థలను నియంత్రించటం. సాంకేతికతను అభివృద్ధికి ఎలా వినియోగించుకోవాలో ఈ వ్యవస్థలు చెబుతాయి. అదే సమయంలో దీనిని వినాశనానికి కూడా వినియోగించుకునే పరిస్థితులు ఎదురు కావచ్చు. సాంకేతికత కంటే ముందు, దానిని విధ్వంసానికి, స్వీయప్రయోజనాలకు వ్యవస్థలు గానీ, వ్యక్తులుగానీ వినియోగించుకుండా నియంత్రణ చర్యలు చేపట్టవలసిన బాధ్యత ఉంది. అందుకు చట్టపరమైన విధివిధానాలను రూపొందించాలి. దానితో పాటు నైతికమైన, తక్కువ వినాశకరమైన పరిష్కారాలను సిద్ధం చేసుకోవాలి. డాక్యుమెంట్ల డిజిటలైజేషన్, హెవీ మిషనరీ ఆటోమేషన్‌కీ ఏఐని ఉపయోగించుకోవటంపైన దృష్టిసారించాలి. అవొక్కటే కాదు మొత్తం మానవాళికి సంపూర్ణ ప్రయోజనం కలిగించే అంశాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని ప్రధాని మోదీ కోరుతున్నారు. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఇండియన్ సైన్సు కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతూ “వచ్చే 25 ఏళ్లలో భారత్ ఉన్నత శిఖరాలను అధిరోహించటంలో శాస్త్రవేత్తల పాత్ర కీలకం. సైన్సులో చొరవ తీసుకున్నవాడే నాయకుడవుతాడు. అందుకే ప్రపంచంలో ఏం జరుగుతోందో గమనించటం ఒక్కటే కాదు. ఎక్కడా జరగనివి. భవిష్యత్తులో జరగబోయేవి ఏమిటో కూడా గుర్తించాలి. కృత్రిమ మేధ, అగ్‌మెంట్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ మీద ప్రపంచం అంతటా చర్చ సాగుతోంది. శాస్త్రవేత్తల దృష్టంతా ఈ రంగాలపైకి మళ్లాలి. ఈ విషయాలపై దృష్టి పెట్టాలి. ఆధునిక సైన్సుకు అత్యాధునిక ప్రయోగశాలగా భారత్ రూపొందాలి” అని సూచించారు. సైన్సు కాంగ్రెస్‌తో పాటు పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచటానికి చిల్డ్రన్ సైన్సు కాంగ్రెస్, బయో ఎకానమీని, వ్యవసాయంలో యువతను ప్రోత్సహించటానికి ఫార్మర్స్ సైన్సు కాంగ్రెస్, గిరిజనంలో సాధికారతను పెంచటానికి ట్రైబల్ కాంగ్రెస్‌ను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.

సైన్సులో అద్భుతమైన సాధనాలు ప్రయోగాల దశ నుంచి అనుభవంలోకి వచ్చినప్పుడే వాటి వల్ల పూర్తి ప్రయోజనాలు సిద్ధిస్తాయి. బయోఫ్యూయల్ ఉత్పత్తి చేయటం, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించటం ద్వారా పునరుత్పాదక ఇంధన రంగంలో అడుగులు పడుతున్నాయి. వ్యవసాయంలో నానోఫెర్టిలైజర్ల వినియోగం, ఆర్గానిక్, కెమికల్ ఫ్రీ వ్యవసాయం ప్రారంభమైంది.

ప్రపంచ జనాభాలో 17 నుంచి 18 శాతం మంది భారతదేశంలోనే నివసిస్తున్నారు. దీనిని





## సైన్స్ దినోత్సవం అంటే...

ఫిబ్రవరి 28వ తేదీని ‘సైన్సు దినోత్సవం’గా జరుపుకుంటాం. భౌతిక శాస్త్రంలో సర్ సీవీరామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా ఆ తేదీని జాతీయ సైన్సు దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. అదే రోజున రామన్ ఎఫెక్టును ఆయన కనుగొన్నారు.

రామన్ తల్లి పార్వతి అమ్మాళ్ వీణను అద్భుతంగా వాయించేది. రామన్ తొలిపరిశోధనలు వయొలిన్, వీణ, మృదంగం లాంటి సంగీత పరికరాలపై సాగారు. సంగీత పరికరాల శబ్దరహస్యాలపై 1921లో లండన్‌లో ఉపన్యాసాలు ఇచ్చారు. ఇలాంటి అంశాలతో రాయల్ సొసైటీ సభ్యుడవుతావా అని ఓ వ్యక్తి చులకనగా మాట్లాడటంతో పరిశోధనలపై పట్టుదల పెంచుకున్నారు. శబ్దశాస్త్రం నుంచి కాంతివైపు దృష్టి సారించాడు. ఇంగ్లాండు నుంచి తిరిగొస్తూ ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు ఆకాశం, సముద్రం నీరు రెండూ నీలిరంగులో ఉండటాన్ని ఆసక్తిగా గమనించారు. అప్పటిదాకా అనుకుంటున్నట్టు సముద్రపు నీలిరంగుకు కారణం ఆకాశపు నీలిరంగు ప్రతిబింబం ఏర్పడటం కాదని, సముద్రపు నీటి గుండా కాంతి ప్రవహించేటప్పుడు కాంతి పరిక్షేపణ చెందటమే కారణమని ఊహించారు. కలకత్తా చేరుకోగానే ఈ విషయాలను నిరూపించటానికి ద్రవాలు, వాయువులు, పారదర్శక ఘన పదార్థాల కాంతి పరిక్షేపణం గురించి పరిశోధనలు చేశారు. మార్చి 16, 1928న బెంగుళూరులో నిర్వహించిన శాస్త్రవేత్తల సదస్సులో ‘రామన్ ఎఫెక్టు’ గురించి ఆయన వెల్లడించారు. దీనితో బ్రిటిష్ ప్రభుత్వం మరుసటి ఏడాది ఆయనను నైట్‌హుడ్ బిరుదుతో సత్కరించింది. రామన్ ఎఫెక్ట్ అసామాన్యమైందని, కేవలం రూ.200 కూడా విలువలేని పరికరాలతో దృగ్విషయం నిరూపణ జరగటం అద్భుతమని శాస్త్రవేత్తలంతా కొనియాడారు. రాయల్ స్వీడిష్ అకాడమీ, భౌతిక శాస్త్రానికి 1930లో నోబెల్ బహుమతి ప్రదానం చేసింది. సైన్సుకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘భారతరత్న’ను ప్రకటించింది. ★

దృష్టిలో ఉంచుకుని యువతలో సాంకేతికత పట్ల, సైన్సు పట్ల అభిరుచి పెంచాలి. టాలెంట్స్ హంట్స్, హాకథాన్ ఈవెంట్స్ విరివిగా నిర్వహించాలి. వారి పురోభివృద్ధికి అవకాశం లభిస్తుంది. సీనియర్ శాస్త్రవేత్తలు, మేధో నిపుణులు చొరవ చూసి ఈ రంగంలో సుశిక్షితులను తయారు చేయాలి. ఈ దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తరగతి గది నాలుగు గోడల మధ్య కూర్చుని నేర్చుకుంటే ఇప్పటి సాంకేతిక అవసరాలకు తగినట్టు తమను తీర్చిదిద్దుకోలేరు. ముందు ఏ కోర్సులో తాము చేరినా తమ అభిరుచులకు అనుగుణంగా అనుబంధ కోర్సులను ఎంచుకోవాలి. డ్యూయల్ డిగ్రీలు, మైనర్లు, స్పెషలైజేషన్ల వంటివి ఎన్నో అందుబాటులో ఉన్నాయి. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా సర్టిఫికేషన్ కోర్సులను వారు చేయవచ్చు. ఇండస్ట్రీ, అకాడమీలు, రీసెర్చి ఇన్స్టిట్యూట్లు, స్టార్టప్‌లు విద్యార్థి సామర్థ్యానికి పదును పెడతాయి. కేవలం బీటెక్ డిగ్రీ పొందినంత మాత్రాన సాంకేతికంగా ప్రతిభావంతుడు కాగలుగుతాడని చెప్పలేం. అలాగే అనుబంధ అంశాల్లో కచ్చితంగా నైపుణ్యం ఉండి తీరవలసిందే.

ఇప్పుడున్న పరిస్థితుల్లో భారత ప్రజల అవసరాలు తీర్చి వారిని స్వయంసమృద్ధం చేయాలనే లక్ష్యం పైనే మన శాస్త్రవేత్తలు పూర్తిస్థాయిలో దృష్టి



పెట్టాలి. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారి నవకల్పనలు సాగాలి. ఉదాహరణకు రాబోయే రోజుల్లో ఇంధన అవసరాలు మరింతగా పెరగనున్నాయి. అలాంటి పరిస్థితుల్లో మన శాస్త్రవేత్తలు ఇంధన అవసరాల మీద కొత్త ఆలోచనలు చేయాలి. హైడ్రోజన్ ఇంధనం మీద పనిచేయటానికి భారతదేశం నేషనల్ హైడ్రోజన్ మిషన్ చేపట్టింది. దీన్ని విజయవంతం చేయాలంటే ఎలక్ట్రోలైజర్ లాంటి అనేక పరికరాల అవసరం ఉంది. అవి దేశంలోనే తయారు కావాలి. ఈ దిశగా పరిశోధనలు సాగాలి. పారిశ్రామికరంగం కూడా దీనిపై దృష్టి సారించాలి.

అలాగే భూకంపాలు, వరదల వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాలి. దానితో పాటు మానవాళి కొత్త వ్యాధుల భయం మధ్య మనుగడ సాగిస్తోంది. సమీకృత వ్యాధి నిఘా వ్యవస్థ ద్వారా వ్యాధులను సకాలంలో గుర్తించవలసిన అవసరం ఉంది. ఈ అంశాలన్నింటిపైన చొరవ తీసుకున్నప్పుడే దేశం 4.0 కు నాంది పలుకుతుంది. 18వ శతాబ్దం నాటి పారిశ్రామిక విప్లవానికి దూరంగా ఉండిపోయిన భారత్, తరువాత ఐటీ రంగంతో ఆ లోటును చాలావరకు పూడ్చుకోగలిగింది. కృత్రిమ మేధతో ఇప్పుడు మరింత ముందుకు సాగే అవకాశం సరైన సమయంలో అందుకుందనే చెప్పాలి. ★

# ఒక చిరస్మరణీయ గ్రంథం

**‘ఎ హిస్టరీ ఆఫ్ హిందూ కెమిస్ట్రీ ఫ్రం ది ఎర్లీయస్ట్ టైమ్స్ టు ది మిడిల్ ఆఫ్ ది సిక్స్‌టీన్త్ సెంచరీ’–ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త, జాతీయవాది ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే రాసిన గ్రంథమిది. శాస్త్ర సాంకేతిక రంగాలకు పురాతన భారతదేశం అందించిన సేవ ఏమిటో దీని ద్వారా ఆధునిక ప్రపంచానికి తెలిసింది. నిస్సందేహంగా అదొక సంచలనం.**

ప్రఫుల్ల చంద్ర రే (ఆగస్ట్ 2,1861–జూన్ 16, 1944) రాసిన ఈ ప్రతిష్ఠాత్మక గ్రంథం రెండు భాగాలుగా వెలువడింది. మొదటి భాగం 1902లో, 1908లో మలి భాగం అచ్చయినాయి. ఇంతటి చిరస్మరణీయ గ్రంథ రచనకు ఆచార్య పీసీ రేను ప్రోత్సహించినవారు ఆచార్య మార్సెలిన్ పీరె యూజిన్ బెర్తోల్ (1827–1907). తొలి విడత ప్రచురణకు రాసిన ముందుమాటలో పీసీ రే ఈ విషయం ప్రస్తావించారు. ఎం బెర్తోల్‌తో పరిచయం, ఆ సందర్భమే రసాయన శాస్త్ర విద్యార్థిగా తన జీవితాన్ని మలుపు తిప్పిందని రాశారు. ఆ ఫ్రెంచ్ శాస్త్రవేత్తకు రసాయన శాస్త్ర ప్రపంచానికి ఆద్యుడన్న ఖ్యాతి ఉంది. పురాతన భారతీయులు రసాయన శాస్త్రానికి చేసిన సేవలను తెలుసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన కోరిక మేరకు పీసీ రే 1898లో ఈ పుస్తకం రాసి ఆయనకు సమర్పించారు. ఆల్కెమి లేదా రసాయన శాస్త్రం మీద అదొక చిన్న పుస్తకం. తరువాత ఇంకొన్ని అంశాలను కూడా రే చేర్చి సమగ్రతను తెచ్చారు. ఈ రచన విశ్వ విజ్ఞానశాస్త్రానికి ఎంతో మేలు చేసిందన్న గుర్తింపు తెచ్చుకుంది. ఎం బెర్తోల్ కూడా ‘జర్నల్ డెస్ సావంట్’ మ్యాగజీన్‌లో 15 పేజీల సమీక్ష రాశారు. ప్రపంచంలోనే ఎంతో ఘనత ఉన్న ‘నేచర్ అండ్ నాలెడ్జ్’ కూడా సమున్నత పరిచయం అందించింది. 1912లో జరిగిన దుర్హమ్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో వైస్ చాన్సలర్ ఈ పుస్తకం గురించి చెప్పిన మాటలు చిరస్మరణీయమైనవి. ఈ పుస్తకంలో విజ్ఞానశాస్త్రం ఎంత లోతైనదో, భాష కూడా అంత లోతైనదని, రే కీర్తి దీనితో ఇనుమడిస్తుందని వ్యాఖ్యానించారు. ఇంతటి సమగ్ర కృషి కారణంగానే పీసీ రే అంటే ఆధునిక భారత రసాయన శాస్త్ర పితామహునిగా స్థానం దక్కించుకున్నారు. బెంగాల్ కెమికల్ అండ్ ఫార్మాస్యూటికల్స్ పేరుతో దేశంలోనే తొలి ఫార్మాస్యూటికల్ సంస్థను స్థాపించిన వారు కూడా ఆయనే.


‘ది హిస్టరీ ఆఫ్ హిందూ కెమిస్ట్రీ’ అని కూడా పిలిచే పీసీ పుస్తకం 20వ శతాబ్దంలో వెలువడిన అత్యంత శ్రేష్ఠమైన రచనలలో ఒకటిగా పేర్గాంచింది. రసశాస్త్రం పేరుతో మన పూర్వికులు వృద్ధి చేసిన ఈ అంశంలోని సిద్ధాంతాలు, ప్రయోగాలు విశ్వవ్యాప్తంగా చర్చకు దారి తీయడానికి, అనుసరించడానికి ఈ గ్రంథం దోహదం చేసింది. ఆ కాలంలో వచ్చిన ప్రతి అంశాన్ని మాత్రమే కాదు, ఆధునిక ప్రపంచంలో భారతీయులు ఆ శాస్త్రానికి చేసిన సేవల గురించి

కూడా పీసీ రే నమోదు చేశారు. లండన్‌కు చెందిన విలియమ్స్ అండ్ నోర్గేట్ ప్రచురణ సంస్థ దీనిని ముద్రించింది. మన పురాతన రసాయన శాస్త్రానికి మూలాలైన 'సంస్కృత గ్రంథాలు, ఆ గ్రంథాలలో కనిపించే వైరుధ్యాలు, అనువాదాలు' అన్న ఉప శీర్షిక కూడా ఉంచారు. అంటే ఇదొక పరిపూర్ణ శాస్త్ర గ్రంథం. మొదటి భాగానికి 79 పేజీల పీఠిక రాశారు. ఆరు అధ్యాయాలలో విషయ వివరణ ఉంది. రసవాదంగా ఆనాడు పిలిచిన రసాయన శాస్త్రం గురించి వేదకాలంలో, ఆయుర్వేదంలో ఎలాంటి ప్రస్తావనలు ఉన్నాయో చెప్పడమే కాదు, అరబ్బుల ఈ అంశం మీద చేసిన కృషి, ఐయట్రో కెమికల్ కాలం మీద పరిశోధనాత్మక వివరణ ఉంది. రెండో భాగం కూడా ఇవే అంశాలను ఇంకాస్త లోతుగా పరిశీలిస్తుంది.

ఆ గ్రంథంలో ఎలాంటి అంశాలను పొందు పరిచారో విషయ సూచికను బట్టి తెలుసుకుందాం. మొదటి భాగంలో ఆరు అధ్యాయాలు కూడా భారతీయ రసాయన శాస్త్రం గురించి పరిచయం చేసేవే. అవి– వేదాలలో రసాయన శాస్త్ర ఆలోచనలు, ఆయుర్వేదం కాలంలో రసాయన శాస్త్రం, పరిణామ దశ, తాంత్రిక కాలపు దశ, ఐయాట్రో కెమికల్ (ఔషధాలకు సంబంధించినది) యుగం, భారతీయులకు అరబ్బుల రుణం. తరువాతి భాగంలో ఆయుర్వేద కాలంలో రసాయనిక శాస్త్రం గురించి వెల్లడిస్తుంది. బౌద్ధయుగం నుంచి క్రీస్తుశకం 800 వరకు ఈ గ్రంథం చర్చించింది. పదార్థ ఆవిర్భావం, అణు సిద్ధాంతం, చరకుడు, సుశ్రుతుల రచనలలో రసాయనశాస్త్రం, వాగ్భటుడి రచనలలో రసాయన శాస్త్రం వంటి అధ్యాయాలు ఉన్నాయి. క్రీస్తుశకం 800 నుంచి క్రీస్తుశకం 1100 వరకు సాగిన రసవాద ప్రస్థానం గురించి పరిణామ దశ లేదా సంధియుగం అనే విభాగంలో చర్చించారు. అందు లోని అధ్యాయాలు ఇవి: బృంద లేదా సిద్ధయోగలో రసాయన శాస్త్రం (క్రీస్తుశకం 900), చక్రపాణి రచనలలో రసాయన శాస్త్రం (క్రీస్తుశకం 1060). తరువాతి విభాగం తాంత్రిక యుగపు రసాయన శాస్త్రం (క్రీస్తుశకం 1100 నుంచి క్రీస్తుశకం 1300). రసరత్న సముచ్చయంలో రసాయన శాస్త్రం మరొక అంశం. నోట్స్ అన్న శీర్షిక కింద, అపెండైసిస్ శీర్షిక కింద వందలాది అంశాలను పరిచయం చేశారు. ముఖ్యంగా లోహాల గురించి విస్తృత పరిచయం ఉంది.

రెండో భాగంలో ఆచార్య నాగార్జున, బౌద్ధ యుగాల నాటి రసాయనశాస్త్రం, దేశీయ రసాయన శాస్త్ర మౌలిక చరిత్ర, కొందరు రసవాదుల గురించి ప్రస్తావించారు పీసీ రే. నవరత్నాలు, స్వర్ణ సింధూర లేదా మకర ధ్వజ, రసహృదయ గ్రంథకర్త భిక్షు గోవిందు కాలం నాటి రసాయన శాస్త్రం గురించి చర్చ ఉంది. ఇంకా సాంఖ్య పతంజలి సిద్ధాంతం, పురాతన భారతదేశ వైద్య విద్యాలయాలలో రసాయన శాస్త్ర పరిచయం, తూనికలు–కొలతలు, బౌద్ధుల, జైనుల కాలం నాటి అణు సిద్ధాంతం, న్యాయ వైశేషికంలోని రసాయన సిద్ధాంతం, ఇంకా రసరత్న సముచ్చయ రచనాకాలం వంటివన్నీ కూడా ఉన్నాయి. ఆధునిక రసాయన శాస్త్రం యావత్తు పాశ్చాత్య శాస్త్రవేత్తల ఆవిష్కరణల ఫలితమేనన్న అతి పెద్ద భ్రమను పటాపంచలు చేసిన గ్రంథంగా కూడా దీనికి పేరు ఉంది. ఈ శాస్త్రాన్ని అరబ్బుల నుంచి తాము నేర్చుకున్నామని కొందరు పాశ్చాత్య శాస్త్రవేత్తలు చెప్పడం ఎంత అసందర్భమో కూడా ఆయన వివరించారు. అరబ్బుల రసాయన శాస్త్రానికి మూలం భారతదేశమేనని రూఢిగా చెప్పారు.

లోహాల మీద పురాతన భారతదేశానికి ఉన్న




పరిచయం కూడా ఈ పుస్తకంలో ఉంది. ఉక్కును కరిగించడం, కావలసిన విధంగా మలుచుకోవడం అనే కళ భారతదేశంలోనే మొదలయింది. డెమాస్కస్ బ్లేడ్స్ పేరుతో ఉన్న కత్తులు ఇక్కడ తయారైనవే. రసార్ణవంలో ఇచ్చిన కొన్ని విశ్లేషణలను కూడా రే తన పుస్తకంలో పొందుపరిచారు. ఏ లోహాన్ని మంటలో ఉంచితే ఏ రంగు మంట వస్తుందో ఆనాటి భారతీయులు నమోదు చేశారు. రాగి కాలిస్తే నీలిరంగ మంట వస్తుంది. ఇది దాని నాణ్యతను తెలియచేస్తుంది. ఇలాంటి పరిశోధనాత్మక దృష్టి ఇప్పుడు లేదని తేల్చారాయన. పూర్వికులకు పొటాషియం కార్బొనేట్‌కీ, సోడియం కార్బొనేట్‌కి తేడా తెలియదని అన్నారు, సర్ హంఫ్రి దేవి అనే శాస్త్రవేత్త. కానీ సుశ్రుతుని గ్రంథం సుశ్రుత సంహితలో కనిపించే యావక క్షార పొటాషియం కార్బొనేట్ అని, సర్జికక్షార అంటే సోడియం కార్బొనేట్ అని నిరూపించారు పీసీ రే. ఇదే కాకుండా మృదు క్షార అనే మరొక కార్బనేట్ పేరు కూడా ఆయన ప్రస్తావించారు. కానీ వీటి మధ్య తేడాల గురించి సుశ్రుతుడు పేర్కొనలేదు. సుశ్రుతుడు, చరకుడు రాసిన గ్రంథాలు, అందులో ఆయుర్వేదం ప్రకారం సూచించిన ఔషధాల గురించి పీసీ రే పరిశోధించడం మొదలు పెట్టి, దేశదేశాల వైద్య విధానాలు, ఔషధాల సేవనం గురించి విస్తృతంగా అధ్యయనం చేశారు. అలా ఆయన రసాయన శాస్త్రంలో తలమున్కలయ్యారు.


భారతీయ పురాతన శాస్త్రాలను అర్థం చేసుకోవడానికి, వాటిని విశ్లేషించడానికి కావలసినది సంస్కృతంతో పరిచయం. పీసీ రే తన పుస్తకం కోసం 14 సంస్కృత గ్రంథాల నుంచి ఆధారాలు సేకరించారు. అవి– రసరత్నాకరం, రసహృదయం, కాకచండీశ్వరి తంత్రం, రసేంద్ర చూడామణి, రసకల్ప, రసరాజలక్ష్మి, రసప్రకాశం, రస నక్షత్ర మాలిక, రసరత్నాకర సుధాకర, నిత్యనాథుడి రసరత్నాకరం, ధాతురత్నమాట, రసప్రదీప, ధాతుక్రియ, స్వర్ణతంత్ర.

నిజానికి ఇది ఆంగ్లంలో రాసిన పుస్తకం. కవితాత్మకంగా, బలమైన ఆంగ్ల భాషా వ్యక్తీకరణలతో ఇది సాగుతుంది. అందుకే సాధారణ విద్యార్థికి దీనిని అర్థం చేసుకోవడం కొంచెం కష్టమనే వాదన ఉంది. రసాయన శాస్త్రంలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన శాస్త్రవేత్తలు బెర్తోల్, బ్లూమ్‌ఫీల్డ్, కోల్‌బ్రూక్, గోబ్లెట్, వంటి వారి పరిశోధనా వ్యాసాల నుంచి, గ్రంథాల నుంచి పీసీ రే తన గ్రంథంలో ఉల్లేఖించారు. గొప్ప జాతీయవాది కాబట్టి బ్రిటిష్ యుగంలో భారతీయ శాస్త్ర గ్రంథాల పట్ల చూపిన వివక్ష గురించి పీసీ రే చర్చించారు. నిజానికి భారతదేశం క్రమంగా తనదైన పురాతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి ఎందుకు దూరమైందో, అందుకు దారి తీసిన పరిస్థితులు ఏమిటో కూడా రే ఈ గ్రంథంలో చర్చించారు. తనదైన మార్గంలో ఆయన స్వాతంత్ర్యం కోసం తపించారు కూడా. విజ్ఞానశాస్త్ర అధ్యయనాన్ని వాయిదా వేయవచ్చు, కానీ స్వాతంత్ర్యాన్ని కాదు అన్నారాయన. దేశీయులు కావచ్చు, విదేశీయులు కావచ్చు, తెలిసీ తెలియని సంస్కృతంతో చేసిన అనువాదాలలో ఎంత ఘోరమైన తప్పిదాలు దొర్లాయో కూడా పీసీ రే వివరించారు.

పీసీ రే జీవితమంతా ప్రయోగశాలలలోనే గడిచింది. కానీ ఆయన చింతన మాత్రం వాటికే పరిమితమైనది కాదు. ఆయన ఆలోచలన్నీ చరిత్ర, వర్తమానం, భవిష్యత్తు మధ్య వాస్తవికంగా నడక సాగించాయి. తన జీవిత చరిత్ర 'లైఫ్ అండ్ ఎక్స్‌పీరియెన్సెస్ ఆఫ్ ఎ బెంగాలీ కెమిస్ట్'లో 'యూరప్, అమెరికా దేశాలు పారిశ్రామికరంగంలో

సాధించిన శిఖరాయమానమైన వృద్ధి ప్రయోగశాలలో జరిగిన పరిశోధనలు, వాటిలో పొందిన ఘన విజయాల వల్లనే సాధ్యమైంద'ని అన్నారు.

ఫ్రెంచ్ ఆచార్యుడు, శాస్త్రవేత్త బెర్తోల్ కోరిన మీదట ఒక చిరు గ్రంథం రాసి ఇచ్చినప్పటికి తరువాత దాని మీద విస్తృత పరిశోధన చేశారు రే. ఆ పుస్తకం ప్రధానంగా రసేంద్ర సంగ్రహం అనే పురాతన గ్రంథం ఆధారంగా రాశారాయన. తరువాత ఈ పరిశోధనను మరింత ఉధృతం చేశారు. పండిట్ నవకాంత్ కవిభూషణ్ ఆయనకు సహకరించారు. కానీ ఆ కాలంలో సక్రమ నిర్వహణకు నోచుకున్న గ్రంథాలయాలు కూడా తక్కువే. మద్రాస్, తంజావూరు, ఉల్వార్, కశ్మీర్, బెనారస్, కట్మాండు, టిబెట్ వంటి చోట ఉన్న గ్రంథాలలో ఉన్న లిఖిత ప్రతులు చెమ్మెటలు కొట్టేసి ఉండేవి. ఈ వాతావరణంలోనే ఆయన ఐదేళ్లు శ్రమించి మొదటి భాగం తీసుకువచ్చారు. అయితే ఆ సమయంలో మళ్లీ రసాయన శాస్త్రంలో తన బోధన, పరిశోధన (ప్రెసిడెన్సీ కాలేజీ) ఆపలేదు. లండన్ నుంచి వెలువడే జర్నల్ ఆఫ్ ది కెమికల్ రిసెర్చ్‌లో 12 పరిశోధక పత్రాలను


పీసీ రే

కూడా ప్రచురించారు. గ్రంథలయానికీ, ప్రయోగ శాలకీ మధ్య సమతౌల్యం పాటిస్తూ ఈ అసాధారణ రచన చేశారాయన. అయినా దీని ప్రభావం కొంత కనిపించింది. రసాయన శాస్త్రంలో వచ్చిన ఆధునిక ఆవిష్కరణలకు ఆయన కొంచెం దూరమయ్యారు. అలాగే అధ్యయనంలో కూడా కొంత వెనుక బడ్డారు. దీనితో కొంత కాలం మళ్లీ రసాయన శాస్త్ర అధ్యయనం కోసం పాటుపడ్డారు. అందుకే రెండు భాగాల మధ్య అంత దూరం కనిపిస్తుంది.


ఈ పుస్తక రచనతోనే తన కృషిని ఆపేయకుండా ఆచార్య రే పురాతన రసాయన శాస్త్రం గురించి ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. భారతీయ రసాయన శాస్త్రంలో పురాతనత్వం, పురాతన భారతదేశంలో రసాయన శాస్త్రం వంటి పేర్లతో ఆ ఉపన్యాసాలు ఇచ్చారు.

మన చరిత్ర రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక అంశాలకే పరిమితం చేయలేం. శాస్త్ర సాంకేతికాంశాలలో కూడా భారతీయులకు ఎంతో చరిత్ర ఉంది. దానిని కూడా అధ్యయనం చేయవలసి ఉంటుంది. చరిత్రను ఏ కోణం నుంచి అధ్యయనం చేసినా గర్వపడడంతో సరిపెట్టలేం. దాని నుంచి నేర్చుకోవాలి. దాని ద్వారా భవిష్యత్తును నిర్దేశించుకోవాలి. ప్రస్తుత పరిస్థితులను బట్టి శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేయడం చాలా అవసరం. అవన్నీ ఇప్పటి ప్రపంచానికి ఉపయోగపడతాయో లేదో పరిశీలించవలసి ఉంది. అలాంటి ప్రయత్నం జరుగుతున్నది. మన పురాతన శాస్త్రవేత్తలు చేసిన చాలా ప్రతిపాదనలు వాస్తవమేనని తేలింది కూడా. కాబట్టి అన్ని రకాల చరిత్రతో పాటు శాస్త్ర సాంకేతికాంశాల చరిత్రను కూడా అధ్యయనం చేయాలి. ★

**'త్వం హి దుర్గా దశప్రహరణ ధారిణీం'**
**(పది ఆయుధాలు చేతబట్టిన దుర్గవు (భారతమాతవు) నీవే!**

బంకించంద్ర ఛటర్జీ 1870లో 'వందేమాతరం'లో చెప్పినట్లుగా ఇప్పటి అజేయ, అమేయ శక్తిశాలి ఆత్మనిర్భర భారత్ కల సాకారమైంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించుకున్న నవవైజ్ఞానిక భారతదేశానికి ప్రపంచం యావత్తూ 'వందే భారతం' అంటూ నినదిస్తోంది. సమస్యలెన్నో? సమాధానం ఒక్కటే- అది భారతదేశమే అంటూ ఆశగా ఇటే చూస్తోంది!

**పది ఆయుధాల సమాహారం:** 1. ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) ద్వారా జీఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ రాకెట్ల తయారీ 2. బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్ (బీఏఆర్సీ) ద్వారా రేడియో ఐసోటోప్‌ల తయారీ 3. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్)కు అవనరమైన సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ తయారీ 4. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ద్వారా తేలికపాటి యుద్ధ విమానాలు తేజస్‌ల తయారీ 5. ఫోఖ్రాన్ టెస్ట్ రేంజ్ (పీటీఆర్) శక్తి, స్మైలింగ్ బుద్ధ పేర్లతో అణుబాంబుల విస్ఫోటన ప్రయోగం 6. డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనేజేషన్ (డీఆర్‌డీఓ) ద్వారా అగ్ని, నాగ్, ఆకాశ్, త్రిశూల్, పృధ్వీ లాంటి క్షిపణి ప్రయోగాలు 7. ఇండియన్ నావల్ సర్వీస్ (ఐఎన్ఎస్)



# కణాదుడి నుంచి కలాం భారతీయ వైజ్ఞా

ద్వారా అరిహంత్ సబ్‌మెరైన్ తయారీ 8. ఇండియన్ ఆర్మీ (ఐఏ) మైన్ బాటిల్ ట్యాంక్ అర్జున్ 9. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎటామిక్ ఎనర్జీ (డీఏఈ) ద్వారా ఎటామిక్ పవర్‌ప్లాంట్ల తయారీ 10. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) ద్వారా 40 అధునాత ప్రయోగశాలలతో, నిర్మాణాత్మక ఆయుధాలతో 'విజ్ఞాన భారతం' ప్రపంచానికి దిక్సూచిగా మారింది.

ఫిబ్రవరి 28 'జాతీయ విజ్ఞాన దినోత్సవం' సందర్భంగా వేదకాలం నుంచి ఆధునిక యుగం వరకు వైజ్ఞానిక భారత్ నిర్మాణంలో యోగదానం చేసిన విజ్ఞాన సేనానులను స్మరించుకోవడం మన కర్తవ్యం.

'పరిప్రశ్నేన సేవయా' ఏ విజ్ఞాన శాస్త్రానికైనా ప్రశ్నే పునాది. ఎందుకు? ఏమిటి? ఎలా? అంటూ అణువు నుంచి అంతరిక్షం దాకా ప్రకృతిలోని ప్రతి విషయాన్ని ప్రశ్నించిన సనాతన ధర్మం మనది. అసత్తు (ఏమీ లేదు), నుంచి సత్తు (ఈ జగత్తు) ఎలా వచ్చింది? సృష్టికర్త ఎవరు? (ఋగ్వేదం-నాసదీయ సూక్తం) అతనిని తప్ప ఇంకెవరిని సేవించాలి (ఋగ్వేద హిరణ్యగర్భ సూక్తం)? 'దేనిచేత ప్రేరేపితమైన మనసు తాను ఆలోచించే విషయాల మీద ప్రసరిస్తున్నది (కేనోపనిషత్తు)? మానవుని మరణం తరువాత జీవితం ఉంటుందా (కఠోపనిషత్తు)? ప్రపంచంలో వింతైన వార్త ఏది (యక్ష ప్రశ్నలు)? అంటూ శరపరంపరగా ప్రశ్నలతో గురుకుల విద్యావిధానం ద్వారా వేద రుషులు ప్రకృతిని అర్థం చేసుకున్నారు.

'వైజ్ఞానికాశ్చ కపిలః కణాదః శుశ్రుత స్తథా
చరకో భాస్కరాచార్యో వరాహమిహరసుధీః
నాగార్జునో భరద్వాజః ఆర్యభట్టో బసుర్బుధః
ధ్యేయో వేంకట రామశ్చ విజ్ఞాన రామానుజాదయః' అంటూ ప్రతి నిత్యం ప్రగతికి కారకులైన శాస్త్రవేత్తలను స్మరించుకోవడం మన సంప్రదాయం.

**కణాదుడు (అణుసిద్ధాంతకర్త)**

'విభజించడానికి వీలుకాని పరమాణువు(Atom)లతో జగత్తంతా ఏర్పడిందని, పరమాణువుల కలయిక వలన అణువులు (Molecules) ఏర్పడతాయని జాన్ డాల్టన్ కంటే ముందే కణాదుడు చెప్పాడు. భారతీయ షడ్దర్శనాలలో విశేషంగా చెప్పిన అంశాలతో కూడిన వైశేషిక దర్శన గ్రంథం ద్వారా భౌతికశాస్త్ర సూత్రాలను, ముఖ్యంగా కార్యకారణ (Cause & effect) సంబంధాలను, గమన సూత్రాలను న్యూటన్ కంటే ముందుగానే ప్రపంచానికి తెలియపరిచారు.

**మహర్షి భరద్వాజుడు (విమానశాస్త్రం)**

'యంత్ర సర్వస్వ' విమాన సంహిత, బృహత్ విమాన శాస్త్ర గ్రంథాల ద్వారా విమానాలలో వాడే మూలకాలు, ఆకృతి, ఒక గ్రహం నుంచి వేరొక గ్రహానికి వెళ్లే విమానాల నమూనాలతో ప్రపంచలోనే మొట్టమొదటిసారిగా ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌పై పరిశోధన చేసిన గ్రంథంగా ప్రసిద్ధి పొందింది. రైట్ బ్రదర్స్ కంటే ముందే విమానాల ప్రస్తావన తెచ్చిన

తెలిపారు. చంద్రుడు, గ్రహాలు అస్వయం ప్రకాశకాలని, సూర్యకాంతి పడి, పరావర్తనం చెందడం వలన మెరుస్తున్నట్లుగా కనిపిస్తాయని కెప్లర్ కంటే ముందుగా నిర్ధారించారు.

**ఆచార్య శుశ్రుత (వైద్యశాస్త్రం, ప్లాస్టిక్ సర్జరీ)**

శుశ్రుత సంహిత గ్రంథం ద్వారా 125 రకాల శస్త్రచికిత్స పరికరాల రూపకర్తగా రైనో ప్లాస్టీ (గాయ పడిన ముక్కును సరిచేసే ప్రక్రియ), అనెస్థీషియా విధానాన్ని వివరించి మొట్టమొదటి ప్లాస్టిక్ సర్జన్‌గా ఖ్యాతి గడించారు.

**ఆచార్య చరక (వైద్యశాస్త్రం)**

ఆయుర్వేద విజ్ఞాన సరస్వంగా వినుతికెక్కిన 'చరకసంహిత' గ్రంథం ద్వారా ఎనాటమీ, ఎంబ్రియాలజీ, ఫార్మకాలజీ, రక్తప్రసరణ, హృద్రోగ నివారణ, క్షయ వ్యాధి చికిత్స, ఇంకా ఎన్నో రకాల మొక్కల ఔషధ గుణాలను వివరించారు. వైద్య వృత్తిని

# వరకు
# నిక వైభవం



మహర్షిగా ప్రసిద్ధి పొందారు.

**నాగార్జున (రసాయనశాస్త్రం, లోహ సంగ్రహణశాస్త్రం)**

రసరత్నాకరం, రసోదయ, రస్రూదయ, రసేంద్ర మంగళ్ గ్రంథాల ద్వారా బేస్ మెటల్స్ (సీసం, రాగి)ను వెండి, బంగారంగా మార్చే రసాయన ప్రక్రియను, ఆరోగ్య మంజరి, యోగసర్ గ్రంథాల ద్వారా రోగనివారణ ఔషధాల తయారీ విధానాన్ని వివరించారు.

**బౌద్ధాయన (గణితశాస్త్రం)**

బౌద్ధాయన శుల్బ సూత్ర గ్రంథం ద్వారా జామెట్రి, వర్గమూలాలు, చతురస్రాలు, త్రికోణ ధర్మాలు వివరించారు. ఏ వృత్తానికైనా చుట్టుకొలతను వ్యాసంతో భాగహరిస్తే 22/7=3.14గా విలువ వస్తుందని పైథాగరస్ కంటే ముందే చెప్పిన గణితజ్ఞుడు.

**వరాహమిహిర (ఖగోళశాస్త్రం, జియోగ్రఫీ)**

అవంతి (ఉజ్జయిని) చక్రవర్తి విక్రమాదిత్యుని కొలువులోని నవరత్నాలలో ఒకరిగా ఖ్యాతి గడించి 'పంచసిద్ధాంత', 'బృహద్ సంహిత', 'బృహద్‌జాతక' గ్రంథాల ద్వారా ఎన్నో ఖగోళ విషయాలను

అవలంబించేవారు తీసుకోవలసిన నైతిక ప్రమాణాలను హిప్పోక్రాటిక్ ఓత్ కంటే ముందుగానే నిర్దేశించారు.

**భాస్కరాచార్య (గణిత, భౌతిక శాస్త్రాలు)**

ఆర్థమేటిక్, త్రికోణమితి, ఆల్‌జీబ్రా, జ్యామెతి లాంటి అంశాలను లీలావతి, బీజగణితం గ్రంథాల ద్వారా తెలిపారు. 'సూర్యసిద్ధాంతం' గ్రంథంలో భూమి, గ్రహాలు, నక్షత్రగుచ్ఛాలు, చంద్రుడు నిర్దిష్టమైన కక్ష్యాలలో గురుత్వాకర్షణ కారణంగా తిరుగుతున్నాయని ఐజాక్ న్యూటన్ కంటే ముందే వివరించిన మేధావి.

**ఆర్యభట్ట (ఖగోళ, గణిత శాస్త్రాలు)**

'ఆర్యభట్టీయం' గ్రంథం ద్వారా సూర్యచంద్ర గ్రహణాలను, భూమి గుండ్రంగా ఉందని, గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాయని కచ్చితమైన లెక్కలతో కోపర్నికస్ కంటే ముందుగా వివరించిన శాస్త్రవేత్త.

**మహేంద్రలాల్ సర్కార్ (ఐఏసీఎస్)**

1876లో తానే స్వయంగా నిధులను సేకరించి ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ (ఐఏసీఎస్) అనే ప్రయోగశాలను ఏర్పాటు




**ఉపద్రష్ట లక్ష్మణసూరి**

భారతీయ విజ్ఞాన మండలి సభ్యులు, ఏపీ


చేశారు. ఐఏసీఎస్ ద్వారానే సీవీ రామన్ కాంతిపై ఎన్నో ప్రయోగాలు చేశారు. ఎంతోమంది శాస్త్ర వేత్తలకు ఈ ప్రయోగశాల వేదిక అయ్యింది. నీల్ రతన్ సర్కార్, శ్యాంప్రసాద్ ముఖర్జీ, జ్ఞాన్ చంద్ర ఘోష్, సత్యేంద్రనాథ్ బోస్, ఎం.ఎన్. సాహా, కేఎస్ కృష్ణన్ లాంటి ఎంతోమందికి స్వాతంత్ర్య సంగ్రామంలో పరిశోధనలకు ఐఏసీఎస్ వేదికైంది.

**అశుతోష్ ముఖర్జీ (గణితశాస్త్రం)**

బెంగాల్ టైగర్‌గా, ఆధునిక భారతీయ గణిత వేత్తగా ప్రసిద్ధి పొందారు. 1908లో కలకత్తా మేథమెటికల్ సొసైటీని స్థాపించారు.

**ప్రమథనాథ్ బోస్ (జియాలజిస్ట్)**


జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను బలోపేతం చేసిన శాస్త్రవేత్త. రాయల్ స్కూల్ ఆఫ్ మైన్స్ నుంచి డిప్లొమా పూర్తిచేసిన ఘనుడు. ఒరిస్సాలోని మయూర్ భంజ్‌లో ఇనుప ధాతువును కనిపెట్టి జేఎన్ టాటాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ (1904) స్థాపనలో ప్రధాన భూమిక వహించారు.

**జగదీష్ చంద్రబోస్ (విద్యుదయస్కాంత తరంగాలు, వృక్షశాస్త్రం)**

మార్కొని కంటే ముందుగా విద్యుదయస్కాంత తరంగాలను ఉత్పత్తి చేసే విధానాన్ని పసిగట్టే క్రిస్టల్ రేడియో, క్రిస్టల్ డిటెక్టర్‌లను తయారు చేసి ఈనాటి వైర్‌లెస్ కమ్యూనికేషన్‌కు ఆద్యుడిగా నిలిచారు. బ్రిటిషర్స్‌తో సమానంగా వేతనాలు ఇచ్చే వరకు తానసలు నెల జీతమే తీసుకోనని సత్యాగ్రహం చేశారు.

**చంద్రశేఖర వెంకటరామన్ (భౌతికశాస్త్రం- కాంతి, ధ్వని)**

పార్వతీ అమ్మాళ్, చంద్రశేఖర్ దంపతులకు తమిళనాడులోని తిరువనైక్కా వల్‌లో సీవీ రామన్ నవంబర్ 17న జన్మించారు. విశాఖపట్నంలోని సెయింట్ అలోసియస్ ఆంగ్లో ఇండియన్ పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ప్రకృతిని తదేకంగా పరిశీలించడం, విపరీతంగా పుస్తకాలను చదవడం ఇష్టమైన కాలక్షేపాలు. 1902లో మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బీఎస్సీ (ఫిజిక్స్),ఎమ్మెస్సీ (ఫిజిక్స్)లో అగ్రగామిగా నిలిచారు. ఐసీఎస్ (నేటి ఐఏఎస్) సాధించి కలకత్తా ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో



మహర్షి భరద్వాజుడు

వరాహమిహిర

ఆచార్య శుశ్రుత

ఆచార్య చరక

చంద్రశేఖర వెంకటరామన్

అధికారిగా చేరారు.

**రామన్ ఎఫెక్ట్**

ఒక ద్రవపదార్థంపై కాంతికిరణాలు పడినప్పుడు ఆ కాంతి పరిక్షేపం (scattering) చెందుతుంది. కాంతి కిరణాల్లోని ఫోటాన్లు (శక్తి కణాలు) ద్రవ పదార్థాల అణువులపై పడి పరిక్షేపం చెందుతాయి. చెదిరిన ఫోటాన్‌లలో ఎక్కువ భాగం వాటి పూర్వపు తరచుదనాన్ని (Frequency) కోల్పోవు. కొన్ని కొంత తక్కువ పౌనఃపుణ్యంతో పరిక్షేపం చెందుతాయి. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుంది. ఇదే రామన్ ఎఫెక్ట్. 1928 ఫిబ్రవరి 28న 'ఎ న్యూ రేడియేషన్' పేరుతో 'ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫిజిక్స్'లో రామన్ ఎఫెక్ట్ ముద్రితమైంది. తక్కువ వనరులతో చేసిన ప్రయోగ పరికరాలతో నోబెల్ బహుమతి పొందడం, అందునా బ్రిటిషర్ల పాలనాకాలంలో వర్ణ వివక్షతో మేధోదోపిడీ జరుగుతున్న రోజుల్లో భారతీయ వైజ్ఞానిక కీర్తి పతాకాన్ని ఎగుర వేయడం శాస్త్రవేత్తల ప్రపంచాన్ని నివ్వెరపరిచింది.

నోబెల్ బహుమతి ప్రదానోత్సవ సభ(1930)లో విదేశీ సంప్రదాయమైన సూటూ బాటూను కాదని తలపాగా, కుర్తాతో హాజరై భారతీయ సంప్రదాయ సౌరభాలను వెదజల్లారు. 1933లో రామన్ ఇండియన్ ఇనిస్టిట్యూట్‌కు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మైసూర్ మహారాజా కృష్ణరాజ వడయార్ 1949లో ఆ సంస్థకు స్థలాన్ని కేటాయించారు. రామన్ డైరెక్టర్‌గా ఉన్న కాలంలో హోమీ జహంగీర్ బాబా, విక్రం సారాభాయ్ లాంటి వారికి మార్గదర్శిగా నిలిచారు. స్వంతంత్రంగా ఆలోచించడం, కఠోర పరిశ్రమలతో పరిశోధన చేయడం తదితర అంశాలలో సీవీ రామన్ యువతలో స్ఫూర్తిని నింపారు.

**అబ్దుల్ కలాం (క్షిపణి శాస్త్రవేత్త)**

ప్రొఫెసర్‌గా, రచయితగా, శాస్త్రవేత్తగా, భారతీయతత్త్వ చింతనను అర్థం చేసుకున్న వ్యక్తిగా, దేశాధ్యక్షుడిగా సేవలు అందించిన అబ్దుల్ కలాం భారతదేశపు మిస్సైల్ మ్యాన్. ఫోఖ్రాన్-2 అణుపరీక్షల్లో కీలక శాస్త్రవేత్త. ఇండియా-2020 పేరుతో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ప్రణాళికలు సూచించారు. 1998లో డాక్టర్ సోమరాజుతో కలసి స్టెంట్ (గుండె చికిత్సలో ఉపయోగించే పరికరం) కలాం-రాజు స్టెంట్‌ను, కలాం-రాజు ట్యాబ్లెట్ (కంప్యూటర్)ను తయారు చేశారు. తన ప్రసంగాలలో భగవద్గీత లేదా తిరుక్కురల్ పాశురాలను ప్రస్తావిస్తూ ఆధునిక సాంకేతిక విద్యతో పాటు నైతిక, ఆధ్యాత్మిక విద్య ఆవశ్యకత గురించి యువతరానికి చెబుతూండే వారు. డీఆర్‌డీఓ, ఇస్రోలలో పనిచేసి క్షిపణుల తయారీలో ప్రధాన భూమిక పోషించారు.

### బ్రిటిషర్ల మేధో దోపిడీకి వ్యతిరేకంగా..



నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు, గురుకుల వ్యవస్థ ద్వారా అప్రతిహతంగా సాగిన మహోజ్వల హిందూ వైజ్ఞానిక ప్రవాహం 1600 సంవత్సరంలో బ్రిటిషర్ల రాకతో కుంటు పడింది. అసలు భారతీయులకు తర్కబద్ధమైన ఆలోచనశక్తి లేదని, సోమరులని, వేదాంతులని బ్రిటిషర్లు ప్రపంచాన్ని నమ్మించారు. భారతీయులకు తామే విజ్ఞానాన్ని నేర్పినట్లుగా ప్రచారం ప్రారంభించారు. బ్రిటిషర్ల వర్ణవివక్షకు, మేధో దోపిడీకి వ్యతిరేకంగా ఎంతోమంది శాస్త్రవేత్తలు స్వాతంత్ర్య సంగ్రామంలో సమరనాదం చేశారు. 1947 వరకు నిశ్శబ్ద విప్లవంలా పనిచేశారు.

**శాస్త్రం అంటే?**

సంస్కృత శబ్దం 'శాస్త్రం'లో రెండు పదాలున్నాయి. శాస్+త్ర. శాస్ అంటే శాసించటం. త్ర అంటే రక్షించుట. ఈనాటి ఆధునిక విజ్ఞానశాస్త్రం శాసించడం (శాస్)పై శ్రద్ధ వహిస్తోంది. రెండవ భాగం రక్షించటం (త్ర) గురించి తగిన శ్రద్ధ తీసుకోవాలి.

విజ్ఞాన శాస్త్రం మానవ మారణ హోమానికి (రష్యా-ఉక్రెయిన్ యుద్ధం) కాక మానవ కల్యాణానికి (టర్కీ భూకంప బాధితుల సేవలో భారత్), మానవ నైతిక అభివృద్ధికి కృషి చేసే దిశగా ఉండాలి. విజ్ఞానశాస్త్రం మానవ కల్యాణానికే (లోకాః సమస్తాః సుఖినోభవంతు।) అని ఆచరణాత్మకంగా చూపే మన విజ్ఞాన భారతదేశం వైపే ప్రపంచం యావత్తు ఆశగా ఎదురుచూస్తోంది.

**ఇన్‌వెంటర్స్ + ఇన్నోవేటర్స్ = యువత**

వేదరుషులు అందించిన వైజ్ఞానిక దృష్టికోణాన్ని, ప్రశ్నించే తత్వాన్ని నేటి యువత కొనసాగిస్తూ తరువాతి తరాలకు అందించాలి. ప్రకృతి ప్రయోగ శాలగా ఆకాశమే సరిహద్దుగా పరిశోధనలతో ముందుకు సాగాలి. జీవన సమరంలో సామాన్యులకు ఎదురయ్యే ప్రతి సవాలుకు అధునాతన సాంకేతిక విజ్ఞానం ద్వారా పరిష్కారం చూపే దిశగా భారతీయ యువత ఆవిష్కర్తలు (ఇన్‌వెంటర్స్)గా, వినూత్న పరికరాల సృష్టికర్తలు (ఇన్నోవేటర్స్)గా మారి నాటి కణాద నుంచి నేటి కలాం వరకు కొనసాగుతున్న విజ్ఞానశాస్త్ర అభివృద్ధి యజ్ఞంలో భాగం కావాలి.

**విజ్ఞాన దేవోభవః స్వాధ్యాయన్మ ప్రమదః!** ★

**పేరు కోసం కాకుండా ప్రజాసంక్షేమానికి పాటుపడిన తెలుగువారి తొలి ఇంజనీర్. రాజమహేంద్రవరం కేంద్రంగా మహాభారత ఆంధ్రీకరణలో నన్నయకు నారాయణభట్టులా, ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో ఆర్థర్ కాటన్‌కు వెన్నుదన్నుగా నిలిచారు. 'శ్రీ వీణెం వీరన్న అనే హైందవ పురుషోత్తముడు నాకు లభించకుండా ఉండి ఉంటే నేను అనుకున్నట్లుగా ఇంత వేగంగా గోదావరి ఆనకట్టను అపూర్వ ఘనకీర్తితో పూర్తి చేయలేకపోయేవాడిని. వారికి జీవితమంతా రుణపడి ఉంటాను' అని అపర భగీరథుడుగా మన్ననలు అందుకుంటున్న కాటన్ అన్న మాటలు వీరన్న వ్యక్తిత్వానికి దక్కిన అపూర్వ గౌరవం. వీరన్న వారసులు నీటిపారుదల శాఖలో సేవలు అందించినప్పటికీ తమ పూర్వీకుని గురించి ఎక్కడా గొప్పగా చెప్పుకున్నట్లు కనిపించదు.**

# ధవళేశ్వ'వరం' వీణెం

వీణెం కొల్లయ్య, వీరరాఘవమ్మ దంపతులకు ఐదుగురి సంతానంలో మొదటి వాడిగా 1794 మార్చి 3వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించిన వీరయ్య అక్కడే ప్రాథమిక విద్యను, మచిలీపట్నంలో ఉన్నత పాఠశాల విద్య, కలకత్తాలో ఓవర్సీస్ విద్య (వ్యవసాయం, నీటిపారుదల, ఇంజనీరింగ్, రహదారులు, భవనాలు, కళలు, సైన్స్... ఏడు అంశాలతో కూడిన కోర్సు) అభ్యసించారు. మద్రాసులో ఇంజనీరింగ్‌లో శిక్షణ పొందారు.

గోదావరి పరీవాహక ప్రాంత పరిశీలనకు తొలిసారిగా (1840) వచ్చిన కాటన్‌కు స్వాగతం పలికినప్పటి నుంచి కడవరకు వీరన్న కలిసే ప్రయాణించారు. ఆయనకు సహాయకుడిగానే కాకుండా కుడిభుజంగా, ఆత్మీయుడిగా మెలిగారు. తన కంటే వయసులో సుమారు పదేళ్లు పెద్దయిన వీరన్నను కాటన్ సహోద్యోగిగా కాకుండా అన్నలా గౌరవించారట. రాజమహేంద్రవరం నుంచి గోదావరి పుట్టుక ప్రాంతం త్ర్యంబకం వరకు, రాజమహేంద్రి నుంచి గోదావరి సంగమం వరకు ఎగువదిగువ ప్రాంతాలను కాలినడకన, గుర్రాలపై ప్రయాణించారు. కాటన్ అనారోగ్య కారణాలతో లండన్, ఆస్ట్రేలియాలకు వెళ్లినప్పుడు ఆనకట్ట పనులకు ఎలాంటి అంతరాయం కలుగకుండా సమర్థంగా నిభాయించుకు వచ్చారు. ఆనకట్ట పనుల విషయంలో అవినీతికి ఆస్కారం కానీ, ఒక ప్రాణ నష్టం కానీ లేకుండా అప్రమత్తతను పాటించారు

శ్రామికులకు స్ఫూర్తి

గోదావరిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మాణ పనులకు స్థానికులు ముందుకు రాకపోవడంతో వీరన్న ఒడిశా, బెంగాల్ రాష్ట్రాల నుంచి పెద్ద


వీరన్న


కాటన్

సంఖ్యలో కూలీలను రప్పించారు. ఎద్దుల బండ్లు, గుర్రాలు తప్ప ఎలాంటి రవాణా సౌకర్యాలు లేని కాలంలో అంతమందిని సమీకరించడం అపూర్వ సన్నివేశం. ఆయన శ్రామికుల పట్ల చూపుతున్న వాత్సల్యం, పనిగురించి ఇస్తున్న తర్ఫీదు, వేతనాల చెల్లింపు తీరు గురించి విని గోదావరి పరీవాహక ప్రాంతవాసులతో పాటు కృష్ణా, గుంటూరు మండలాలకు చెందిన వారు ఆనకట్ట పనులకు వచ్చారు. వీరన్న పూర్వీకులకు, సోదరులకు మన్యం ప్రాంతవాసులతో గల పరిచయాలతో వారినీ కూడగట్టారు. ఇలా 'జలయజ్ఞాని'కి దాదాపు పదివేల మందిని సమకూర్చుకున్నారు.


**శ్రామికులకు ఆసరా**

ఆనకట్ట నిర్మాణ శ్రామికుల సంక్షేమానికి కాటన్‌కు చెప్పి సకల చర్యలు తీసుకున్నారు. వారి కోసం గోదావరి తీరంలో ప్రత్యేక నివాసాలు ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులలో అనుభవం లేని వారికి ప్రత్యేక తర్ఫీదునిస్తూ ఆదివారం సెలవు దినంగా ప్రకటించారు. పనిచేసిన రోజులకే వేతనం అనే విధానాన్ని పక్కనపెట్టి పని చేయని రోజుకు (ఆదివారం) కూడా దినభత్యం చెల్లించే ఏర్పాటు చేశారు. అదీ ముందు రోజు (శనివారం) సాయంత్రమే. 'జాతికి అన్నం పెట్టే ఆనకట్ట నిర్మాతలను పస్తులపాలు చేయకూడదని, కష్టానికి ప్రతిఫలం చెల్లించాల'న్న వీరన్న సానుభూతి వైఖరి కార్మికులలో అంకితభావాన్ని మరింత పెంచింది. పనులకు సంబంధించి కారణాంతరాల వల్ల ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి రెండుసార్లు (1848, 1851) సకాలంలో నిధులు రాకపోయినా పనులు నిలిచి పోకుండా అధికారులు, కార్మికులు పరస్పరం సహ కరించుకున్నారు.

వృత్తి పట్ల వీరన్న నిబద్ధత, అంకితభావం, శ్రమశక్తికి ప్రతిఫలంగా ఆయనకు మరేదైనా మేలు చేయాలని విక్టోరియా మహారాణి, ఈస్ట్ ఇండియా కంపెనీకి కాటన్ చేసిన సిఫారసు మేరకు ఆ ప్రభుత్వం 'రాయ్‌బహదూర్' బిరుదు ప్రదానం చేసింది. ఆనకట్టకు 20 కిలోమీటర్ల దూరంలోని మెర్నిపాడు గ్రామ ఆదాయాన్నీ ఆయనకు దఖలు పరుస్తున్నట్లు విక్టోరియా మహారాణి ప్రకటించారు.

గోదావరి ఆనకట్ట నిర్మాణం పూర్తయినా (1852 మార్చి 31) మరో దశాబ్దన్నర కాలం..అంటే తుదిశ్వాస వరకు ఆ ప్రాంతంలోనే నివసించారు. ధవళేశ్వరం హెడ్ లాక్ క్వార్టర్స్ వద్దే ఎక్కువ సమయం గడిపారు. అధిక శ్రమ, విపరీతమైన ఎండతాకిడితో పచ్చకామెర్ల వ్యాధి బారినపడి తమ 73వ ఏట 1867 అక్టోబర్ 12వ తేదీన కన్ను మూశారు. ఆయన అంతిమ కోరిక మేరకు హెడ్‌లాక్ ప్రాంతంలోనే ఆయన పార్థివ దేహానికి అంతిమ సంస్కారం నిర్వహించి, చితాభస్మాన్ని గోదావరిలో నిమజ్జనం చేశారు.

అవిభక్త మద్రాసు రాష్ట్ర తొలితెలుగు సభాపతి బులుసు సాంబమూర్తి (1940)లో కాటన్ విగ్రహం వద్ద చెక్కించిన వీరన్న వివరాలు తెలిపే శిలాఫలకం 1986 వరదలకు దెబ్బతింది. రచయిత, చరిత్ర కారుడు బీఎస్ సాయిగణేష్ దానిని పునరుద్ధరించగా, వీరన్న వర్ధంతి నాడు (2014 అక్టోబర్ 12)అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్ ఆవిష్కరించారు. ★


డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

జగన్ దయామయుడి అవతారం ఎత్తారు. 'దయామయుడు... కరుణామయుడు' ఈ పేర్లను ఎక్కువగా క్రైస్తవులే వల్లిస్తారు. ఈ అర్థం వచ్చేలా జగన్ శివరాత్రినాడు చేసిన పోస్టుతో ఆయన తనను తాను దయా మయుడిగా భావిస్తున్నట్లున్నారు. మరోమాటలో చెప్పాలంటే ఆయన ఏసుక్రీస్తు అనుకుంటున్నారా? అనే ప్రశ్న ఉదయిస్తోంది. వాస్తవంగా ఈ రాష్ట్రంలోని కొందరు అతివాద క్రైస్తవులు జగన్‌ను ఏసుక్రీస్తుగానే భావిస్తున్నట్లు చర్చిల్లోను, బయట మాట్లాడుతున్నారు. అందుకే వైసీపీ అధికారంలోకి రాగానే ఏసుక్రీస్తు రాజ్యం వచ్చినట్లు సంబరాలు చేసుకోవడం అందరికీ గుర్తున్న విషయమే. వంది మాగధులు నాలుగేళ్లుగా చేస్తున్న భజనతో తనే మరలా తిరిగొచ్చిన ఏసుగా భావిస్తున్న ట్లున్నారు జగన్. అందుకే హిందువుల మనో భావాల్ని దెబ్బతీసేంత తీవ్రమైన చిత్రాన్ని చిత్రీకరించి పోస్టు చేశారు. ఈ పోస్టు క్రైస్తవులకు ఆనందం కలిగించవచ్చేమో గాని హిందువులకు మాత్రం తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఎందుకంటే ఈ చిత్రం హిందువులను కించపరిచేలా ఉంది. ఈ చిత్రాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. శిథిలావస్థకు చేరిన దేవాలయం మెట్లు, అక్కడ నిలువు నామాలు ధరించి నేలపై వున్న ఒక ఆవు, పక్కనే నుదుటన విభూతి, చేతిలో ఢమరుకం ధరించి ఆకలితో అలమటించిపోయేలా నేలపై పడిన బాలశివుడి నోట్లో పాలుపోస్తున్న జగన్. చిత్రంలో ఉన్నది బాలశివుడా? లేక బాలహిందువా? అనేది అర్థం కావడం లేదు. ఏదైనా పాలుపోసేది మాత్రం జగనే. శివరాత్రి రోజు అందరూ శివుడిని పాలతో అభిషేకించి నేలపాలు చేస్తుంటే, తాను మాత్రం పేదపిల్లల నోట్లో పాలు పోస్తున్నట్లు జగన్ ఫోజు కొడుతున్న చిత్రం అది.



# 'దయామయుడి'గా

ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి తమను, తమ ధర్మాన్ని అవమానించడంలో బరితెగించారని హిందువులు ఆరోపిస్తున్నారు. హిందువులు శివుడిని లింగరూపంలో కొలుస్తారు. వారికి పరమ పవిత్ర పండుగ మహాశివరాత్రి. ఆ పర్వదినాన ఆలయాలను సందర్శించి శివలింగాలకు ఆవుపాలతో అభిషేకం చేస్తారు. కాని ముఖ్యమంత్రి జగన్ అభిషేకాన్ని అవమానించారు. హిందువులు తమ పిల్లలకు ఆహారం లేకపోయినా, పాలు మాత్రం శివలింగానికి అభిషేకం చేస్తున్నారని, తాను మాత్రం తిండిలేక అల్లాడిపోతున్న హిందూ బాలల నోట్లో పాలుపోస్తున్నట్లు ఫోజులు పెట్టేలా గ్రాఫిక్స్ చిత్రీకరించుకున్నారు. ఇందులోనూ ఒక ప్రత్యేకత ఉంది. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించిన తమపై వైసీపీ నాయకులు, గుండాలు తిట్టేటపుడు, కొట్టేటపుడు తాము పెడుతోన్న ఆర్తనాదాలు వింటూ, తమ వైపు క్రూరంగా చూస్తూ ఎగతాళిగా నవ్వే నవ్వు కూడా అని బాధితులు ఆరోపిస్తున్నారు. తినడానికి తిండిలేని నిరుపేదలు హిందువులుగా, తాను వారిని ఆదుకునే దేవుడుగా జగన్ తనను తాను అభివర్ణించుకున్నట్లు హిందువులు, హిందూ సంస్థలు విమర్శిస్తున్నాయి. బీజేపీ అయితే శివరాత్రి వెళ్లిన మరునాడు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల ముందు నిరసన కార్యక్రమం చేసింది.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి డబ్బులొస్తాయని, అనారోగ్యంతో బాధపడేవారికి రోగాలు బాగవుతాయంటూ ఫాస్టర్లు ఆసుపత్రుల వద్ద చెబుతూ మతాలు మార్పిస్తారు. జగన్ కూడా తనను తాను అలాగే ఊహించుకున్నట్లున్నారు. తిండిలేక పడిపోతున్న హిందువులకు తానే ఆహారం అందిస్తున్నట్లు చిత్రీకరించుకుని 'నేనే దేవుడ్ని' అనుకుంటున్నారు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగానే కనబడుతుందనే సామెతలా వైసీపీని, ముఖ్యమంత్రిని సమర్థించే వారు, క్రిస్టియన్లు, ముస్లింలు అభిషేకాలను తప్పుపడుతున్నారు. అదే జగన్‌కు కావాలని, హిందూమత ఆచారాలను దెబ్బతీయడమే ఆయన లక్ష్యం అని హిందూ మత ధార్మిక సంస్థలు ఆరోపిస్తున్నాయి.

**బ్రిటిష్ పాలనను తలపిస్తూ...**

వైసీపీ ప్రభుత్వ తీరు బ్రిటిష్ ప్రభుత్వాన్ని తలపిస్తోంది. వలస వ్యాపారులుగా దేశానికి వచ్చిన యూరోపియన్లు మతవ్యాప్తికి కృషిచేశారు. అందరినీ జయించి చివరికి మిగిలిన బ్రిటిషర్లు తమ అజెండాను అమలుచేశారు. వారు చేస్తున్న దోపిడీని ప్రశ్నిస్తూ, తమకు స్వేచ్ఛకావాలని పోరాటం చేసిన హిందువులను బందీలు చేసి వారిని క్రూరశిక్షలకు గురిచేశారు. కొందరిని చంపివేశారు. క్రైస్తవ మతవ్యాప్తికి ఎనలేని ప్రోత్సాహం కల్పించారు. చర్చిలకు భూములు, కానుకలు ఇచ్చారు. ప్రాచీన కాలం నుంచి స్వయం పోషకంగా వున్న భారత సమాజాన్ని అణచివేయాలని, భారత్ వద్ద ఏమీ లేదని చెప్పేలా మెకాలే విద్యావ్యవస్థను అమలు చేశారు. అయినా భారత్ మాత్రం తన సంస్కృతిని వదల్లేదు. ఇప్పుడు అధికారంలో వున్న వైసీపీ కూడా బ్రిటిషర్ల విధానాలనే అమలు చేస్తోంది. మాతృభాష తెలుగును మన నుంచి దూరం చేయడానికి ప్రయత్నిస్తోందని భాషా పండితులు విమర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వం తెలుగు మాధ్యమాన్ని శాశ్వతంగా తొలగించే ప్రయత్నం చేసింది. ఆంగ్ల మాధ్యమంలో పాఠ్య పుస్తకాలు రూపొందించింది. ప్రాథమిక స్థాయి వరకు మాతృభాషలోనే విద్య అందించాలనే జాతీయ విద్యా విధానాన్ని, అటు హైకోర్టు అదేశాలను పాటించడం లేదు. తన పంతం నెగ్గించుకోవడానికి అచ్చువేసిన పుస్తకాలకు ఒక



# జగన్..!?

వైపు తెలుగు, మరోవైపు ఇంగ్లిషు ముద్రించారు. మొదట అచ్చువేసిన పుస్తకాల కోసం కోట్ల కొద్దీ ధనం వృథా చేసింది.

**వనరుల దోపిడీ**

బ్రిటిష్ ప్రభుత్వం భారత వనరులు ఎలా దోపిడీ చేసిందో ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూడా అలాగే వనరులు దోపిడీ చేస్తోంది. వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇసుక, కొండలు, గుట్టలు, గనులను అందిన కాడికి దోచేస్తున్నారు. ఓట్ల కొనుగోలు రాజకీయానికి తెరలేపిన ప్రభుత్వం అభివృద్ధి పనులను విస్మరించి, 'నవరత్నాల' పేరుతో నగదు పంపిణీ కార్యక్రమాలను మాత్రమే చేస్తోంది. పట్టాభూముల పంపిణీ పేరుతో రూపాయి విలువున్న భూమిని రెండు, మూడు రెట్ల అధిక ధరలకు కొని దానిని స్థానిక ప్రజాప్రతినిధులు పంచేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ అవినీతిపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై వైసీపీ గుండాలు దాడులు చేస్తున్నారు. పోలీసు వ్యవస్థ వైసీపీ ప్రభుత్వానికి దాసోహం అయిపోయింది. ఆ పార్టీ చెప్పినట్లు ఆడుతోంది. ప్రతిపక్షాల గొంతు నొక్కేస్తోంది. స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్షాలను పోటీ చేసేందుకు అడ్డుతగిలిన విధానం చూసి సమాజం విస్తుపోయింది. ప్రతిపక్ష నాయకులపై దాడులు చేసి, అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. ప్రతిపక్షాలు రోడ్లపై స్వేచ్ఛగా ప్రచారం చేసుకోకుండా జీవో నెంబరు 1ను తీసుకొచ్చి అడ్డుకుంటోంది. మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సీఐడీ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగపరిచింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారందరినీ తీసుకెళ్లి చితక్కొట్టి వదిలారు. ప్రశ్నించడం ఆపకుంటే తమను చంపేస్తామని బెదిరిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. సమాజంలో హింస పెరిగిపోయింది. ఈ పోలీసు వ్యవస్థ పూర్వ బ్రిటిష్ వ్యవస్థను తలపిస్తోంది.

**మత వివక్ష**

రాష్ట్రంలో వైసీపీ చూపిన మత వివక్ష ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదని అన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి. క్రైస్తవుల, ముస్లింల ఓటు బ్యాంకు కోసం ప్రభుత్వం అతివాద ముస్లిం, క్రైస్తవ సంస్థలు, వ్యక్తులకు మద్దతు ఇస్తూ మత వేర్పాటువాదానికి ప్రోత్సాహం ఇస్తోంది. ముల్లాలు, పాస్టర్లకు నెలవారీ జీతాలు, చర్చిల నిర్మాణానికి నిధులిస్తోంది. అతివాద హిందువేతరులు కొందరు హిందూ దేవాలయాలపై దాడులు చేయడం, విగ్రహాలు, రథాలు ధ్వంసం చేసినా పిచ్చివాళ్లు చేసిన పనిగా చిత్రీకరించి పట్టించుకోలేదు. మతమార్పిళ్లు తీవ్రంగా జరుగుతున్నా ప్రోత్సాహం తప్ప అడ్డుకోవడం లేదు. అడ్డుకుంటున్న వారిపై కేసులు పెడుతున్నారు.

ఉదాహరణకు పెద్దారవీడులో కమ్యూనిటీ ఆసుపత్రి స్థలాన్ని కబ్జాచేసి చర్చి నిర్మించే



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**

ప్రయత్నాన్ని అడ్డుకున్న స్థానిక హిందూ చెంచులపై క్రైస్తవులుగా మారిన చెంచులు దాడిచేసి మగ, ఆడ, పిల్లలు అనే తేడా లేకుండా తలలు పగలగొడితే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అండదండలు, ఆదేశంతో హత్యాయత్నం కేసును పెట్టనీయలేదని బాధితులు వాపోయారు. అలాగే ఆత్మకూరులో మసీదు అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న బీజేపీ నంద్యాల నాయకుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని హతమార్చే కుట్ర జరిగింది. పోలీసులకు అన్ని విషయాలు తెలిసినా శ్రీశైలం, కర్నూలు, కడప ఎమ్మెల్యేల ఆదేశంతో బాధితుడైన తనపైనే పలు కేసులు పెట్టినట్లు శ్రీకాంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. క్రైస్తవ మతాన్ని స్వీకరించిన ఉన్నతాధికారి పోలీసు స్టేషన్‌లో 'హిందూ కుక్కా' అంటూ దూషించి, కొట్టి, నీ అంతుచూస్తానని బెదిరించినట్లు ఆయన ఆరోపించారు. ఈ ప్రాంతంలో వేళ్లూనుకున్న అతివాద వేర్పాటువాద ముస్లిం సంస్థలకు చెందిన వారు శ్రీకాంత్‌రెడ్డిపై దాడులు చేసినట్లు స్వయంగా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు చెప్పినా ప్రభుత్వం వినలేదు. పైగా అతనిపైనే కేసులు పెట్టి చాలా కాలం బెయిలు రాకుండా చేశారు. హిందువులను ఊచకోత కోసిన ముస్లిం రాజు టిప్పుసుల్తాన్ విగ్రహాన్ని ఎమ్మెల్యే అండదండలతో ప్రొద్దుటూరు పట్టణంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నించారు. ఎమ్మిగనూరులో ఆవుల అక్రమ తరలింపును అడ్డుకున్న యువతను చావబాది వారిపై అక్రమ కేసులు పెట్టారు. నెల్లూరులో హనుమాన్ శోభాయాత్ర చేస్తున్న హిందువులపై మసీదు వద్ద వేర్పాటువాదులు రాళ్లు, బీరు సీసాలు విసిరారు. గుంటూరులో పోలీసు స్టేషన్‌పై దాడులు చేసిన నిందితులపై కేసులను తీసివేసే ప్రయత్నం చేశారు. ఇలా ఒకటేమిటి హిందువులపై జరుగుతున్న ఎన్నో దాడులను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోలేదు. బ్రిటిషర్లు, ముస్లిం రాజులు చేసినట్లు మతవివక్షకు పాల్పడుతోంది. ఇక రేషన్ కార్డుల తొలగింపులో కూడా ప్రభుత్వం వివక్ష చూపిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.

వ్యాసకర్త: ఛైర్మన్, సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు,
కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.

రాష్ట్రంలో వైసీపీ చూపిన మత వివక్ష ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదని అన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి. క్రైస్తవుల, ముస్లింల ఓటు బ్యాంకు కోసం ప్రభుత్వం అతివాద ముస్లిం, క్రైస్తవ సంస్థలు, వ్యక్తులకు మద్దతు ఇస్తూ మత వేర్పాటువాదానికి ప్రోత్సాహం ఇస్తోంది. ముల్లాలు, పాస్టర్లకు నెలవారీ జీతాలు, చర్చిల నిర్మాణానికి నిధులిస్తోంది. అతివాద హిందువేతరులు కొందరు హిందూ దేవాలయాలపై దాడులు చేయడం, విగ్రహాలు, రథాలు ధ్వంసం చేసినా పిచ్చివాళ్లు చేసిన పనిగా చిత్రీకరించి పట్టించుకోలేదు.

# సీతమ్మకు అండగా నిలిచిన త్రిజట



రామాయణంలో 'త్రిజట' పాత్రను అసలు మరచి పోరాదు. ఎందుకంటే సీతమ్మను అపహరించిన రావణుడు ఆమెను అశోకవనంలో బంధించి, కొందరు రాక్షస స్త్రీలను కాపలా ఉంచాడు. వారిలో త్రిజట ఒకతె. ఆమెను విభీషణుని కూతురుగా చెబుతారు. తండ్రి కారణంగా కాకుండా తన వ్యక్తిత్వం కారణంగానే త్రిజట మనకు గుర్తుంటుంది.

నిజానికి సీతను ఓ కంట కనిపెడుతూ కాపలాకాయడం త్రిజట విధి! సీత కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తూ ఉంటే, తాను పేరుకి రాక్షసి అయినా తనలోనూ ఓ స్త్రీ ఉంది. అందుకే సాటి స్త్రీని సానుభూతితో అర్థం చేసుకుంది. సీత తనకు బందీగా ఉందని దర్పం చెలాయించకుండా చాలా గౌరవంగా చూసుకుంది. సీతను తూలనాడే రాక్షస స్త్రీలు త్రిజట అక్కడ ఉన్నంత వరకు నోరు మెదిపే వారు కారు. భయభక్తులతో నడుచుకునేవారు. అలాంటి త్రిజటకు ఒకనాడు ఒక కల వచ్చింది. ఆ కలలో ఆమె భవిష్యత్తును దర్శించింది. జరగబోయే పరిణామాల్ని జల్లెడపట్టింది. ఆ కలను చెప్పి సీత మనసుకు ఊరటనీ, ధైర్యాన్నీ ఇచ్చింది. రాక్షస సేన సీతను కష్టాలు పెట్టకుండా తనకొచ్చిన కలను చెప్పి ఆపగలిగింది. ఆ మాటకొస్తే హనుమంతుడు రామబంటుగా తనని తాను నిరూపించుకొని, రాముడిచ్చిన కబురుని, ఉంగరాన్నీ ఇచ్చే అవకాశాన్నిచ్చింది త్రిజటే! త్రిజట కొచ్చిన కల గురించి చెప్పకపోతే ఆమె పాత్రకు పరిపూర్ణత రానేరాదు. త్రిజట కలలో 'శ్రీరామచంద్రుడు నాలుగు దంతాలున్న ఏనుగునెక్కి ఆకాశపు దారుల వెంట వచ్చాడు. వేలవేల సూర్యుల్లా వెలిగిపోయి

ఆధ్యాత్మికం

# శివుడికి ప్రీతికరమైన 'రుద్రజడ'

❃ 'మొక్క'బడి ❃

మన చుట్టూ అనేక రకాల మొక్కలు ఉంటాయి. వీటిలో ఔషధ గుణాలతో పాటు సుగంధ ద్రవ్యంగా ఉపయోగించే మొక్కలు కూడా ఉంటాయి. అలాంటి మొక్కల్లో 'రుద్రజడ' ఒకటి. దీనిని కామ కస్తూరి మొక్క అని కూడా అంటారు. ఈ మొక్కను మన వాడుకభాషలో సబ్జా మొక్క అని పిలుస్తారు. ఈ మొక్క శివుడికి చాలా ఇష్టమైనది. అలాగే కొన్ని





దేవాలయాల్లో మొక్క ఆకులను మాలగా కట్టి దేవుడి మెడలో కూడా వేస్తూ ఉంటారు.

ఎక్కడపడితే అక్కడ పెరిగే ఈ మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది సుగంధ భరితమైన మొక్క. దీని ఆకులను చేత్తో నలిపి చూస్తే చక్కటి వాసన వస్తుంది. దీని ఆకులను ముద్దగా చేసి ఇంట్లో అక్కడక్కడ ఉంచడం వల్ల ఇంట్లోకి దోమలు, బొద్దింకలు వంటి కీటకాలు రాకుండా ఉంటాయి. ఇంట్లో కూడా చక్కటి వాసన వస్తుంది. ఈ మొక్క నుండి కొన్ని ప్రత్యేకమైన తైలాలను తయారు చేస్తారు. సబ్జా గింజలను ఎక్కువగా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ గింజల్లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఈ మొక్క ఆకులను, గింజలను వాడడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వీటిని ఉపయోగిస్తే మనం ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చన్న సంగతి తెలిసిందే. ఈ గింజలు నీటిలో వేస్తే తెల్లగా... జిగురుగా.. ఉబ్బెత్తుగా అవుతాయని మనందరికి తెలిసిందే.

ఈ మొక్కను ఇంటి ముందు పెంచుకోవడం వల్ల ఆరోగ్యపరంగా, ధన

వచ్చాడు. సీత చెయ్యి పట్టి ఏనుగు మీదకు ఎక్కించుకొని మరీ తీసుకు వెళ్లాడు. 'మరి లంకేమయింది?' అని అక్కడి రాక్షస స్త్రీలు అడిగారు. దానికి సమాధానంగా 'సర్వనాశనం అయిపోయింది. సముద్రంలో కలిసిపోయింది. రావణ కుంభకర్ణులు దిగంబరులై మురికి గుంటలో పడిపోయారు. మృత్యుదేవత వికృతమైన స్త్రీ రూపంలో ఎర్రని గుడ్డలు కట్టుకొని రావణాదుల మెడకు తాడు బిగించి దక్షిణ దిశగా లాక్కుపోతోంది. రాక్షసులందరు శవాలయ్యారు. మన జాతి మొత్తం నాశనమయింది' అని వివరించింది త్రిజట.

తోటి రాక్షస స్త్రీలంతా ఏం చేయాలో దిక్కుతోచక త్రిజట వంక చూశారు. 'సీతమ్మను వేడుకుంటే ఆ తల్లి మనకు అభయమిచ్చి కాపాడుతుంది. రక్షిస్తుంది' అంటూ వారితో నమ్మబలకడంతో వారంతా సీతకు నమస్కరించారు. ఆ భయంలో, ఊరటలో అలసి ఎక్కడి వాళ్లక్కడ నిద్రపోయారు. అశోకవృక్షం ఆకుల్లో దాగిన అదే అదునుగా హనుమంతుడు దిగి వచ్చి, సీతతో మాట్లాడ గలిగాడు. అలా సీత నమ్మకం నిలబడింది.

సీత అశోకవనంలో ఉన్నన్నాళ్లూ రాక్షసుల బెడద లేకుండా గడిపిందంటే త్రిజట వల్లనే! సీతకు శుభం కలుగుతుందని, వేకువజామున వచ్చిన కలలు నిజమవుతాయని సీత కలతని కొంత తీర్చిన త్రిజట పాత్ర చిన్నదైనా మరువలేనిది, మరువరానిది!

తొలుత తనను చూసి భయపడిన సీతమ్మతో "నేను రాక్షస స్త్రీనే అయినా మనసున్న దానిని. సాటి ఆడదాని కష్టాన్ని, బాధను అర్థం చేసుకోగలను. నీవు నిర్భయంగా ఉండు తల్లీ' అంటూ ధైర్యం చెప్పిందామె. అంతేకాదు, తనకు కలలో కనిపించిన రాముని సుందరాకారాన్ని వర్ణించి సీతమ్మకు ఆనందాన్ని కలిగించిన ఉదాత్తమైన పాత్ర త్రిజటది. ★

❄ తాత్విక 'కత' ❄

# 'నాకు కోపమేం లేదురా శుంఠా!'

తాను మహా శాంత స్వభావుడనని, కోపాన్ని జయించానని, మీ రాజ్యంలో ఎవరైనా నాలా కోపాన్ని జయిస్తే ఓటమిని ఒప్పుకుని ఇక్కడి నుంచి వెళ్లిపోతానంటూ ఓ రాజ్యానికి వచ్చాడొక సన్యాసి.

రాజు ఆ సన్యాసిని గౌరవంగా ఆహ్వానించి ఆసీనుడిని చేశాడు. 'మీ తపశ్శక్తితో కోపాన్ని జయించినందుకు అభినందనలను. మీకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాం..." అన్నాడు..

ఈ మాటలు విన్న యువకుడొకడు బిగ్గరగా నవ్వాడు.

రాజుకి ఆ యువకుని ప్రవర్తన వింతగా అనిపించింది. దాంతో అతడు ఆ యువకుడు నవ్వుకి గల కారణాన్ని అడిగాడు..

ఈలోగా సన్యాసి 'కావాలంటే నువ్వు కూడా పరీక్ష పెట్టుకోవచ్చు..' అంటుండగా "ఈ పరీక్షలో నువ్వు ఓడిపోతే ఈ రాజ్యం విడిచిపెట్టి పోవాలి.. సరేనా..' అన్నాడు రాజు కలుగజేసుకుంటూ ఆ యువకునితో..

దానికా యువకుడు సరేనంటూ సన్యాసి దగ్గరికి వచ్చి 'అర్రెరె... మీ చెంప మీద దోమ వాలిందే.. అంటూ సన్యాసి చెంప మీద చాచి లెంపకాయ కొట్టాడు..

అందుకు ఆ సన్యాసి ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'దోమ వాలితే చెప్పొచ్చు.. కదా.. కొడతావేంట్రా మూర్ఖుడా' అని అతడి మీద ఒంటి కాలి మీద లేచాడు

దాంతో ఆ యువకుడు చిరుమందహాసం చేస్తూ 'రాజా.. ఈ పరీక్షలో నేనే నెగ్గాను' అన్నాడు.

"ఎలా?" అడిగాడు రాజు.

"తనకు మంచి చేయాలని ప్రయత్నించినా దానిని స్వాగతించకుండా నా మీద ఉగ్రుడయ్యాడు ఈ సన్యాసి.. కోపంతో.." అన్నాడా యువకుడు.

ఆ మాటకు సన్యాసి సిగ్గుతో తలదించుకున్నాడు. ★

పరంగా ఎన్నో లాభాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీని గింజలను తీసుకోవడం వల్ల శరీరంలో వేడి తగ్గుతుంది. కడుపు నిండిన భావన కలిగి ఎక్కువగా ఆకలి వేయదు. అధిక బరువు సమస్య నుంచి బయటపడవచ్చు. శ్వాస సంబంధిత సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. గుండె సంబంధిత సమస్యల బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి. పొట్ట సంబంధిత సమస్యలు, కడుపులో అల్సర్లు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. వీటిలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ రుద్ర జడ మొక్క ఆకులను పచ్చడిగా చేసుకుని తింటారు.

మొక్కను ఇంట్లో పెంచుకోవడం వల్ల దోమలు రాకుండా ఉంటాయి. వీటిని ఇంటిలో చాలా సులువుగా పెంచుకోవచ్చు. కుండీలలో నాటుకోవచ్చు. అయితే స్థలం ఉంటే విడిగా నాటుకోవడమే మంచిది. ఈ మొక్కను ఇప్పుడు నాటినా కూడా రేపు రాబోయే వేసవిలో దీని గింజలతో పానీయం తయారు చేసుకుని సేదతీరచ్చు. ★

# ఐకమత్యమంటే....

ఐకమత్యం అంటే అందరూ ఒకేలా మూసపోసిన చందంగా ఉండడం కాదు. ఎవరి వ్యక్తిత్వాన్ని వారు కాపాడుకుంటూ కలసి మెలసి జీవించడమే ఐకమత్యానికి సరైన నిర్వచనం. ఆరోగ్యమైన సమాజానికి ఆధారభూమిక. చేతికి ఉన్న ఐదువేళ్లు సమానమైతే అన్నం కలవదు. ముద్ద నోటికి అందదు. తరతమ భేదాలు ప్రకృతి సహజం. వాటిని కొండంతలు చేయడం క్షుద్ర రాజకీయం. 'సత్యం ఒక్కటే. పండితులు పలు రకాలుగా వ్యాఖ్యానాలు చేస్తారు' అంటున్నాయి వేదశాస్త్రాలు. ఒక చక్రవర్తికి పలువురు సామంత రాజులు ఉండేవారు. ఎవరి రాజ్యం వారు ఏలుకునేవారు. అవసరం ఉన్నప్పుడు అండగా నిలిచేవారు. ఆపదలో ఉన్నప్పుడు చక్రవర్తి సామంతులను ఆదుకునేవాడు. పరస్పర సహకార సహజీవనమే ఐకమత్యం. 'భిన్నత్వంలో ఏకత్వం' భారతీయ జీవనవిధానం. సనాతన ధర్మం చుక్కానిగా భారతదేశం అన్ని మతాలకు, కులాలకు, జాతులు, సంస్కృతులకు, నాగరికతకు నెలవుగా ఉన్నది. ఒక 'విచిత్ర వస్తు ప్రదర్శనశాల'గా విదేశీ చరిత్రకారుల మన్ననలు, అభినందనలు అందుకుంది. సరిగమలు వేరైనా సంగీత మాధురి ఒక్కటే. దీపాలు వేయి అయినా వెలుగు ఒకటే. అందరిలోనూ ఉన్నది ఒకే ఆత్మ. 'పరమాత్మా సర్వభూతాత్మ' అంటున్నది గీత. కొమ్మలు వేరైనా చెట్టు ఒకటే కావడం స్వగత భేదం. ఒకే ఆ కొమ్మకు ఆకులు, పూలు, పండ్లు ఉండడం స్వజాతి భేదం. సెలయేరు (కొండవాగు)లో కొండ వేరు, వాగు వేరువేరుగా సాగడం విజాతీయ భేదం. అన్నింటిలో ఉన్నది ఒకే ఒక చైతన్యం. ఈ జీవిత సత్యాన్ని శకపురుషుడు వివేకానందుడు యువతరానికి రెండు చక్కని సంప్రదాయ పదాలుగా ప్రదానం చేశారు. యుగపురుషుడు 'ఉత్తిష్ఠ జాగృతః' ఏకాగ్ర బుద్ధితో మెలగాలి అంటూ కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేశాడు.

– వీఆర్




10

మరునాడు మిహిరుడు తన గురువు వద్ద సెలవు తీసుకున్నాడు. ఆయన అతనితో "నీవంటి శిష్యుడు దొరకడం, నీవు నా గురువు కావడం నా అదృష్టం. వీలయితే అలెక్సాండ్రియా నగరానికి వెళ్లి, మరిన్ని విశేషాంశాలు నేర్చుకో!'' చెప్పి వీడుకొలిపాడు.

మధ్యాహ్న భోజన సమయంలో డేరియస్‌తో తాను తన ఇంటికి తిరిగి వెళ్లగలనని మిహిరుడు చెప్పాడు. ఆయన "ఉదయమే నా జ్యేష్ఠపుత్రుడు రేవు పట్టణం చేరినట్లు వార్త వచ్చింది. రేపు కుమారులు ఇరువురూ ఇక్కడికే రాగలరు. వారిని చూసి, ఆపై వెళ్లమని నా మనవి" అన్నాడు.

"మనవి కాదు, ఆజ్ఞ అనండి. మీ కుమారు లిద్దరినీ చూడగలడం నా అదృష్టం."

* * *

డేరియస్ కుమారులు తిరిగివచ్చిన సంతోష సమయాన్ని పురస్కరించుకుని, వారం పాటు విందులూ, వేడుకలూ, సంగీత, నృత్య ప్రదర్శనలూ జరిగాయి. బంధుమిత్రులెందరో ఆ ఇద్దరినీ చూసేందుకు వచ్చారు.

అందరూ వెళ్లిన తర్వాత ఒకనాడు డేరియస్ అతని కుమారుల సమక్షంలోనే మిహిరునితో "మిహిరాచార్యా! మీరు మా ఇంట ఇంతకాలం ఉండడం మా అదృష్టమని అనుకుంటున్నాను. ఆ అదృష్టాన్ని ద్విగుణీకృతం కావాలని కోరుతున్నాం. మా కోరిక మన్నించగలరు" అన్నాడు.

"ఆచార్య శబ్ద ప్రయోగం వద్దని ఇంకొక మారు మనవి చేస్తున్నాను. నా సామర్థ్యానికి మించని ఏ పనయినా మీకోసం చేయగలను".

''మా కుమార్తె ఖనాను మీరు వివాహం చేసుకోవలసిందని మా ప్రార్థన."

కుమారులిద్దరూ తండ్రి మాటే తమ మాట అన్నట్లుగా చూశారు.

మిహిరుడు ఆశ్చర్యంతో స్తంభీభూతుడైనాడు. అతడు కలలో కూడా ఊహించని విషయమిది. భోగభాగ్యాలలో పెరిగిన ఖనా తనవంటి సాధారణ కుంటుంబి ఇంట సుఖపడగలదా?

వివేకం, సౌందర్యం, మంచితనమే సొమ్ములుగా కల ఖనా తనను ఆనంద శిఖరాలధిరోహించేలా చేయగలదు. కానీ తాను ఆమెకు ఏమీ ఇవ్వలేదు. తనలోని ఆలోచనలకు వాగ్రూపమిస్తూ మిహిరుడు "నా గురించి మీకు తెలుసును కదా! ఉపాధ్యాయునకు ధనమివ్వలేకపోయానని చెప్పి నా స్థితిని మీకు తెలియపరిచాను. వారికి భారతీయ జ్యోతిషం కొంత తెలియచేసి వారి వద్ద చదువుకున్నాను. ఉజ్జయినిలో మా కుటుంబం నివసించేది సాధారణ కుటీరం. మా ఇంట ఒక్క పరిచారిక కూడా ఉండదు. ఖనా కష్టమెరుగని యువతి. ఈ విషయం ఆలోచించ వలసిందిగా కోరుతున్నాను" అన్నాడు.

"ఖనా మీ విజ్ఞాన సంపద పట్ల ముగ్ధురా లయింది. మీ సౌందర్యమామెను ఆకర్షించినట్లుగా ఆమె సఖీజనం వలన తెలియవచ్చినది. ధనానికి ఎట్టివారూ లొంగిపోరాదని జరతుష్ట్ర ఆదేశం. అందుచేత మా విన్నపాన్ని మన్నింప ప్రార్థన".

"మీ కోరిక విషయంలో నేను నిర్ణయం తీసుకోవ డానికి భరతఖండ ధర్మం అంగీకరించదు. శ్రీమద్రా మాయణగాథ ఈ విషయాన్నే తెలియజేస్తున్నది."

డేరియస్, అతని పుత్రులూ అదేమిటో వివరించ మని అడిగారు. మిహిరుడు రామాయణంలోని బాలకాండను ఉపకథలు వదలివేసి చెప్పాడు. "విన్నారు కదా! జనక మహారాజు తన కుమార్తె సీతను విల్లును ఎత్తిన వీరునకిచ్చి వివాహం చేయవలెననుకున్నాడు. శ్రీరాముడు శివధనుర్భంగం చేశాడు. జనకుడు వెంటనే వివాహం జరిపించలేదు. రాముని తండ్రి వద్దకు దూతలను పంపి, ఆయన అంగీకారాన్ని కోరాడు. మా సంప్రదాయమది. మీ కుమార్తెను తమ కోడలిగా స్వీకరించమని మా తండ్రిగారికి వార్త పంపండి. వారి నిర్ణయానికి నేను కట్టుబడి ఉంటాను".


డేరియస్ అంగీకరించాడు. దూతలు వెంట రాగలరనీ, రథాలు ఏర్పాటు చేస్తాననీ, మిహిరుడు తాను ఏర్పాటు చేసిన రథంలోనే ఉజ్జయినికి ప్రయాణం కావలన్నది తన కోరిక అనీ చెప్పాడు.

మిహిరుడూ అంగీకరించాడు.

* * *

ఉజ్జయినికి దూతలను పంపే విషయంలో డేరియస్ చేస్తున్న ప్రయత్నాలు కుమారులకు నచ్చలేదు. సోదరి మిహిరుని ఇష్టపడుతున్న కారణంగా ఆమె వివాహం భరతఖండవాసితో జరిపించటం తమకు అంగీకారమే. కానీ మిహిరుని తండ్రి సమ్మతి కోరడమేమిటి?

పుత్రుల ముఖకవళికలను బట్టి వారి మనసును గ్రహించిన డేరియస్ వారికి వివరణాత్మకంగా చెప్పాడు. "ఖనా మిహిరుని ఇష్టపడటం చేతనే ఈ వివాహం జరిపించటం లేదు. మీ సోదరి శరీర ఛాయ నలుపు. పారశీక యువకులెవరూ




పరిణయ మాడేందుకు సిద్ధంగా లేరు. మిహిరుడు విద్యావేత్త, అందగాడు. అందుకే అతనిని జామాతగా నేనూ వరించాను. అతని సంప్రదాయాన్ని గౌరవించడం మనకు తప్పనిసరి."


నిజమే పారశీక దేశంలో నల్లని వారుండరు. దక్షిణ భరతఖండంలో పుట్టడం చేత తమ చెల్లెలు నలుపు. విషయమర్థం చేసుకున్న డేరియస్ పుత్రులు తాము కూడా ప్రయాణపు ఏర్పాట్లలో పాలు పంచుకున్నారు.

* * *

డేరియస్‌కు నమస్కరించి, అతని పుత్రులను ఆలింగనం చేసికొన్న మిహిరుడు ఖనాతో సెలవిప్పించమని అడిగాడు. 'మీ జనకులు నన్ను తమ కోడలిగా కాక దాసిగా స్వీకరించినా నాకు సమ్మతమే' అని మనసులో అనుకున్న ఖనా మిహిరుని వంక చూసి కన్నీరు పెట్టుకున్నది. ఆమెను దగ్గరగా తీసుకుని ఓదార్చాలనుకున్న కోరికను అతి కష్టం మీద అదుపులో పెట్టుకున్న మిహిరుడు రథమధిరోహించాడు. రథం కనుమరుగయ్యే దాకా ఖనా వాకిటనే నిల్చుండి పోయింది. ఆమెను చూస్తూ నిల్చున్న ఆమె తండ్రి, సోదరులు అహుర మజ్దను ప్రార్థిస్తూ ఉండిపోయారు.

* * *





సెర్విలియా శయన మందిరం.ఆసనం మీద కూర్చున్న జూలియస్ సీజర్ శయ్యపై ఉన్న తన ప్రేయసిని తదేక దృష్టితో చూస్తున్నాడు.

"నీవు చాలా తెలివైనవాడివి సుమా!" అన్నది సెర్విలియా.

"నీ మెప్పు పొందడం నా భాగ్యం"

"ఒకే దెబ్బకు రెండుపిట్టలను కొట్టిన వార్త నీ రాకకు ముందే నాకు చేరింది. అంత చక్కటి ఆలోచన ఎలా వచ్చింది?"

"ఏ లోహమైన ఉపయోగించిన కొద్దీ మెరుస్తుందట. కష్టంలో చిక్కుకున్నప్పుడే మనసులో అనేక ఊహలు కదలాడి, అన్నిటిలోనూ గొప్ప మార్గ మెంచుకోగలం."

"సముద్రపు దొంగల నుండి ఎలా బయట పడగలిగావో, రోమ్ నగరంలో నీ ప్రతిష్ట ఎలా పెంచుకున్నావో నీ నోటనే వినాలని ఉన్నది".

"ఏమంత గొప్ప విషయమని విడమరచి, వర్ణించి చెప్పడానికి? నన్ను సముద్రపు దొంగలు బంధించి ఒక ద్వీపంలోని కారాగారంలో పడవేశారు. నేను భయపడకపోవడమే కాక రోమ్‌లో చాలా ముఖ్యమైన వాడినన్న అభిప్రాయం వారికి కలిగించాను. నన్ను వదిలి పెట్టడానికి ఇరవై టాలెంట్ల వెండిని అడగాలని వాళ్లు అనుకున్నారు. కానీ నా వంటి మహాశక్తిశాలిని విడిపించుకుందుకై యాభై టాలెంట్ల వెండినైనా రోము చెల్లించగలదని నేను చెప్పాను. వారిలో ఆశ పెరిగింది. యాభై టాలెంట్ల వెండిని సమర్పిస్తేనే జూలియస్ సీజర్‌ను విడిచి పెట్టగలమని వారు వార్త పంపారు. రోమ్ వాస్తవ్యులు అంత వెండిని ఇవ్వరేమోనన్న భయం వారిలో ఉండేది. ఆ భయానికి తోడు, నేను వారితో 'నన్ను బంధించిన మిమ్మల్ని నేను వదలిపెట్టను. బంధవిముక్తుడైనాక నావికదళంతో వచ్చి, జయించి, మీ అందరినీ కొరత వేయిస్తాను' అనేవాడిని. నా మాటలను వారు హాస్యోక్తిగానే తీసుకున్నారు.

"నీ ధైర్య సాహసాలు నన్ను ఆశ్చర్యపరుస్తు న్నాయి." సెర్విలియా అంది.

జూలియస్ సీజర్ అదేమంత గొప్ప విషయ మన్నట్లుగా నవ్వి, "సముద్రపు దొంగలు పంపిన సందేశం మన నగరానికి చేరింది. జూలియస్ సీజర్ అంత గొప్పవాడా? అన్న ప్రశ్న అందరిలో తలెత్తింది. గొప్పవాడు కాకుంటే యాభై టాలెంట్ల వెండిని ఎందుకు ఇమ్మంటారు? అన్న ప్రశ్న కూడా ఉదయించింది. నేనంటే భయమూ, గౌరవమూ పెరిగాయి. వెండిని సమర్పించి, నన్ను విడిపించుకుని వచ్చాక, నాకు నగరంలో జరిగిన స్వాగతసత్కారాల గురించి

నువ్వు వినే ఉంటావు" అన్నాడు.

సెర్విలియా "అక్కడితోనే నువ్వు ఆగిపోలేదు కదా!" అంది.

"అవును... నావికదళంతో వెళ్లి సముద్రపు దొంగలను బంధించి తెచ్చి కొరత వేయించాను. వారు ఎక్కువ కష్టపడకూడదనే దయాగుణంతో వారి కంఠచ్ఛేదన త్వరగా చేయించాను."

సెర్విలియా లేచి అతని వద్దకు వచ్చి "నీ ధైర్యసాహసాలు, తెలివితేటలు అమోఘం. ప్రజలను ఆకట్టుకునేలా ప్రసంగించడం నీకు వెన్నతో పెట్టిన విద్య. కానీ అన్నిటికన్నా నన్ను ఆకట్టుకున్నది నీ సౌందర్యమే. ఒత్తైన జుట్టు, నల్లని కళ్లు, పొడుగైన నాసిక...' అంటూ అతని చుట్టూ చేతులు వేసింది.

సీజర్ గట్టిగా నవ్వి ఆమెను గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

* * *

మరునాడు సీజర్ తన ఇంటిలో కూర్చుని భార్యతో ప్రసంగిస్తున్న సమయంలో అతనిని రోమ్ రాజ్య ఆర్థిక వ్యవహారాల అధికారులలో ఒకనిగా నియమిస్తున్నట్లు వార్త వచ్చింది. కొర్నిలియా ఆనందంతో పొంగిపోయింది.



స్నానం, జపం పూర్తయిన తర్వాత ఛాయాదేవి పారసీకులకు నడిమింటిలో వడ్డన చేసింది. వారి భోజనాలైన తర్వాత మిహిరుడు ఆదిత్యదాసు శిష్య వర్గంలో ఒకరిని తోడిచ్చి ఉజ్జయినీ నగర సందర్శనా నికై పంపించాడు. తనతో వచ్చిన వారిలో ఇద్దరికి సంస్కృత భాషా పరిజ్ఞానమున్నదని తండ్రికి తెలిపాడు. వారు వెళ్లిన తర్వాత ఛాయాదేవి భర్తకూ, కుమారునకూ వడ్డన చేసింది.

"నావల్ల మీరు సర్వమూ కోల్పోయారన్న దుఃఖం నన్ను నిత్యం వేధిస్తూ ఉండేది. నేడు మీరు ముఖ్యమైన అధికారిగా నియమితులు కావడం చాలా సంతోషంగా ఉంది".

"సర్వం కోల్పోవడం ఏమిటి? నా పరాక్రమం, ధైర్య సాహసాలు, స్త్రీల హృదయాలను గెల్చే సౌందర్యం, ప్రజల మనసులను లోబరచుకునే వాక్చతుర్యం నాటికీ, నేటికీ, ఏనాటికీ శాశ్వతాలే.

మానినీ మానసచోరుడనని భర్త అనగానే కొర్నిలియా మనసులో సెర్విలియా నిలిచింది. తనను తాను నిభాయించుకున్నదామె. "మా తండ్రి అంతర్యుద్ధంలో మరణించగానే నన్ను పరిత్యజించ మని మీపై వత్తిడి రాలేదా? జూపిటర్ దేవాలయ ప్రధాన అర్చక పదవినీ, వంశ పరంపరగా వస్తున్న మీ ఆస్తినీ, నాకు నా తండ్రి ఇచ్చిన ఆస్తినీ వదులుకున్నారే కానీ నన్ను వదలలేదు. మీ ప్రేమ లభించడం నా అదృష్టం."

"నన్ను ఆజ్ఞాపించి నా చేత పనులు చేయించ గలరని సూలా అనుకున్నాడు. నన్ను శాసించడం ఎవరి తరమూ కాదు. రోమ్ నగరాన్నీ, రాజ్యాన్నీ నేనే శాసించే కాలం త్వరలోనే రాగలదు. సర్వశాసకుడినే కానీ ఒకరి ఆజ్ఞానువర్తిని ఏనాటికీ కాను".

* * *

జూలియస్ సీజర్ పదవిని స్వీకరించిన కొద్ది కాలానికే అతని మేనత్త జూలియా మరణించింది. ఆమె మరణం తనకు అనుకూల పవనాలు వీచేలా సీజర్ మార్చుకున్నాడు. ఆమె అంతిమయాత్రలో ఆమె భర్త మార్కస్ చిత్రపటాలనూ, శిల్పాలనూ పెట్టించాడు. అంతర్యుద్ధంలో మార్కస్ మరణించాక అతని ప్రస్తావనను మళ్లీ తీసుకువచ్చాడు. అంతిమ సంస్కార సమయంలో సీజర్ చేసిన ప్రసంగం ప్రజలనే కాక నాయకులను కూడా మంత్రముగ్ధులను చేసింది. ఈ ఉపన్యాసంతోనే సీజర్‌ను హిస్పానియాకు సర్వాధికారిగా నియమించారు.

* * *

రథం దిగుతున్న మిహిరుని వంక ఛాయాదేవీ, ఆదిత్యదాసులు ఆశ్చర్యంగా చూశారు. కుమారుడు ఉజ్జయినీ నగర పరిసరాలకు చేరుకున్నాడన్న వార్త వారికి ముందునాడే చేరినది. కానీ రథంలో పరిచారిక గణంతో వస్తాడని వారు ఊహించలేదు. శకటమవరోహించి, తల్లిదండ్రులకు పాదాభివందనం చేసిన మిహిరుడు తనతో వచ్చిన వారు పారశీక దేశంలో తాను నివసించిన గృహ యజమాని పంపిన వారనీ, రథం కూడా ఆయనదేననీ చెప్పాడు.

స్నానం, జపం పూర్తయిన తర్వాత ఛాయాదేవి పారసీకులకు నడిమింటిలో వడ్డన చేసింది. వారి భోజనాలైన తర్వాత మిహిరుడు ఆదిత్యదాసు శిష్య వర్గంలో ఒకరిని తోడిచ్చి ఉజ్జయినీ నగర సందర్శనా నికై పంపించాడు. తనతో వచ్చిన వారిలో ఇద్దరికి సంస్కృత భాషా పరిజ్ఞానమున్నదని తండ్రికి తెలిపాడు. వారు వెళ్లిన తర్వాత ఛాయాదేవి భర్తకూ, కుమారునకూ వడ్డన చేసింది.

తర్వాత గృహ ప్రాంగణంలో కూర్చున్న సమయంలో మిహిరుడు తండ్రితో వినయంగా తన పారశీక దేశంలోని గృహ యజమాని తండ్రి వద్దకు దూతలను పంపిన కారణాన్ని వివరించాడు. ఖనా పుట్టుక విషయాన్ని, ఆమెను దేరియస్ దంపతులు పెంచిన సంగతినీ తెలియచెప్పాక, తానామెకు ఖగోళశాస్త్రం నేర్పిన సంగతిని విశదీకరించాడు. సప్తర్షి చలనానికీ, విషుగతికీ మధ్యగల సంబంధాన్ని నేర్పించడానికై నగరం వెలుపలకు వెళ్లిన సమయంలో తన మనసు చలించిన సంగతిని తండ్రికి చెప్పాడు, దాచకుండా.

"పితృదేవులకు ఈ విషయంను తెలియ జేయడానికి ఎంతగానో లజ్జిస్తున్నాను. ఆ బలహీన క్షణంలో నా ప్రవర్తనను ఎట్టి పరిస్థితిలోనూ సమర్థించుకోను. ఇంటికి తిరిగి వచ్చాక ప్రాయశ్చిత్తకర్మ చేసుకోవలెననుకున్నాను. ఆ సమయంలోనే దేరియస్ తమ కన్యను స్వీకరించమని కోరారు. మీ అంగీకారం ముఖ్యమని నేను తెలియచేశాను. ఆ కారణంగా దూతలను నా వెంట పంపారు. మీ నిర్ణయమే నాకు శిరోధార్యం. ఖనాతో నా వివాహానికి మీరు అంగీకరించినా సరే, లేక కన్యను స్పృశించినందుకు శిక్ష విధించినా సరే. నేను మీ ఆజ్ఞకు బద్ధుణ్ణి".

ఆదిత్యదాసు మౌనం వహించాడు. మిహిరుడు తండ్రి ఎదుట తలవంచుకుని కూర్చున్నాడు. కొంతసేపు గడిచాక దాసు, "కుమారా! ఈ విషయం క్షణాలలో నిర్ణయించగలిగినది కాదు. మీ జననితో సంప్రదించాలి. అన్నిటికన్నా పరమేశ్వరానుగ్రహం ముఖ్యం" అన్నాడు.

సాయంకాలమాయన భార్యకు మిహిరుడు చెప్పిన విషయాన్ని తెలియజేశాడు. కుమారుడు బహిరంగంగా చెప్పకపోయినా ఖనాను ఇష్టపడుతున్న సంకేతాలను అందచేశాడని అన్నాడు. "పారశీక దేశంలో జరతుష్ట్ర ఉపదేశాలను అనుసరించే కుటుంబంలో పెరిగిన కన్యతో సనాతన వైదిక ధర్మాన్ని అనుసరించే యువకుడికి వివాహం కావచ్చునా అన్నది ప్రశ్న" అన్నాడు ఆదిత్యదాసు.

ఛాయాదేవి "భోగ భాగ్యాలలో పెరిగిన అమ్మాయి మన ఇంట సాధారణ జీవితాన్ని సంతోషంగా గడపగలదా? చిన్ననాటి నుంచి నమ్మిన ధర్మమార్గాన్ని వదలి భారతీయ ధర్మాన్ని అనుసరిపంగలదా? సుందరుడూ, వివేకీ అయిన మన కుమారుడామెను ఆకర్షించి ఉండవచ్చును. అంత మాత్రాన..." అని ఆగిపోయినది.

"కన్యాదాత ఆమె భవిష్యత్ జీవితం గురించి ఆలోచించకుండా, ఆమెను సంప్రదించకుండా నిర్ణయించి ఉండడు. ధర్మశాస్త్రమంగీకరించునా అన్నదే ప్రశ్న".

"మీ నిర్ణయానికి నేను బద్ధురాలను కాగలను. కుమారుని ఆనందమే నాకు ప్రధానం."

* * *

(ఒక టాలెంట్ = 33 కిలోగ్రాములు. నేటి స్పెయిన్, పోర్చుగల్ దేశాలే నాటి హిస్పానియా)

(సశేషం)



వెల్లయని దేవి ఆలయం

# ‘కాషాయం’పై కక్ష సాధింపు!

**ఏ హిందూ దేవాలయమైనా కాషాయం ప్రమేయం లేకుండా ఉండదు. ఆలయాల ముందు కనిపించే జెండాలు, స్వామీజీల వస్త్రాలు, భక్తులు ధరించే దీక్షాదుస్తులు కూడా కాషాయంలోనే ఉంటాయి. అయితే, కేరళ మార్క్సిస్ట్ ప్రభుత్వం మాత్రం ఇలా ఉండటం కుదరదంటోంది. వెల్లయని దేవాలయ ఉత్సవాల్లో కాషాయ రంగు జెండాలు కనిపించరాదని పోలీసులు ఇటీవల ఇచ్చిన ఆదేశాలపై హిందువులు తిరుగుబాటు చేశారు. కేరళ హైకోర్టు సైతం జిల్లా యంత్రాంగం తీరును తప్పుపట్టింది. హిందువుల్లో వచ్చిన ఈ చైతన్యం అక్కడి ప్రభుత్వానికి దడ పుట్టిస్తోంది.**



పినరయి

‘అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరు.’ ఒకవేళ చేతిని అడ్డుపెట్టినా వెలుతురు అంతటా ప్రసరిస్తూనే ఉంటుంది. ఇలాంటి వృథా ప్రయత్నం చేయడం తెలివి తక్కువతనమే. కానీ వాస్తవాన్ని జీర్ణించుకోలేని శక్తులు కూడా ఉంటాయి. అయినా తమ ప్రయత్నం తాము చేస్తూ పోతే దాన్ని కచ్చితంగా శాడిజమే అంటారు. ఇటీవల కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఇలాంటి కుట్రనే పన్నింది. అయితే అక్కడి పౌరసమాజం కర్రు కాల్చి వాత పెడితే తోక ముడుచుకుంది. కాషాయం అంటే మన సనాతన ధర్మానికి, సంస్కృతికి, త్యాగానికి ప్రతీక. కానీ కేరళ మార్క్సిస్టులకు కాషాయం అంటే ఎక్కడ లేని భయం. ఇటీవలి కాలంలో అక్కడ పెరుగుతున్న హిందూ ఐక్యత వారికి మింగుడు పడనీయడం లేదు.

**కాషాయం కనిపించొద్దని ఆదేశాలు**

కేరళ రాజధాని తిరువనంతపురం నుంచి 12 కి.మీ. దూరంలో వెల్లయని సరస్సు ఒడ్డున వెల్లయని దేవి ఆలయం ఉంది. వెల్లయని దేవి అంటే భద్రకాళీ మాత. కల్లియూర్ పంచాయితీ పరిధిలో ఉన్న ఈ ఆలయం ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు పరిధిలో కొనసాగుతోంది. మరో విశేషం ఏమింటే.. ఇక్కడ పూజారి బ్రాహ్మణుడు కాదు, విశ్వకర్మలు. తరతరాలుగా వీరే అర్చకులుగా ఉంటున్నారు. అయితే ఈ ఆలయానికి సంబంధించిన వ్యవహారాలను చూసుకోవడానికి గ్రామ కమిటీ కూడా ఉంది.

వెల్లయని ఆలయంలో ప్రతి మూడేళ్లకోసారి భారీఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తారు. దీనినే కాళియుత్తు మహోత్సవం (కాళికోత్సవం) అంటారు. 70 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. కేరళ నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల వారు కూడా వస్తుంటారు. కరోనా కారణంగా



ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

వాయిదా పడిన ఉత్సవాలు తిరిగి ఆరేళ్ల తర్వాత జరుగుతున్నాయి కాబట్టి మరింత అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసుకుంది. ఫిబ్రవరి 14 నుంచి.. 70 రోజుల పాటు ఈ మహోత్సవం జరుగుతోంది. ఉత్సవాలు మరో వారం రోజుల్లో ప్రారంభం కావాల్సి ఉండగా నెమోమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రగీష్ కుమార్ తన సిబ్బందితో వచ్చారు. ఉత్సవాల్లో ప్లాస్టిక్‌తో తయారు చేసిన జెండాలు వాడొద్దని చెప్పారు. ఇది పర్యావరణ హితానికి సంబంధించిన అంశం కాబట్టి ఆలయ కమిటీ అంగీకరించింది. వస్త్రంతో తయారు చేసిన జెండాలు, బ్యానర్లు, తోరణాలు కట్టేశారు. పోలీసులు మరోసారి వచ్చి నోటీసులు ఇచ్చారు. కాషాయ రంగు తోరణాలు కట్టొద్దని అందులో ఆదేశించారు. ఈ ఆదేశాలను చూసి ఆలయ కమిటీ సభ్యులు ఆశ్చర్యపోయారు. హిందూ సంస్కృతిలో కాషాయం కూడా ఒక భాగం, కాషాయం వాడొద్దు అంటే ఎలా? అని ప్రశ్నించారు. దానికి పోలీసులు స్పందిస్తూ కాషాయ రంగు మాత్రమే కాకుండా, అన్ని రంగులతో పాటు ఆ రంగు కూడా ఉంటే అభ్యంతరం లేదన్నారు. పైగా ఇందుకు శాంతిభద్రతలను కారణంగా చూపించారు. దేవాలయ ఉత్సవాల్లో కాషాయ రంగు జెండాలు, తోరణాలు, బ్యానర్లు ఉపయోగిస్తే శాంతిభద్రతలకు వచ్చిన ముప్పేమిటి? తరతరాలుగా వస్తున్న కాషాయ రంగును ఉపయోగించొద్దని ఎందుకు వత్తిడి తెస్తున్నారని ఆలయ కమిటీ గట్టిగానే నిలదీసింది. ఈ విషయాన్ని జిల్లా పాలనా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా కలెక్టర్ సహా ఏ అధికారి కూడా పట్టించుకోలేదు.

**అంతా కాషాయమే..**

పోలీసుల వత్తిళ్లకు తలొగ్గకుండా యధావిధిగా ఉత్సవాలను నిర్వహించడం ద్వారా ప్రభుత్వ తీరుకు వినూత్నంగా నిరసన తెలియజేయాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించుకున్నారు. ఫిబ్రవరి 14న కాళియుత్తు మహోత్సవం ప్రారంభం వినూత్నంగా సాగింది. కల్లియూర్ పంచాయితీకి చెందిన మహిళా భక్తులంతా కేరళ సంప్రదాయం ప్రకారం తెల్లని చీరతో పాటు కాషాయ జాకెట్ ధరించారు. పురుష భక్తులంతా తెల్లని వస్త్రాలకు తోడుగా మెడలో కాషాయ కండువా వేసుకున్నారు. అంతేకాదు, ఆలయ ఆవరణలో ఉన్న పోలీసు పోస్టు టెంటును కూడా కాషాయ వర్ణంతో అలంకరించారు.

**పోలీసుల తీరు..**

పోలీసులు తమకు కేటాయించిన పోస్టును ఉపయోగించుకోకుండా ఆలయం ముందు షామియానాతో భారీ గుడారాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కొత్త పోస్టు ప్రధాన వేడుకల నిర్వహణకు అవరోధంగా ఉండటంతో దీన్ని తొలగించాలని కమిటీ సూచించింది. ఇందుకు పోలీసులు నిరాకరించారు. దీంతో భక్తులు ఆందోళనకు దిగారు. అగ్నికి ఆజ్యం పోస్తున్నారంటూ తిరువనంతపురం అసిస్టెంట్ కమిషనర్ (ఏసీపీ) ఎస్ షాజీ రగిలిపోయారు. 'ఇలా అయితే వెల్లయని ఆలయానికి పోలీసు భద్రత కల్పించడం కష్టం' అని బెదిరించే ప్రయత్నం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆచార ప్రాముఖ్యం ఉన్న స్థలంలో పోలీసు పోస్టు నిర్మాణానికి అనుమతివ్వబోమని ఆలయ కమిటీ స్పష్టంగా చెప్పేసింది. శతాబ్దాలుగా కొనసాగిస్తున్న ఆచారంలో ప్రభుత్వ అధికారులు జోక్యం చేసు కోవడం మతపరమైన భావాలను కించపరిచేలా ఉందని ఆలయ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గి ఆ పోస్టు తొలగించక తప్పలేదు. హిందూ చైతన్యాన్ని చూసి పోలీసులకు చెమటలు పట్టాయి.

**కోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు**

ఈ ఆదేశాల వెనుక అధికార సీపీఎం నాయకుల వత్తిళ్లు ఉన్నాయని ఆలయ కమిటీకి, భక్తులకు అర్థమైపోయింది. 'జనం' టీవీలో ఇదే అంశంపై జరిగిన చర్చలో సీపీఎం ప్రతినిధిగా ఏఎం హఫీజ్ పాల్గొన్నారు. పోలీసుల వైఖరిని ఆయన సమర్థించారు. మరోవైపు కాషాయ రంగు వద్దని ఆదేశం ఇవ్వడానికి కారణం ఏమిటి? అని పోలీసులను నిలదీస్తే ఎవరో ఫోన్ ద్వారా ఫిర్యాదు ఇచ్చారని, దాని ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి ఎవరని అడిగితే భద్రతా కారణాల వల్ల చెప్పలేమని దాటవేశారు.

ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఆలయ కమిటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అధికార సీపీఎం ఆదేశాల మేరకే జిల్లా యంత్రాంగం, పోలీసులు ఉత్తర్వులు జారీ చేశారని అందులో పేర్కొంది. న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి ప్రభుత్వ ఆదేశాలను తప్పుపడుతూ తీర్పు చెప్పింది. వెల్లయని భద్రకాళి దేవి ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారమే ఉత్సవాలు నిర్వహించాలని, ఇందులో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీబీడీ), జిల్లా యంత్రాంగం, పోలీసులు జోక్యం చేసుకోరాదని తీర్పు చెప్పింది. ఆలయ ప్రాంగణంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని భయపడితే, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

**ఎన్నో అవమానాలు..**

ఇదంతా కేరళ వామపక్ష ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని చేస్తున్న కుట్ర అని కమిటీ సభ్యులతో పాటు భక్తులందరికీ అర్థమైపోయింది. ఇటువంటి సందర్భాలు అక్కడి హిందువులు గతంలోనూ ఎదుర్కొన్నారు.

2017లో వెల్లయని ఆలయం ముందు కాషాయరంగు ధ్వజం ఏర్పాటు చేస్తే పోలీసులు వచ్చి దాన్ని తొలగించమన్నారు. 'ఆలయం లోపల పెట్టుకోండి, బయట జెండాను పెట్టొద్ద'ని చెప్పారు.

ఉత్సవాల సమయంలో ఘర్షణ పడటం ఎందుకు అనుకొని భక్తులు జెండాను తొలగించేందుకు మొగ్గు చూపారు. తర్వాత కొద్ది రోజులకు స్థానిక కమ్యూనిస్టులు ఆలయం గోడలకు ఎర్రరంగు వేశారు.

2020లో ఇంతకన్నా పెద్ద అవమానమే జరిగింది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు సిబ్బంది వచ్చి ఆలయ మూలవిరాట్టును కారు డిక్కీలో వేసుకున్నారు. ఇదేమిటని అడిగితే, విగ్రహానికి రిపేర్ చేయిస్తున్నామన్నారు. మూల విరాట్టును ఇలా తొలగించి ఎక్కడికో తీసుకుపోవడం ఎందుకు? ఇక్కడే చేయవచ్చు కదా? అని గట్టిగా నిలదీయడంతో వెనక్కి తగ్గిన సిబ్బంది విగ్రహాలను యథాస్థానంలో పెట్టేశారు.

**ఎందుకీ ద్వంద్వ వైఖరి?**

కేరళ వ్యాప్తంగా లక్షలాది మసీదులు ఉన్నాయి. వాటిలో ఉత్సవాల సమయంలో ఆకుపచ్చ రంగు ఉపయోగించడంపై ఎలాంటి అభ్యంతరాలు లేవు. అక్కడ జరిగే జంతుబలులతో ఎలాంటి సమస్యలు ఉండవు. శాంతిభద్రతలకు ఎలాంటి ముప్పులేదు. కానీ హిందూ ఆలయాల్లో కాషాయరంగు ఉపయోగించడం అభ్యంతరకరమా? కాషాయం కారణంగా శాంతిభద్రతలు దెబ్బతింటాయా? ఆకుపచ్చ రంగు అయితే ప్రశాంతంగా ఉంటుందా? కేరళలో అమలవుతున్న విజయన్ మార్కు సెక్యులరిజం ఇలా ఉంది. ఈ ఘటనతో రాష్ట్రంలో హిందూ వ్యతిరేకులకు పోలీసులు సహకరిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. కేరళలో




దశాబ్దాలుగా ఇస్లామిక్, జిహాదీ సంస్థలు వేళ్లూనుకుంటూ వస్తున్నాయి. ఓటుబ్యాంకు రాజకీయాలతో అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు ఈ శక్తులను వెనకేసుకు వస్తున్నాయి. రాష్ట్రంలో పెరుగుతున్న జాతీయవాదం, హిందువుల ఐక్యత వీరికి కంటగింపుగా మారింది. ఏ మాత్రం అవకాశం వచ్చినా కఠినంగా అణచివేస్తున్నారు. వామపక్షాలు, ఇస్లాం శక్తులు ఇప్పటికే వందలాది సంఖ్యలో ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలను హత్య చేశారు.

**ఈ ఆలయమే ఎందుకు లక్ష్యం?**

కేరళ వామపక్ష ప్రభుత్వ పెద్దలకు ఇప్పుడు ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫోబియో పట్టుకుంది. కాషాయ జెండాలను నివారించేందుకు శాంతిభద్రతల సమస్యే కారణమని పేర్కొన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా వెల్లయని దేవాలయం మీద దృష్టి పెట్టడానికి కారణం కూడా ఉంది. ఈ ఆలయం నేమోమ్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇది ఒకరకంగా బీజేపీకి కంచుకోటగా మారింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో తిరువనంతపురం నుంచి కేరళ బీజేపీ సీనియర్ నాయకుడు ఓ. రాజగోపాల్ పోటీ చేసినప్పుడు నేమోమ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మంచి మెజారిటీ వచ్చింది. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో రాజగోపాల్ ఇక్కడి నుంచే రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 2015, 2020 స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ గెలుపొందిన పంచాయితీల్లో కల్లియూరు కూడా ఉంది. ఈ ప్రాంతంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ బలంగా ఉండటం వామపక్ష ప్రభుత్వానికి మింగుడు పడటం లేదు. అందుకే వెల్లయని దేవాలయం పవిత్రతను దెబ్బతీసేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



# ఆర్ఎస్ఎస్ శాఖపై డీవైఎఫ్ఐ దాడి!

కేరళకు సంబంధించిన కొన్ని వీడియోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇవి చూసిన వారికి ఆర్ఎస్ఎస్ గొప్పతనం అర్థం కావడంతో పాటు వామపక్షాలపై అసహ్యం కలుగుతుంది.

ముస్లిం ఆధిక్యత గల మల్లప్పురం జిల్లాలోని కొట్టక్కల్ వెంకిట్ట తేవర్ శివాలయ మైదానంలో ఆర్ఎస్ఎస్ నిత్యశాఖ నడుస్తోంది. ఇక్కడ శాఖ నిర్వహించడం, హిందువుల్లో చైతన్యం రావడం కమ్యూనిస్టు పార్టీలు, ముస్లిం సంస్థలకు ఇష్టం లేదు. ఫిబ్రవరి 6న సంధ్యా సమయంలో సీపీఎం అనుబంధ సంస్థ, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీవైఎఫ్ఐ)కి చెందిన 20 మంది కార్యకర్తలు శాఖా ప్రాంగణంలోకి వెళ్లారు. ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తలలు నరికేస్తామని బెదిరించారు. ఒక దశలో దాడి చేసేందుకూ యత్నించారు. ఇంత గొడవ జరుగుతున్నా శాఖలోని స్వయంసేవకులు ఏమాత్రం చలించలేదు, సరికదా వారిని పట్టించుకోకుండా తమ కార్యక్రమాలను యధావిధిగా నిర్వహించుకున్నారు. ప్రార్థనతో శాఖను ముగించారు. స్వయంసేవకులు వెళ్లిపోవడంతో డీవైఎఫ్ఐ కార్యకర్తలు కొద్ది సేపు అక్కడే ఉండి ప్రసంగాలు రికార్డు చేసుకొని వెళ్లిపోయారు.

ఆ తర్వాత రోజు అదే మైదానంలో అపురూప దృశ్యం కనిపించింది. ఆరోజు శాఖలో ముందురోజు వచ్చిన సంఖ్యకన్నా నాలుగైదింతలు ఎక్కువ మంది స్వయంసేవకులు పాల్గొన్నారు. సంఘ్ సేవా ప్రముఖ్ కెవి రామన్‌కుట్టి ముఖ్యోపన్యాసం చేయగా, ఖండ సంఘచాలక్ కె మురళీధరన్ అధ్యక్షత వహించారు. సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఈ రెండు ఘటనల దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విచిత్రం ఏమిటంటే డీవైఎఫ్ఐ కార్యకర్తలు ఆర్ఎస్ఎస్ శాఖా ప్రాంగణంలో గొడవ చేసేందుకు వస్తున్నారనే సమాచారం పోలీసులకు ఉంది. అయినా వారిని నిలువరించలేదు. పైగా ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు.

75 శాతం ముస్లిం జనాభా ఉన్న మల్లప్పురం జిల్లాలో ఆర్ఎస్ఎస్ శాఖలను అడ్డుకోవడం, బెదిరించడం అనవాయితీగా మారింది. స్వయంసేవకులపై దాడులు, హత్యలు కూడా జరిగాయి. అయినా బెదరకుండా స్వయంసేవకులు శాఖల్లో పాల్గొంటున్నారు. 2019 ప్రారంభంలో.. మలప్పురం జిల్లా ఎడప్పల్‌లో ఆర్ఎస్ఎస్ శోభాయాత్రపై సీపీఎం, డీవైఎఫ్ గూండాలు దాడి చేశారు. ఎన్ని బెదరింపులు వచ్చినా భయపడకుండా శాఖలు కొనసాగుతున్నాయి. ★

# విదుషీమణి

**నృత్యం– జన జీవనాదం, కళల తరంగం. లయబద్ధ కదలిక, చైతన్యవాహిక. సంగీతంతో సరిజోడీగా కొనసాగే నిత్య నవీన దీపిక. ఇందులోనే చరిత్ర, సంస్కృతి, వికాసం, విద్య, విజ్ఞానం, ఇంకా అనేకం నిండి ఉన్నాయి. అన్నింటినీ మించి; ఇదొక ఐక్యతా సాధనం, భారతీయతకు స్వచ్ఛమైన అచ్చమైన ప్రతిరూపం.**

ప్రాచీనంతోపాటు సమకాలీన అంశాల మేళవింపు నాట్యానికి మరెంతో వన్నె తెస్తుంది. తెలుగునాట కూచిపూడి, తమిళ సీమన భరత నాట్యం, కేరళ కథాకళి, ఉత్తరప్రదేశ్ కథక్, పంజాబ్‌లోని భాంగ్రా, అసోంకి సంబంధించిన బిహు, అలాగే మణిపురి... ఏ పేరుతో పిలిచినా ప్రతిఫలించేది మాత్రం జాతీయతే. ప్రదర్శనలు నిర్వహించినా, అనుసరించినా, పాల్గొన్నా, తిలకించినా అన్ని దశల్లోనూ వెల్లివిరిసేది సదానుభూతి.



మానసిక సమున్నతికి, శారీరక ఆరోగ్య భాగ్యానికి, సాంస్కృతిక ఉద్దీపనకి సకల విధాల ఉపకరించే నృత్య కళాక్షేత్ర వ్యవస్థాపకురాలిగా రుక్మిణీదేవి అరండేల్ సదా వందనీయ. పద్మభూషణురాలిగా, దేశికోత్తమ బిరుదానికి వన్నె తెచ్చిన కళాప్రముఖురాలిగా ఆమెది చిరయశస్సు. ఇంకా సూటిగా వర్ణించాలంటే –భారతీయ నృత్యకళను అంతర్జాతీయ వేదిక మీద కళకళ లాడించిన విదుషీమణి మన రుక్మిణి.

భావం, రాగం, తాళం–ఈ మూడింటి మేలు కలయికే భరతనాట్యం. అనేకానేక శాస్త్రీయ అంశాలకు తోడు వదన, హస్త, పాద కదలికలతో ఆబాలగోపాలాన్నీ ముగ్ధుల్ని చేసే మహాప్రక్రియ. ఇది నర్తనమైతే, ప్రత్యేకించి దక్షిణ భారతావనికి మకుటాయమానం కర్ణాటక సంగీతం. మన తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల వారికి చిరపరిచితం. గీత, నృత్య రంగాలు రెండింటా పరిణతి సాధించడమే రుక్మిణీదేవి విశిష్టత. మదురై ప్రాంతంలో జన్మించిన ఆ కళామయి పుట్టినరోజు మరింత ప్రత్యేకత సంతరించుకుంది. ఆ తేదీ ఫిబ్రవరి 29. నాలుగేళ్లకు ఒకసారే వచ్చే లీప్ సంవత్సర భాగం. జయంతి తేదీ మొదలు అంతటా ఆమెది ప్రత్యేకం. తొలి శిష్యరికం చేసింది మీనాక్షి సుందరం పిళ్లై సమక్షంలో. మొదటగా ప్రదర్శన ఇచ్చింది దివ్యజ్ఞాన సమాజం వజ్రోత్సవ సందర్భంలో. ప్రథమంగా ఆకట్టుకుంది ప్రేక్షకుల్లోని ఒక ఐర్లాండ్ కవిని. ఫలితంగానే ఇంటర్నేషనల్ ఆర్ట్స్ అకాడమీ రూపుదిద్దుకుంది. అటు తర్వాత అదే కళాక్షేత్రంగా రూపాంతరం చెంది, దేశ విదేశాల్లో మరిన్ని పేరు ప్రఖ్యాతులందుకుంది.


**సకల కళాక్షేత్ర**

కళాక్షేత్రం అంటే కేవలం భవన ప్రాంగణం కాదు. సంప్రదాయం, ప్రకృతి సౌందర్యం, ఆధునికత కలగలిసిన మేలిమి కట్టడం. నర్తనతోపాటు సంగీతానికీ అక్కడ సమధిక ప్రాధాన్యం. ఆర్ట్స్, కల్చరల్ అకాడమీ. సంస్థను స్థాపించి ఇప్పటికి ఎనిమిదిన్నర దశాబ్దాలు దాటింది. చెన్నై బీసెంట్ నగర్‌లోని దాదాపు వంద ఎకరాల సువిశాల స్థలంలోకి మారి సరిగ్గా ఆరు దశాబ్దాలు. ఇదే కళాక్షేత్ర ఫౌండేషన్‌ను జాతీయ ప్రాముఖ్య సంస్థగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి మూడు దశాబ్దాలు కావస్తోంది. ఇవన్నీ విశిష్టతలకు ఆనవాళ్లు.

రుక్మిణీదేవి దంపతుల ఆశయఫలంగా ఏర్పాటై విస్తరించిన కళాక్షేత్రం ఎందరెందరో కళాకారులను అక్కున చేర్చుకుంది. ప్రముఖులెందరినో అనేక ప్రాంతాల నుంచి ఆహ్వానించి బోధనలు ఏర్పాటు చేసింది. కార్యక్రమాల పరంపరతో నిత్యశోభాయమానంగా ఉంటుండేది కళాక్షేత్రం. అక్కడ సంగీత నృత్యాలతోపాటు ఇతర డిప్లొమా కోర్సుల నిర్వహణకీ నాటి మద్రాసు విశ్వవిద్యాలయం అనుమతినిచ్చింది. రెండు దశాబ్దాల నాడు అక్కడే కళాక్షేత్రంలోనే రుక్మిణి వంద సంవత్సరాల పండుగ అయింది. తన శతజయంతి మహోత్సవాలను ఏడాది పొడవునా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒక్క తమిళనాడులోనే కాకుండా దేశవిదేశాల్లో కూడా సంబరాలు అంబరాన్నంటాయి. అప్పట్లో లీప్ సంవత్సరం ఫిబ్రవరి 29వ తేదీన దేశ రాజధానిలోని లలిత కళా గ్యాలరీలో వర్ణచిత్రాల ప్రదర్శనను నిర్వహించారు. ఆమె ఫోటో బయోగ్రఫీని నాటి రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆవిష్కరించారు. నాట్య రంగానికి గుర్తింపూ గౌరవాలనూ అనంతంగా తెచ్చిన మహోన్నతురాలిగా ఆమెను కీర్తించారు.

**మలుపులూ మెరుపులూ**

తనను ఎంతగానో ప్రోత్సహించిన తల్లి దండ్రులకు సదాకృతజ్ఞతలు చెప్తుండేవారు రుక్మిణీదేవి. తల్లి శేషమ్మాళ్ స్వస్థలం సంగీత కేంద్రమైన తిరువయ్యూరు. తండ్రి నీలకంఠశాస్త్రి సంస్కృత నిలయంగా పేరొందిన ప్రాంతీయులు. వారందించిన ఉత్సాహంతో సంగీత నాట్య కళా ప్రదర్శనలతో దూసుకెళ్లిందామె. మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవ సభావేదికపైన ఒక అపురూప ప్రదర్శనను చూసి తన్మయురాలైంది. మొట్టమొదట తానే ప్రదర్శన ఇచ్చినప్పుడు, కళారాధకుల ముందు మనోహరంగా నర్తించినప్పుడు ఆమెకి 30 సంవత్స రాల వయసు. అసంఖ్యాకుల ప్రశంసలందుకున్న గొప్ప కార్యక్రమం అది. అప్పటి నుంచీ తన జీవితం మలుపు తిరిగింది. వివాహమయ్యాక దంపతులు ఐరోపా దేశాల్ని పర్యటించారు. ఎన్నెన్నో కళా రూపాలను కూలంకషంగా అవగతం చేసు కున్నారు. ఈ అధ్యయనం, పరిశోధనలు కళాక్షేత్ర ఆవిర్భావానికి మూలమయ్యాయి. పలు



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్



# రుక్మిణి

రూపకాలను ఆవిష్క రించారు రుక్మిణీదేవి. శ్రీరామ పట్టాభిషేకం, గీతగోవిందం, కుమార సంభవం – వాటిల్లో కొన్ని. కళారూపాలు తరతరాలూ కొనసాగాలన్న తపన ఆమెతో ఎన్నో పనులు చేయించింది. తన క్షేత్రంలో వృత్తి విద్యలు, దేశవాళీ పరిశ్రమల స్థాపన, నిర్వహణకూ తగినంత ప్రాధాన్యమిచ్చారు. విద్య, శిక్షణ, ప్రయోగాలతో నూతన ఒరవడికి ఆద్యులయ్యా రామె. థియోసాఫికల్ హైస్కూలు, మాంటెస్సోరీ స్కూలు, క్రాఫ్ట్ ఎడ్యుకేషన్ – రీసెర్చి సెంటర్, కలంకారీ విభాగం... ఇవన్నీ కళాక్షేత్రంలో వెల్లివిరి శాయి. మ్యూజియం, గ్రంథాలయం, ఓపెన్ ఎయిర్ థియేటర్ వంటివెన్నో సేవలందించాయి. ఈ అన్నీ మనదైన సంస్కృతిని విస్తృత ప్రాచుర్యానికి తెచ్చాయి.

**విశ్వకవి నుంచి ప్రశంస**

మనోపరిజ్ఞానం, త్యాగచింతన, స్థిరమైన ఆలోచన–ఈ మూడూ రుక్మిణీదేవి ప్రధాన లక్షణాలు. అత్యున్నత పదవికి అవకాశం లభించినా, కళాసేవకే తొలి ప్రాముఖ్య మిచ్చారు. కళారంగానికి మన దేశంలో సరికొత్త రూపునివ్వాలన్న ఆమె కృషి విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌ని ముగ్ధుల్ని చేసింది. శాంతినికేతన్, కళాక్షేత్ర... ఈ రెండింటినీ భారత దేశంలోని మహోన్నత ధామాలుగా అభివర్ణించిన వారున్నారు. ఆ నృత్య ప్రతిభాశాలినిని పారదర్శకతకు ప్రతీకగా భావిస్తారందరూ. శాస్త్రీయ సంగీతాన్ని పునరుజ్జీవింపచేసిన వారిలో ఒకరిగా పరిగణిస్తా రెప్పుడూ.

ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు, అక్కడి మేటి కళాకారిణితో పరిచయం పొందారు రుక్మిణీదేవి. ఆమే అన్నా పావ్లోవా. శాస్త్రీయ, ఆధునిక నృత్యరీతుల ఆధారంగా పరస్పరం ప్రభావితులయ్యారు. ఉభయుల సంభాషణలు, ప్రదర్శనలు సరికొత్త కళాసంస్కృతికి కేంద్రాలయ్యాయి. పలు నూతన ఆవిష్కరణలకి అవి దారితీశాయి. కళాక్షేత్రం నుంచి ప్రముఖులెందరో ఆవిర్భవించారు. వారంతా ప్రసిద్ధ నృత్యకారిణులుగా యశస్సు గడించినవారే. అందరినీ తీర్చిదిద్దిన ఆమె సంగీత నాటక అకాడమీ నుంచి ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. దేశాన్ని తీర్చిదిద్దిన వందమంది జాబితాలో చోటు సంపాదించుకున్నారు.

**విలువల స్థిరీకరణ**

భరతముని నాట్యశాస్త్రం ఆధారంగా రూపొందిన ప్రక్రియలో వర్ణం, పదం, అలరింపు, తిల్లానా, మరెన్నో అంతర్భాగాలు. వీటికి తోడు చక్కని నియమ నిబంధనలెన్నో ఉన్నాయి. ఆ అన్నింటినీ నవీనతతో సమన్వయించి, రుక్మిణీదేవి నెలకొల్పిన విలువలు శిఖర సమానాలు. వ్యక్తిగా, నృత్యశక్తిగా నాడు కలిగించిన ప్రభావం నేటికీ కొనసాగుతూనే వస్తోంది. ఆదర్శానికి, ప్రతిభాసంపన్నతకీ రూపంలా భాసించే ఆమె పరిపూర్ణురాలు, స్ఫూర్తినందించిన ధన్యజీవని. సదా స్మరించి తీరాల్సిన మహిళామణి. ★

## తిరుపతి నగర సాంఘిక్






**తిరుపతి :** ఫిబ్రవరి 19న తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆర్.ఎస్.ఎస్. నగర సాంఘిక్ జరిగింది. వేదికపై నగర సంఘచాలక్ డాక్టర్ దత్తాత్రేయరావు, ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, వైస్ ఛాన్సలర్ క్రిష్ణమూర్తి ఉన్నారు. గణవేష్ ధారి స్వయంసేవకులు:248, గణవేష్ లేని స్వయంసేవకులు: 69 బాల స్వయంసేవకులు:25, మొత్తం సంఖ్య: 342, మహిళలు: 22

## ఉచిత వైద్యశిబిరం





**సంగారెడ్డి :** మాధవ సేవాసమితి – సంగారెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న శ్రీ గురూజీ జయంతి సందర్భంగా మాధవ సదన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ శిబిరంలో అధ్యక్షులు ఆకుల శివరాములు, ప్రధాన కార్యదర్శి అంబరీష్, కోశాధికారి పూర్ణచంద్రశేఖర్, జిల్లా సంఘచాలకులు ఎస్.రామకృష్ణ, డాక్టర్లు న.చ.భారతి, ఆర్యదీప, సభ్యులు సురేందర్‌రెడ్డి, బొల్లి నర్సింహులు పాల్గొన్నారు. సంవత్సరం నుండి ప్రతి నెల మూడవ ఆదివారం మహిళలకు ప్రత్యేకంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

# ఒక తపస్విని గాథ

వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యులకు పెద్దగా ప్రాచుర్యం రాలేదు. నిజానికి వారంతా యోగులుగా ఉండి పోయారు. స్వామి భక్తులుగానే జీవితం చాలించారు. అలాంటివారిలో ఒకరు యోగిని దివ్యాంబ. స్వామి తిరునాళ్ల తిప్ప అనే చోటుకు వచ్చేవారు. మొదటిసారి వచ్చినప్పుడు ఆయన వెంట దివ్యాంబ వచ్చింది. అక్కడే ఉండి తపోసాధన చేయవలసిందని గురువు ఆదేశించారు. రెండవసారి స్వామి వచ్చినప్పుడు మళ్లీ గురూపదేశంతో నాలుగు దశాబ్దాలు ఆమె అక్కడే తపోసాధన చేసి కైవల్యం పొందారు. ఈమె ఆలయాన్ని భక్తుడు వెంకన్న నిర్మించారు. ఈమెనే బట్టేపాడు గ్రామదేవతగా ఆరాధిస్తారు.

ఈ అంశాలనే తూమాటి వీరనారాయణరెడ్డి సంకలనంగా తీసుకువచ్చారు. అదే, 'భృగు తపోక్షేత్ర మహిమ– కల్క్యవతార దర్శనం కొరకు నిరీక్షించుచున్న మహాయోగిని శ్రీ దివ్యాంబ చరితము'. ఈ పుస్తకం చదువుతుంటే చాలామంది సిద్ధపురుషుల, యోగులకు సంబంధించిన స్థలపురాణం చదువుతున్నట్టు ఉంటుంది. అరుణాచలేశ్వరుని ఆలయంలో తను అనుభవాలను రాసుకున్న కానూరు రంగనాథాచార్యులు దివ్యాంబ గురించి ప్రస్తావించారు. ఆ వివరాలు కూడా ఈ పుస్తక రచనకు ఉపకరించాయి. బేడి ఆంజనేయ స్వామి ఆరాధన ఈ రచనకు తనను సమాయత్తం చేసిందని రచయిత నమ్మకం. అలాగే రమణమహర్షి శిష్యులు కావ్యకంఠ గణపతి ముని ఇచ్చిన వివరాలను కూడా ఈ చిన్న గ్రంథంలో ఇచ్చారు. కాగా దివ్యాంబ చరిత్రతో పాటు కొన్ని ఇతర ఆధ్యాత్మిక సమాచారం కూడా ఈ పుస్తకంలో ఉంది. ★



**'భృగు తపోక్షేత్ర మహిమ– కల్క్యవతార దర్శనం కొరకు నిరీక్షించుచున్న మహాయోగిని శ్రీ దివ్యాంబ చరితము'**

**ప్రతులకు:** తూమాటి వీరనారాయణరెడ్డి, బట్టేపాడు, ఆత్మకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా,

**సెల్:** 9494618322, **వెల:** అమూల్యం.

# మాయమవుతున్న మనిషితనం గురించి ఆవేదన

మనుషుల్లో మానవత్వం నశిస్తోంది. అనుబంధాలు, ఆప్యాయతలు అడుగంటుతున్నాయి. స్వార్థం, ధన వ్యామోహంతో మనిషి పతనమవుతున్నాడు. బాల్యం చెదిరిపోయింది. స్నేహానికి అర్థం మారిపోయింది. వివాహబంధం బలహీన పడుతోంది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగయిన ప్రభావం మానవ సంబంధాలు అన్నింటిపైనా కనిపిస్తోంది. "మా రోజులు మారిపోయాయి' కథా సంపుటిలో వియోగి.. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయో చూపించారు. రోజూ మన కళ్ల ముందు కనిపించే సహజమైన వాతావరణంలో వల్లనేమో చాలా కథలు వెంటాడతాయి. ఆయా పాత్రలతో సహానుభూతి చెందేలా చేస్తాయి.

'హు తెలివి' కథలో.. "మా అమ్మానాన్న ఎంత కాలం బతుకుతారు?" అని ఫ్యామిలీ డాక్టర్‌ను అడుగుతాడు చిరంజీవి. తర్వాత అడ్వొకేటు సహకారంతో తండ్రి నుంచి వీలునామా రాయించు కుని వృద్ధాశ్రమంలో విడిచిపెడతాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలవుతాడు. తన వాళ్లంతా వచ్చి బతికించమని ప్రాధేయ పడటం, చుట్టూ వాళ్ల మాటలు అన్నీ వినపడు తూనే ఉంటాయి. నోరుతెరిచి మాట్లాడలేని నిస్సహాయత అతనిది. డాక్టర్, నర్సూ అతని దుర్మార్గమైన ప్రవర్తనను తూలనాడు తూండటంతో పశ్చాత్తాపం అతన్ని కుంగ తీస్తుంది.

"నా బిడ్డ సుఖం కంటే ఇంకేం నాకు ముఖ్యం కాదు" అని పెద్ద మనసుతో తల్లి ప్రవర్తించటం 'ఆ అమ్మ ప్రేమ' కథలో కనిపిస్తుంది. ఒంటరి తల్లి పెంపకంలో పెరిగి పెద్దవాడై బెంగళూరులో ఉద్యోగంలో కుదురుకుంటాడు సునీల్. ఇక తన కష్టాలు తీరినట్టేనని, కన్న బిడ్డతో పాటు కలిసి ఉండొచ్చని తెగ సంబరపడుతుంది తల్లి సునీత. అతను తీసికెళ్లడు కదా, ఉన్నత స్థాయి సంబంధం చూసుకుంటాడు. "మీ అమ్మను తెచ్చి మా ఇంట్లో పెట్టుకోలేం. అందుకు అంగీకరిస్తేనే పెళ్లి" వియ్యం కులు షరతు విధిస్తే అందుకు తలొగ్గుతుంది.



**మా రోజులు మారిపోయాయి**

**రచయిత :** వియోగి, **వెల :** రూ.350/–

**ప్రతులకు :** రచయిత,

**ఫోన్ :** 95026 29095, 99639 26610

వీలునామానా? రిజిస్ట్రేషనా? తండ్రికి మాయ మాటలు చెప్పి ఇల్లు కొట్టెయ్యాలనుకున్న హనుమంత తర్జనభర్జన పడతాడు 'భవిష్యత్తు బెంగ' కథలో. వీలునామా అంటే చనిపోయిన తర్వాత గానీ ఆస్తి రాదు. గిఫ్ట్ డీడ్‌గా రిజిస్ట్రేషన్ నయం అని సలహా ఇస్తుంది ఇల్లాలు. బ్యాంకు బ్యాలెన్సులు డ్రాచేసి అప్పులు చేసి స్టాంపు కాగితాలు కొని తెస్తారు. ఆ తర్వాత కథ ఊహించని ఆసక్తికరమైన మలుపు తిరుగుతుంది. అమెరికాలో ఉద్యోగం చేసి తనను అడుగడుగునా నిర్లక్ష్యం చేసిన కొడుకు పెళ్లి చేసుకుంటుంటే, వెళ్లటానికి సుముఖత చూపడు సాంబయ్య. ఊళ్లోనే ఉండి రామాలయంలో కొడుకు పేరుమీద కల్యాణం చేయిస్తాడు. పళ్లు పంచుతాడు. కొన్ని రోజుల తర్వాత అతనికి ఫోన్ వస్తుంది వియ్యంకుడి నుంచి. పరుగున వెళతాడు, అనాథలా ఆస్పత్రి మంచం మీద కుంగిపోతున్న బిడ్డను చూసి తల్లడిల్లుతాడు. 'మారోజులు మారి పోయాయి' కథ ఈ సంపుటిలోనే శిఖరాయమానంగా నిలుస్తుంది.

'కలికాలం' కథ చదివితే ఈ లోకం ఎలా నడుస్తోందో అర్థమవుతుంది. పదో తరగతి పరీక్ష ఫీజుకు చెల్లించటానికి డబ్బులు లేక విచారపడుతున్న బాలికకు సాయపడటానికి ముందుకొస్తాడు మస్తానయ్య. చేతికందిన ప్రావిడెంట్ ఫండ్ లోంచి డబ్బు ఇస్తాడు. ఆడపిల్లను ప్రలోభపెట్టి వంచించడానికి సిద్ధపడ్డాడని అతన్ని చితకబాదుతారు.

ఈ లోకం చెడును ప్రేమించినంతగా మంచిని ప్రేమించదు అని విచారిస్తాడు మస్తానయ్య.


కస్తూరి మృగం చుట్టుపక్కల పరిమళం వ్యాపించి ఉంటుంది. ఆ సుగంధం ఎక్కడి నుంచి వస్తుందోనని అది అన్వేషిస్తూంటుంది. దాని నాభి నుంచే అన్న విషయం దానికి తెలియదు. అలాగే మనిషి ఆనందం కోసం అన్వేషిస్తూ పిచ్చివాడవుతూంటాడు. అది తనలోనే ఉందనే సత్యాన్ని గ్రహించలేకపోతాడు. 'మనసు అంతర్గతమైతే ఆనందం, బహిర్గతమైతే బాధ' అన్న విషయం 'కస్తూరి మృగం' కథ చెబుతుంది.

ఈరోజుల్లో మగపిల్లలకు సంబంధాలు కుదరటం కష్టంగా ఉందనేది వాస్తవం. 'చక్రభ్రమణం' కథలో ఇదే ప్రధాన అంశం. "వాడికి తిక్కకుదిరింది. దేముడు కవలపిల్లల్నిపుట్టించాడు. ఇద్దరూ ఆడపిల్లలే" అంటూ సంబరపడిన శ్రీపతి స్నేహితుడిని అడుగడుగునా చిన్నబుచ్చుతూంటాడు. చివరకు ఆడపిల్లలిద్దరు క్యాంపస్ సెలక్షన్ తెచ్చుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అవుతారు. అంతకంటే ఎక్కువ స్థాయి ఉన్న వాళ్లని కట్టుకుని స్థిరపడిపోతారు. నలుగురు మొగపిల్లలకు తగిన సంబంధాలు రాక శ్రీపతికి చింత మిగులుతుంది.

'డిగ్నిటీ ఆఫ్ లేబర్' ను గొప్పగా చాటిన కథ 'స్ఫూర్తి స్పందన'. కరోనా కారణంగా లత చేస్తున్న ఉద్యోగం పోతుంది. ప్రత్యామ్నాయంగా ఆమె ఎంచుకున్న పని కుటుంబసభ్యులకు నచ్చదు. "ఒకప్పుడు వేదం చదివిన వారికి విలువ ఉండేది. వారి బతుక్కి ఢోకా ఉండేది కాదు. ఆ రోజులు మారిపోయాయి. పూజారి పనిచేస్తుంటే ఎవరూ పిల్లను ఇవ్వటం లేదు. ఒకప్పుడు ఎంబీఏ చదివిన వాళ్లు కొందరి సూపర్ బజార్లలో పనిచేస్తున్నారు. చాలీచాలని జీతాలతో. కొందరికి అది కూడా దక్కటంలేదు" అని పరిస్థితిని వివరించి చెబుతుంది. అనుకోకుండా ఓ స్నేహితురాలు కలవటంతో పరిస్థితి మారిపోతుంది. "ఉద్యోగాలు పోయిన వాళ్లు డిప్రెషన్‌కు లోనవుతున్నారు. విధిని ఎదిరించి ఆత్మవిశ్వాసంతో నువ్వు నిలబడ్డావు" అని ఆమె చేస్తున్న పనిని మెచ్చుకుని, సామాజిక మాధ్యమంలో ఉంచుతుంది. "దేహి అనకుండా నా కాళ్ల మీద నిలబడుతున్నాను. ఇలా చేయటంలో నాకు ఆనందం కలుగుతుంది. నేను బతుకుతూ నా వాళ్లను బతికిస్తు న్నాను" అని గొప్పగా చెబుతుంది కాయగూరలు అమ్ముతున్న లత. వీడియో బాగా వైరల్ అయి ఆమె పాపులరవుతుంది. విలేకరులు వెంటపడతారు. "ఇదంతా మా అత్త, మామగార్ల ఆలోచన. వాళ్ల అండదండలు నాకు పుష్కలంగా ఉన్నాయి" అని చిన్న అబద్ధం చెబుతుంది. కుటుంబంలో ఒక్కసారి ఆమె విలువ పెరిగిపోతుంది. భర్త బద్ధకానికి నీళ్లు వదులుతాడు. అత్తమామలు నెత్తిన పెట్టుకోవటం మొదలుపెడతారు. ఇప్పుడు మమ్మల్ని అందరూ గొప్పగా చూస్తున్నారని పిల్లలు బిందు, సింధు కూడా సంబరపడతారు. ఇల్లాళ్ల సాహసానికి అద్దం పట్టే మరో కథ 'కరణేషు మంత్రి'. కరోనా వేళ చికిత్సకు బాధిత కుటుంబ సభ్యుల ఇబ్బందుల వెతలను 'కరోనా నీలినీడలు'లోనూ, మృత్యుముఖం నుంచి బయటపడిన వ్యక్తి డబ్బు విలువను గుర్తించటం పైన 'రియలైజేషన్' లోనూ చూడొచ్చు. 'సొంత లాభం కొంత మానుకుని' కథలో.. ఓ ఆటో డ్రైవర్ మంచితనం కనిపిస్తుంది. ఎవరో పదిలక్షల సూట్ కేసును మరిచిపోతే, దానిని తీసికెళ్లి పోలీసు స్టేషన్ లో అప్పచెబుతాడు. శవాలు, గర్భవతుల నుంచి ఒక్క పైసా కూడా తీసుకోడు. కుటుంబం పేదరికంలో మగ్గుతున్నా తన మార్గాన్ని వీడకుండా ఔదార్యాన్ని చూపుతాడు.

'చివరి కోరిక'కథలో.. సాటి రచయిత నుంచి పార్సిల్ వస్తే, అందులో పుస్తకాలు వచ్చాయను కుంటాడు విరించి. కానీ చితాభస్మం అందుతుంది. అస్తికలు, చితాభస్మాన్ని కాశీలోని హరిశ్చంద్రాఘాట్ లోని గంగానదిలో నిమజ్జనం చేయమని అందులో ఆమె కోరుకుంటుంది. ఇలా ప్రతి కథలోనూ ఏదో ఒక విలక్షణతను చూపి మెప్పిస్తారు వియోగి. కథా ప్రియులు ఆదరించి అక్కున చేర్చుకోవలసిన రచన ఇది. ★






# జాతి ప్రగతికి రహదారులు జవజీవాలు


**జాతీయ రహదార్లు దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయి. ముఖ్యంగా వివిధ మార్కెట్లకు సరకుల రవాణా మరింత సులభతరం కావడమే కాకుండా, ప్రజలు కూడా వేర్వేరు ప్రాంతాలకు తేలిగ్గా ప్రయాణించ గలుగుతారు. రోడ్డు రవాణా వల్ల దేశంలోని అన్ని ప్రాంతాల్లో సామాజిక-ఆర్థికాభివృద్ధి సమానంగా జరుగుతుంది. అంతేకాదు దేశం మొత్తం సామాజిక-ఆర్థిక ఏకీకరణకు కూడా దోహదం చేస్తుంది. తేలిగ్గా అందుబాటులో వుండటం, సులువుగా కార్యకలాపాల నిర్వహణ, డోర్-టు-డోర్ సేవలు, విశ్వస నీయత కారణంగా రోడ్డు రవాణా ఇటు సరుకురవాణా, అటు ప్రయాణీకుల చేరవేతలో అత్యంత కీలకపాత్ర పోషిస్తోంది. దేశంలో మొత్తం రోడ్ల నెట్‌వర్క్ 63.73 లక్షల కిలోమీటర్లు. ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద నెట్‌వర్క్. 2022 నవంబర్ 30 నాటికి దేశంలోని మొత్తం జాతీయ రహదారుల పొడవు 1,44,634 కిలోమీటర్లు కాగా రాష్ట్ర రహదార్లు 1,86,908 కిలోమీటర్లు, ఇతర రోడ్లు 59,02,539 కిలోమీటర్లు. దేశంలో మొత్తం 599 జాతీయ రహదారులున్నాయి.**

దేశంలో మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా జాతీయ రహదారుల నిర్మాణానికి 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.73 వేల కోట్లు కేటాయించింది. గతంతో పోలిస్తే ఇది 50% అధికం. దీన్నిబట్టి లక్ష్య సాధనపై ప్రభుత్వం ఎంతటి కృతనిశ్చయంతో ఉన్నదీ తెలుస్తోంది. ఇక జాతీయ రహదారుల


ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విషయానికి వస్తే, రోడ్ల నిర్మాణానికి వెచ్చించే నిధులు 15% పెరిగి రూ.1.62 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వార్షిక రహదారుల నిర్మాణంలో 60% రోడ్ల నిర్మాణమే ఆక్రమిస్తోంది. ఆయా రాష్ట్రాల ప్రజాపనుల శాఖల ద్వారా ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారుల విస్తరణతో పాటు వాటిని మరింత బలోపేతం చేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రధానంగా విశాలమైన రోడ్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, ఆర్థిక నడవాల నిర్మాణాలను చేపడుతుంది. 2022లో మొత్తం రూ. 2.8 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. అంతేకాదు దేశ చరిత్రలో మొట్టమొదటిసారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం 'ష్యూరిటీ బాండ్'లను విడుదల చేసింది. నేషనల్ హైవే ఇన్‌ఫ్రా ట్రస్ట్ బాండ్లను, బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ చేయడం ద్వారా రూ.1500 కోట్లను కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ బాండ్ల రూపంలో సమీకరించింది. అంతేకాదు జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి 2022లో ప్రధాని నరేంద్రమోదీ మొత్తం రూ.57,020 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను ప్రారంభించడమో లేక శంకుస్థాపన చేయడమో జరిగింది. అదేవిధంగా కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రూ.2,30,802 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు.

**'లేన్ కిలోమీటర్' అంటే...**

విదేశాల్లో రోడ్ల నిర్మాణంలో "లేన్ కిలోమీటర్" ప్రాతిపదికన గణిస్తే మన దేశంలో కేవలం కిలోమీటర్ల లోనే రోడ్ల నిర్మాణాన్ని లెక్కిస్తారు. అంటే మనదేశంలో 8 లేన్ల రహదారిని కిలోమీటరు మేర నిర్మించినప్పుడు దాన్ని కేవలం ఒక కిలోమీటరుగానే పరిగణిస్తారు తప్ప 8 లేన్ కిలోమీటర్‌గా లెక్కించరు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రెండు లేన్ల రహదారుల నిర్మాణం, బలోపేతం వాటా 6,893 కిలోమీటర్లు. ఇదే ఏడాది మొత్తం రహదారుల నిర్మాణం 10,237 కిలోమీటర్ల మేర జరిగింది. 2020-21లో రహదారుల నిర్మాణం శిఖర స్థాయిలో జరిగిందనే చెప్పాలి. మొత్తం 13,327 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం జరగ్గా, రెండు లేన్ల రోడ్ల



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



నిర్మాణం, బలోపేతం చేసే వాటా 9,315 కిలోమీటర్లు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 12,200 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

**ఐటీఎస్‌లో మార్పులు**

కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ ఇప్పటివరకు అమల్లో ఉన్న 'ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్' (ఐటీఎస్)లో మార్పులు తీసుకొచ్చి, 2022, జూన్ 23న ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. వివిధ రాష్ట్రాల్లోని రవాణా యూనిట్లు, ఈ సరికొత్త ఐటీఎస్ సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించుకొని ప్రజలకు మరింత ఉన్నత ప్రమాణాల్లో సేవలు అందించేందుకు వీలవుతుంది. ముఖ్యంగా ఫ్లీట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థకు అవసరమైన హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కాంపొనెంట్లను ఇది అందజేస్తుంది. ఎలక్ట్రానిక్ టిక్కెటింగ్ సిస్టమ్, ఫేర్ కలెక్షన్ సిస్టమ్, ప్రయాణికుల సమాచారం, ఫీడ్‌బ్యాక్ వ్యవస్థలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇప్పటివరకు కేంద్ర మంత్రిత్వ శాఖకు వివిధ రాష్ట్రాల రవాణా యూనిట్ల నుంచి రూ.200 కోట్ల విలువైన ప్రతిపాదనలు అందాయి. టీఎస్ఆర్‌టీసీ, కేఎస్ఆర్టీసీ, జీఎస్ఆర్‌టీసీ, బీఈఎస్‌టీ, అహమ్మదాబాద్ జల్‌మార్గ్ లిమిటెడ్, భోపాల్ సిటీ లింక్ లిమిటెడ్, కేరళ ఎస్.ఆర్.టీ.సీ. వీటిల్లో ఉన్నాయి. ఈ ప్రతిపాదనలను ప్రస్తుతం కేంద్ర మంత్రిత్వశాఖ పరిశీలిస్తోంది.

**భారత్‌మాల**

దేశవ్యాప్తంగా సరుకు రవాణా, ప్రజల సంచారాన్ని మరింత సమర్థవంతం చేయడం భారత్‌మాల ప్రధాన లక్ష్యం. భారత్‌మాల పరియోజన కింద కేంద్రం అభివృద్ధి చేసే 35 మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు రవాణాను సుసంఘటితం చేయడమే కాకుండా, పంపిణీ హబ్‌లుగా పని చేస్తాయి. నిజానికి 2014-15 నుంచి 2021-22 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం అత్యంత వేగంగా పురోగతి సాధించింది. 2014-15లో రోజుకు 12 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే, 2021-22 నాటికి 29 కిలోమీటర్లకు పెరగడాన్ని గమనిస్తే దేశంలో జాతీయ రహదారుల నిర్మాణవేగం ఎంతగా పుంజుకున్నదీ అర్థమవుతుంది. మొట్టమొదటిసారి 2017లో భారత్‌మాల- ఫేజ్1కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మౌలిక సదుపాయాల కల్పనలో ఉన్న అంతరాలను పూడ్చడమే లక్ష్యంగా దేశంలో 34,800 కిలోమీటర్ల హైవేల నిర్మాణానికి ఉపక్రమించింది. ఈ పరియోజన "కారిడార్ ఆధారిత జాతీయ రహదారుల అభివృద్ధి"కి ప్రాధాన్యతనిచ్చింది. ఈ పరియోజన కింద, ఆర్థిక నడవాల అభివృద్ధి, అంతర్ కారిడార్లు, ఫీడర్ రూట్ల అభివృద్ధి, జాతీయ కారిడార్ల సామర్థ్యం పెంపు, సరిహద్దు, అంతర్జాతీయ అనుసంధాన రహదారుల నిర్మాణం, తీర, పోర్టుల అనుసంధాన రహదార్లు, ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణాలు జరిగాయి.

**గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు**

భారత్‌మాల-ఫేజ్1 కింద దేశవ్యాప్తంగా 9 వేల కిలోమీటర్ల మేర 27 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికా రచన జరిగింది. అంతేకాదు, దేశంలోనే అతిపెద్ద ఢిల్లీ-ముంబాయి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాన్ని భారత్‌మాల పరియోజన కింద కేంద్రం చేపట్టింది. ఇందులో ఢిల్లీ-దౌస (జైపూర్), వడోదర-అంకలేశ్వర్ సెక్షన్లు దాదాపు పూర్తయ్యాయి. ఈ మొత్తం ఎక్స్‌ప్రెస్ హైవే పొడవు 1386 కిలోమీటర్లు. దాదాపు పూర్తయిన ఇతర కారిడార్లలో చెప్పుకోదగినవి అంబాలా- కోట్‌పుట్లి, అమృత్‌సర్-జామ్‌నగర్. భారత్‌మాల కింద చేపట్టే ప్రాజెక్టుల్లో 60% హైబ్రిడ్ యాన్యుటీ నమూనాలో (రెండు లేదా అంతకంటే ఎక్కువ యాన్యుటీల కాంబినేషన్‌లో) పదిశాతం ప్రాజెక్టులు బి.ఒ.టి. (టోల్) నమూనా కింద, మరో 30% ప్రాజెక్టులను ఇ.పి.సి. (ప్రైవేటు కాంట్రాక్టులు) కింద చేపడుతున్నారు. భారత్‌మాల-ఫేజ్1 కింద మొత్తం 24,800 కిలోమీటర్ల రహదారులకు ఆమోదం లభించగా 17,555 కిలోమీటర్ల మేర, మిగిలిన పదివేల కిలోమీటర్ల రహదారుల్లో 5,972 కిలోమీటర్ల మేర పనులు అప్పగించడం పూర్తయింది.

**మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుల నిర్మాణం**

భారత్‌మాల పరియోజన కింద రూ.46వేల కోట్లతో దేశంలో 35 మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కుల (ఎంఎంఎల్‌పి) నిర్మాణం చేపడతారు. ఇవి పూర్తయితే 700 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గోను హ్యాండిల్ చేయవచ్చు. ఎంపిక చేసిన 15 ప్రదేశాల్లో ఎంఎంఎల్‌పి ప్రాజెక్టులను రూ.22వేల కోట్లతో చేపడతారు. ఇవి పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు, వినియోగదార్లకు ప్రాంతీయ సరకు సమీకరణ, పంపిణీ హబ్‌లుగా పనిచేస్తాయి. సాగర

మాల పరియోజన కింద ఎంఎంఎల్‌పిలను ఇన్‌లాండ్ వాటర్ టెర్మినల్స్‌కు అనుసంధానించడం వల్ల, దేశంలో కార్గో రవాణా ఖర్చు మరింత చౌకగా మారుతుంది. అస్సాంలోని జొగొగోఫాలో ఎంఎంఎల్‌పి నిర్మాణం పూర్తయ్యే దశలో ఉంది. ఇది మొత్తం ఈశాన్య భారత రాష్ట్రాలతో పాటు భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ రాష్ట్రాలకు కూడా పంపిణీ కేంద్రంగా పనిచేస్తుంది. ఎంఎంఎల్‌పి చెన్నై ప్రాజెక్టును రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు కేటాయించారు.

**అమృత్ సరోవర్**: ఆజాదీకా అమృత్ మహోత్సవ్, అమృత్ సరోవర్ అభియాన్ పథకాల కింద 'అమృత్ సరోవర్'ల నిర్మాణం చేపడతారు. జాతీయ రహదారుల కోసం సమీపంలోని చెరువుల నుంచి పూడిక మట్టిని తరలించడం ద్వారా వాటిని 'అమృత్ సరోవర్'లుగా అవి పునరుద్ధరిస్తారు.

**మంథన్:** 2022, సెప్టెంబర్ 8,9 తేదీల్లో రెండు రోజుల పాటు బెంగళూరులో 'మంథన్' పేరుతో ఒక సదస్సు జరిగింది. రోడ్లు, రవాణా, లాజిస్టిక్ సెక్టార్ ,వివిధ రాష్ట్రాలతో వ్యవహరించే విషయమై ఈ సదస్సులో కూలంకషంగా చర్చించారు. ఈ సదస్సు ఇతివృత్తం 'ఐడియా టు యాక్షన్'. వివిధ రాష్ట్రాలకు చెందిన రవాణా శాఖ మంత్రులు ఈ సదస్సులో పాల్గొన్నారు. 'రోడ్డు భద్రత'కు సంబంధించి బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ నటించిన మూడు షార్ట్ ఫిల్మ్‌లఈ సందర్భంగా విడుదల చేయడం విశేషం.

**పి.ఎం. గతిశక్తి**: పి.ఎం. గతిశక్తి అనేది "జాతీయ స్థాయి మాస్టర్ ప్రణాళిక". ఈ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం దేశంలో మౌలిక సదుపాయాల కల్పనలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోంది. 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రూ.100 లక్షల కోట్ల వ్యయంతో "గతిశక్తి యోజన"ను ప్రకటించారు. దేశంలో అవిభాజ్య రూపంలో మౌలిక సదుపాయాల కల్పన దీని ప్రధాన లక్ష్యం.

**పర్వతమాల**

'పర్వతమాల' కార్యక్రమం కింద దేశంలో రోడ్డు రవాణాకు ప్రత్యామ్నాయంగా కొన్ని ప్రాంతాల్లో రోప్‌వేల నిర్మాణం చేపడతారు. అంటే రోడ్డు నిర్మాణం సాధ్యం కాని ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తారు. ఇందుకోసం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (బిజినెస్) రూల్స్–1961లో ప్రభుత్వం 2021, ఫిబ్రవరి నెలలో కొన్ని సవరణలు చేసింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ రెండు రోప్‌వే నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వీటిలో మొదటిది, గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్ వరకు కాగా రెండవది గోవింద్‌ఘాట్ నుంచి హేమకుండ్ సాహిబ్ వరకు. ఈ రెండూ ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందినవి. ఈ రోప్‌వేల నిర్మాణం వల్ల గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్‌కు (9.7 కిలోమీటర్లు) కేవలం 30 నిమిషాల్లో చేరుకోవచ్చు.



ప్రస్తుతం 6–7 గంటల సమయం పడుతోంది. అదేవిధంగా గోవింద్‌ఘాట్ నుంచి హేమకుండ్ సాహిబ్ వరకు 12.4 కిలోమీటర్ల దూరానికి ప్రయాణకాలం ప్రస్తుతం ఒక రోజు పడుతోంది. రోప్‌వే నిర్మాణం పూర్తయితే కేవలం 45 నిముషాల్లో ప్రయాణం పూర్తి కాగలదు. పర్వతమాల యోజన కింద హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో రోప్‌వేల నిర్మాణం చేపడతారు. మధ్యప్రదేశ్‌లో ఇందుకోసం 14 ప్రాంతాలను ఎంపిక చేశారు ఈ నిర్మాణాల కోసం కేంద్రం, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో ఒక అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

**హైవేల పక్కన సదుపాయాలు**

జాతీయ రహదారుల పక్కనే అన్ని రకాల సదుపాయాలను కల్పించేందుకు మంత్రిత్వశాఖ తగిన ప్రణాళికలను రూపొందించింది. దీనికింద జాతీయ రహదారులపై ప్రతి 40కిలోమీటర్లకు, అన్ని సదుపాయాలతో ఒక్కొక్క కేంద్రాన్ని పి.పి.పి. విధానంలో నిర్మిస్తారు. వీటిల్లో పెట్రోల్ బంకులు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు, ఫుడ్‌కోర్ట్, రెస్టారెంట్/దాబా, కన్వీనియంట్ స్టోర్‌లు, తాగునీరు, ప్రాథమిక వైద్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్ల సదుపాయం వంటివి అందుబాటులో ఉంటాయి. కారు, బస్సు, ట్రక్ పార్కింగ్, డ్రోన్ ల్యాండింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తారు. 2024–25 నాటికి గుర్తించిన 600 ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, 144 సదుపాయ కేంద్రాల నిర్మాణానికి కేటాయింపులు జరిగాయి. మరో 72 బిడ్డింగ్ దశలో ఉన్నాయి. ఇక యుటిలిటీ కారిడార్‌ల కింద ఢిల్లీ–ముంబయి ఎక్స్‌ప్రెస్ హైవే, బెంగళూరు– హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ హైవేల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ నిర్మాణానికి ఇప్పటికే కేంద్రం పనులు అప్పగించింది.

**ఉపసంహారం**

దేశంలో రవాణా సదుపాయాల వృద్ధికి మాత్రమే కాదు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడానికి మౌలిక సదుపాయాల కల్పన అత్యంత కీలకం. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.10 ట్రిలియన్‌లను మౌలిక సదుపాయాల కోసం కేటాయించింది. సామాజిక, ఆర్థికాభివృద్ధికి, మార్కెట్ అనుసంధానతకు, సరకు, ప్రజారవాణాకు రహదారులు దోహదం చేస్తాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం జనాకర్షణ కంటే, దేశాభివృద్ధికే పెద్ద పీట వేసింది. ఒక బాధ్యతాయుత ప్రభుత్వం తీసుకునే సముచిత నిర్ణయాలకు మౌలిక రంగానికి పెద్దఎత్తున కేటాయింపులు గొప్ప ఉదాహరణ. ★



**(సర్ సంఘచాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ఇంటర్వ్యూ.. గతవారం తరువాయి)**



# హిందుస్తాన్

**ఈ రోజు యువత ముఖ్యంగా, 18-24 సంవత్సరాల మధ్య వయసులో ఉన్నవారు, టెక్నాలజీ, పర్యావరణం, లింగ సంబంధమైన అంశాలపై గందరగోళానికి గురవుతున్నారు. ఈ అంశాలను భారత్, హిందుత్వ దృక్పథంలో అర్థం చేసుకోవాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో ఇదే అంశాలకు సంబంధించి బయట జరుగుతున్న చర్చ, వారిని గందరగోళానికి గురిచేస్తోంది. సంఘ్‌ది భిన్నమైన కార్యశైలి. అలాగే ప్రాథమిక అవగాహన అంశాలు న్నాయి. యువతను సంఘ్ కార్యశైలితో అను సంధానం చేసేందుకు, ముఖ్యంగా వారిని వేధిస్తున్న అంశాలకు సంబంధించి అంశాల విషయంలో వారికి అవగాహన కల్పించేందుకు కొత్త పద్ధతులను రూపొందించే ప్రయత్నం జరుగు తోందా?**

యువతను ఆకర్షించేందుకు, వారితో అను సంధానం ఏర్పరచుకునేందుకు ప్రయోగాలు జరుగుతూనే ఉంటాయి. అయితే, కేంద్ర స్థాయిలో నిర్దిష్ట ప్రణాళిక అంటూ ఏదీ ఉండదు. ఎందుకంటే స్థానికంగా జరిగే ప్రయోగాలే ఉత్తమ ఫలితాలు ఇస్తాయి. బాగా పనిచేస్తాయి. ఢిల్లీ, ముంబై, చెన్నైలలో సమస్య/ గందరగోళం ఎక్కడుంటే అక్కడి స్థానిక శాఖలు ఆ సమస్యలకు స్థానికంగానే పరిష్కారం చూస్తాయి. చంద్రపూర్ (మహారాష్ట్ర, విదర్భ ప్రాంతం లోను ఓ మారుమూలగ్రామం)లోని కాలేజీలో అలాంటి అవసరం ఉండకపోవచ్చును. అలాగే ఒక విద్యార్థి జిల్లా పరిషత్ స్కూల్‌నుంచి వచ్చారా లేక ఇంగ్లీష్ మీడియం స్కూల్‌నుంచి వచ్చారా, అనే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అందుకే మేము స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యూహాలు, ప్రయోగాలు చేసే సంపూర్ణ స్వేచ్ఛను, స్థానిక శాఖలకు వదిలిపెట్టాం. ఉదా హరణకు కొద్ది రోజుల క్రితం, 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, నాగపూర్‌లో చిన్న చిన్న సమూహాలతో చర్చా గోష్ఠులు నిర్వహించాం. కార్యక్రమం నృత్య నాటికతో మొదలైంది. ఆ తర్వాత యువత కేంద్రబిందువుగా మరికొన్ని కార్యక్రమాలు జరిగాయి. బౌద్ధిక్ (ఉపన్యాసం)ను చివరలో చేర్చారు. పాత తరం స్వయంసేవకులకు, ఈ కార్యక్రమం మొదటి భాగం, అసలు నచ్చి ఉండక పోవచ్చును. ఇదేమిటని ప్రశ్నించి ఉండవచ్చును. అయితే మనం ఒకటి అర్థం చేసుకోవాలి. ఇప్పుడు యువతను చేరుకునేందుకు ఇలాంటి ప్రయోగాలే అవసరమవు తున్నాయి. అందుకే సంఘ్ మూలసూత్రాలను వదలకుండా మేము ఏది చేయాలో అది చేస్తూనే ఉన్నాము. ఫలితంగా చురుకైన యువత సంఘ్‌లో చేరుతున్నారు. జాయిన్ ఆర్ఎస్ఎస్ ప్రయోగం ద్వారా ప్రతి సంవత్సరం రెండు లక్షల మందికి పైగా యువత సంఘ్‌లో చేరుతున్నారు. (ఆర్ఎస్ఎస్ వెబ్సైటు ద్వారా అభ్యర్థనలు అందుతున్నాయి). ఇలా చేరుతున్న వారిలో ఎక్కువ విద్యావంతులైన, ఇంగ్లీష్ మాట్లాడే యువత. ఇలాంటి వారి నుంచి ఇలాంటి ప్రశ్నలు ఎదురవుతాయి. ఇంచుమించుగా ఇంతే సంఖ్యలో సంఘ శిక్షణ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అంటే సమాజంలో సంఘ్ విషయంలో ఎవరి అవగాహన ఎలా ఉన్నా, యువత సంఘ్ కార్యం వైపు ఆకర్షితులు అవుతున్నారు.

**ఇక్కడ మరో ముఖ్య ప్రశ్న, సంఘ్‌లో మహిళల పాత్ర, మహిళలు- సంఘ్ సంబంధాల గురించి తరచూ వినవస్తుంది. ఇటీవల విజయదశమి ప్రసంగంలో సంతోష్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను బట్టి, రాష్ట్రీయ సేవికా సమితి మహిళలకు ఒక ముఖ్యవేదిక అంటాను. సంఘ్ కార్యక్రమాల్లో మహిళల పాత్రను మీరు ఎలా చూస్తారు? ముందు కంటే ఇప్పుడు వారి పాత్ర పెరుగుతోందా?**

అవును, ముందుకంటే ఇప్పుడు సంఘ్‌లో మహిళల పాత్ర పెరుగుతోంది. గతంలో పరివార్ సమ్మేళనాలు ఉండేవి కాదు. అలాగని మేము అందుకు వ్యతిరేకం అని కాదు, అప్పటి పరిస్థితులు వేరు, అందుకే అప్పట్లో అది సాధ్యం కాలేదు. ఇప్పుడు మేము కుటుంబ ప్రబోధన్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిరహిస్తున్నాము. కార్యకారిణి (కార్యవర్గం) సభ్యులు సంవత్సరంలో కనీసం ఒకసారి అయినా కుటుం బాలతో కలిసి ఏదో ఒక ప్రదేశానికి వెళ్లాలని చెపు తున్నాము. కార్యకర్తల కుటుంబాలు అంటే కుటుంబ మహిళలు కూడా అందులోకి వస్తారు. ఇప్పటికే సంఘ్‌లో పదాతి (ఒకరి నాయకత్వంలో పనిచేసే స్వయంసేవకుల బృందం) వ్యవస్థ ఉంది. ఈ బృందంలోని సభ్యులకు సభ్యుల ఇళ్లలో వంట గదివరకు వెళ్లే చనువు ఉంటుంది. ఇది సంఘ్‌ను కుటుంబాల వరకు తీసుకువెళ్లే ఒక ప్రక్రియ. శాఖకు రాని కుటుంబ సభ్యులతో సంబం ధాలు ఏర్పర్చుకునే వ్యవస్థ. అలాగే, స్వయంసేవకులు వారి కుటుంబ సభ్యుల కోసం మేధావుల ఉపన్యాసాలు (బౌద్ధిక్) కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాము. ఇవ్వన్నీ నిజమే అయినా, రాష్ట్రీయ సేవికా సమితి (మహిళా సంఘం)లో మహిళల వ్యక్తి నిర్మాణ కార్యక్రమం నిత్య నిరంతరంగా సాగుతూనే ఉంటుంది. సేవికా సమితి మహిళలతో కలసి పనిచేస్తుంది. సంఘ్ పురుషులతో కలిసి పనిచేస్తుంది. ఎప్పుడైతే వారు ఈ పద్ధతి మారాలని కోరుకుంటారో, అప్పుడు తప్పకుండా మార్చుకుంటాము. కొవిడ్ సమయంలో సుమారు రెండు సంవత్సరాలకు పైగా స్వయం సేవకుల ఇళ్లలోనే శాఖలు నిర్వహించిన నేపథ్యంలో ఇప్పుడు మహిళలు సంఘకార్యంలో మరింత చురుగ్గా క్రియాశీల పాత్రను పోషిస్తున్నారు. మరింత ప్రధాన పాత్రను కోరుతున్నారు. సంఘ్ శాఖలో నేర్చుకున్న విషయాలు, పొందిన శిక్షణ ఆధారంగా స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంఘ్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు న్నారు, ఇతరులను స్వాగ తిస్తున్నారు. భాగస్వాములను చేస్తున్నారు. ఉదా హరణకు, ఈరోజు నేను ఒకరి ఇంటికి భోజనానికి వెళ్లాను. కొవిడ్ –19 సమయంలో ఆ ఇంటి ఇల్లాలు వారి ఇంట్లో నిర్వహించిన నిత్య శాఖను దగ్గరగా చూసి ఉండ వచ్చు. ఆ స్ఫూర్తితో ఆమె యోగ శిక్షణ పొందారు. ఇప్పుడు ఆమె ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి ఆనేక మంది మహిళలు ఆన్లైన్ తరగతులలో చేరారు. శిక్షణ పొందుతున్నారు. దీంతో ఇప్పుడు ఆమెకు, ఒక కార్యక్రమం, ఒక బాధ్యత ఏర్పడ్డాయి. స్వయం సేవకుల వలే స్వయంసేవికలు కూడా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. ఆ విధంగా స్ఫూర్తిని పొంది సంఘకార్యంలో పాలుపంచుకుంటున్న మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ఈ దిశగా ఒక స్థిర నిర్ణయం తీసుకునే వరకు,



# హిందుస్తాన్‌గానే ఉండాలి!

ఎవరైనా మహిళలు, సంఘ్ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపి ముందుకు వస్తే, అలాంటి వారిని సేవికా సమితికి వెళ్లమని చెప్పరాదని, మేము మా కార్యకర్తలకు సూచిస్తున్నాము. ఎందుకంటే, ఆ ప్రదేశంలో ప్రస్తుతానికి రాష్ట్రీయ సేవికా సమితి అంత బలంగా (శాఖల పరంగా, సంఖ్యా పరంగా) ఉండకపోవచ్చు. అలాగే ఉత్సాహంగా ముందుకు వచ్చిన మహిళల కోసం సేవికాసమితి స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహించేవరకు, వారిని ఏదో ఒక కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కార్యకర్తలకు సూచిస్తున్నాం. ఎందుకంటే, వారు స్వయంసేవకులు చేస్తున్న నిర్మాణాత్మక పనులను చూసి, స్ఫూర్తి పొందారు. సంఘ కార్యక్రమాల్లో ఆసక్తి చూపుతున్నారు. అలా ఆసక్తి చూపుతున్న మహిళలకు సంఘ్' బోధించే విలువల తమ పిల్లలకు బోధించాలని కోరుకుంటున్నారు. మన కార్యక్రమాలను స్వయంగా అర్థం చేసుకోవాలని కోరుకుంటున్నారు. అందుకే వారిని సంఘ్ కార్యక్రమంలో భాగస్వాములను చేయవలసిన బాధ్యత మాపై ఉంది. మేము ఈ విషయం ఆలోచించవలసి ఉంది. డాక్టర్‌జీ కాలంలో, ఈ విషయం ఆలోచించేందుకు అనువైన పరిస్థితులు లేవు. కానీ, ఇప్పుడున్నాయి. అయితే, సేవికాసమితి మహిళా కార్యకర్తలు, మహిళలతో కలసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సేవికా సమితి కార్యకర్తలతో చర్చించి, ఏదో ఒకటి చేయలసి వుంది.

**పరివార్ ప్రబోధన్ (కుటుంబ జ్ఞానబోధన) కార్యక్రమ కొత్త కోణం కారణంగా ఈ మార్పులను చూడవచ్చునా?**

లేదు. పరివార్ ప్రబోధన్ చాలాకాలంగా ఉన్న కార్యక్రమం. సంఘ్ ఆలోచనలను ఆ కార్యక్రమంలో చేర్చలేదు. కుటుంబ సంప్రదాయాలు, జాతీయ సంప్రదాయాలు, వంశాచారాలు, మన పూర్వికుల వివరాలు, విశేషాలు, ఇంటి, కుటుంబ బాధ్యతలు, సామాజిక బాధ్యతలు, ఆరోగ్యవంతమైన, సంతోషదాయక కుటుంబ జీవితం వంటి మరికొన్ని అంశాలు పరివార్ ప్రబోధన్ కార్యక్రమ పరిధిలోకి వస్తాయి. ఈ కార్యక్రమంలో స్వయంసేవకులు కూడా పాల్గొంటారు, కానీ, అది సంఘ్ విస్తరణ వేదిక మాత్రం కాదు.

మహిళల భాగస్వామ్యం పెరగడానికి, సమాజంలో సంఘ్ పలుకుబడి పెరగడంతో పాటుగా కొవిడ్ కూడా కొంతవరకు కారణం. సంఘ్ కార్యక్రమాలకు, ముఖ్యంగా, వ్యాపారవేత్తల సమావేశాలకు మహిళలను కూడా ఆహ్వానిస్తున్నాము. మా ఆహ్వానం మేరకు వ్యాపారవేత్తల కుటుంబాల మహిళలు మా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఆ తర్వాత వారు స్వయంసేవకులు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని కొన్ని చోట్ల స్కూల్, కాలేజీ అమ్మాయిలు కూడా శాఖలకు హాజరవుతున్నారు. ఇప్పుడు మేము, ఇది మీకోసం కాదు అని చెప్పలేము. ప్రత్యేక బృందంగా ఏర్పడేలా ప్రోత్సహిస్తాం. ప్రార్థన సమయంలో కొంతదూరం పాటించమని లేదా సేవికా సమితి ప్రార్థన చేయాలని మాత్రమే సూచిస్తున్నాము. ఇప్పటికైతే, ఇలా చేస్తున్నాం. అయితే ఈ సర్దుబాటును క్రమబద్ధీకరించే విషయంలో ఆలోచించవలసి ఉంది. ఇందుకు సంబంధించి త్వరలోనే ఒక నిర్దిష్ట నిర్ణయం తీసుకుంటాం.

**దేశంలో పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్న సామాజిక మార్పుల గురించి మాట్లాడుతూ, మీరు, బయోటెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) గురించి ప్రస్తావించారు. అలాగే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కూడా మన సమాజాన్ని, సామాజిక వ్యవస్థను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తోంది. పాశ్చాత్య సమాజ పోకడలను గమనిస్తే, చాలా పెద్ద ఎత్తున మార్పులు చోటుచేసుకునే పరిస్థితులు గోచరిస్తున్నాయి. రానున్న రోజుల్లో డేటా వినియోగం ఒక ప్రధాన సమస్యగా మారుతుంది. ఈ భవిష్యత్ సవాళ్లపై సంఘ్‌లో చర్చ జరిగిందా? సమాజంపై ప్రభావంతో పాటుగా, ఈ సమస్యల ప్రభావం కొంతమేరకు ఆర్థికవ్యవస్థ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఉంటుంది కదా? అలాగే, మరోవిధంగా చూస్తే, టెక్నాలజీ కారణంగా సమాజంలోని ఒక వర్గం ముందడుగు వేసింది. ప్రగతిని సాధించింది. అయితే అదే సమయంలో కొందరు దానికి దూరంగా ఉండిపోయారు. అలనాటి వారు తాము సాంకేతిక వేగాన్ని ఆదుకోలేకపోతున్నామని బాధపడుతున్నారు. అలాంటి వారు చదవగలరు, రాయగలరు కానీ, వారిని నిరక్షరాస్యులుగా చూస్తున్నారు. ఒక విధంగా టెక్నాలజీ సమాజంలో విభజన రేఖగా మారింది. ఈ సమస్యను మీరు ఎలా చూస్తున్నారు?**

టెక్నాలజీ జీవితానికి ఎంతో ఉపయోగకరం. సక్రమంగా ఉపయోగించుకోవడం వలన ప్రయోజనం ఉంటుంది. అయితే కేవలం అదే సర్వస్వం కాదు. సంపూర్ణ వికాసానికి అది సరిపోదు. ప్రస్తుతం టెక్నాలజీ వ్యాప్తి సమాజాన్ని విడదీస్తోంది. సామాజిక సంబంధాలను దూరం చేస్తోంది. వ్యక్తులను ఏకాంతంలోకి నెట్టివేస్తోంది. ఈ ప్రక్రియ ప్రభావంతో వ్యక్తులు అసంతృప్తికీ, అత్మన్యూనతా భావానికీ గురవుతున్నారు. ఇదొక కొత్త వ్యామోహం, సామాన్య ప్రజలు ఆకర్షితులవుతారు. ప్రత్యేకించి



**ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్న మన ప్రత్యేకత, ప్రత్యేక లక్షణం ఏమిటి? ఇది ఏదో గమ్మత్తు, ఆధునిక విజ్ఞాన శాస్త్రం చేసిన మ్యాజిక్కు కాదు. మన దేశ వ్యాపారవేత్తల గొప్పతనం కాదు. మన దేశ వ్యాపారవేత్తలు ఇప్పుడే కాదు,గతంలోనూ వ్యాపార నిపుణులు గానే ఉన్నారు. అయితే, అప్పటికీ, ఇప్పటికీ ఉన్న తేడా, ప్రామాణికత. భారతీయ ప్రామాణిక సుగుణాలు ప్రజలను, ముఖ్యంగా యువతను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ మరో ప్రశ్న వస్తుంది. సంఘ్ యువతను ఎందుకు ఆకర్షిస్తోంది?**

సంప్రదాయ కుటుంబ వ్యవస్థకు దూరమైనవారు, కుటుంబ వ్యవస్థ మూలాలతో సంబంధాలు లేని వారు, ఆలోచన, ముందుచూపు లేని వారు కొత్త వ్యామోహానికి ఆకర్షితులవుతారు. మన సంప్రదాయ తాత్విక గాఢత బలహీనపడిన నేపథ్యంలో అలాంటి వారు పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుసరిస్తారు. ఫలితంగా పాశ్చాత్య దేశాలలో తరచూ వినవచ్చే కాల్పుల విష సంస్కృతీ ఉచ్చులో చిక్కుకోవచ్చును. కానీ, అది మితి మీరి గీత దాటితే, మేము దీనిని వదిలించుకోక తప్పదు. అందుకు మరో ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నిస్తాము. ప్రత్యామ్నాయం తప్పక దొరుకుతుంది. మనం ఆ ప్రత్యామ్నాయాన్ని ప్రపంచానికి కూడా ఇవ్వవలసి ఉంటుంది. టెక్నాలజీ అనేది, ఒక సౌకర్యం. ఒక సౌలభ్య సాధనం. అంతవరకే. అదే మన యజమాని కారాదు. ఆనందం అనేది పూర్తిగా టెక్నాలజీ మీద ఆధారపడే పరిస్థితి వస్తే, మనం మన ఆనంద భావనను మార్చుకోవలసి ఉంటుంది. అవును, మీరన్నట్లుగా, టెక్నాలజీ కారణంగా వెనకబడిపోయామనే భావనతో బాధపడే వారున్నారు. కంప్యూటర్ ఉపయోగించని వారిని కంప్యూటర్ నిరక్షరాసులుగా అభివర్ణిస్తున్నారు. ఇతరులకంటే తక్కువగా చూస్తున్నారు.

ఒకప్పుడు సంఘ్ కార్యవర్గ సభ్యుడొకరు, సంఘ కార్యక్రమంలో పాల్గొని వెనక్కి వస్తున్న సమయంలో, ఆయనకు ఒక పక్కన ఒక వృద్ధుడు, మరో పక్కన ఒక యువకుడు కూర్చున్నారు. ఆ ఇద్దరికీ, టికెట్లలోనే భోజనం చార్జీలు కలిపి ఉన్నాయి. సంఘ్ కార్యకర్తకు తినేందుకు ఏదైనా కొనుక్కునేందుకు చూస్తుంటే, సహ ప్రయాణీకులలో ఒకరు పానీయం ఇచ్చారు. ఆ తర్వాత మాటల సందర్భంగా ఆ పెద్దమనిషి, తాను దుబాయ్‌లో ఉంటానని, ఉద్యోగరీత్యా తాను వరసగా మూడునెలలు సముద్రంలోనే ఉంటానని, ఆ తర్వాత ఒక నెలరోజులు ఇంటివద్ద విశ్రాంతి తీసుకుని, ఆరోగ్యం కూడగట్టుకుని మళ్లీ సముద్రం లోకి వెళుతుంటానని చెప్పుకొచ్చారు. ఆయనకు నెలకు రూ.80 వేలు జీతం. అందులోంచి నెలకో రూ. 10 వేలు ఖర్చుచేసుకుని, మిగిలిన మొత్తాన్ని సంవత్సరంలో మూడుసార్లు రూ. 2 లక్షల 10 వేల చొప్పున సంవత్సరంలో మొత్తం, రూ.6 లక్షల 30 వేలు ఇంటికి పంపుతానని చెప్పుకొచ్చారు. అయితే తాను చదువుకోలేదని, కనీసం అక్షరజ్ఞానం కూడా లేదని విచారం వ్యక్త పరిచారు.

అందుకు సంఘ్ కార్యవర్గ సభ్యుడు, చదువు రాదని నిరాశ చెందవలసిన అవసరం లేదు. భగవంతుడు మీకు ఎన్నో ఇచ్చాడు. అయినా మీరు ఇంకా ఏదో లేదని బాధపడడం భగవంతుని కృపను దూషించడం అవుతుందని చెప్పారు. ఇక్కడ భారతదేశంలో ప్రేమగా, మీ యోగక్షేమాలు చూసుకునే కుటుంబం ఉంది. మీకు వచ్చే ఆదాయం ఇక్కడ కూలీలకు వచ్చే ఆదాయం కంటే చాలా ఎక్కువ. అన్నిటినీ మించి మీలో మానవత్వం మిగిలుంది. మీరు మీ పానీయాన్ని ముక్కు ముఖం తెలియని అపరిచితునితో పంచుకునే మంచి మనసుంది అన్నారు. అప్పుడు అతను తన సుగుణ సంపద విలువ తెలుసుకున్నారు. ఇక ముందు తనకు చదువురాదనే ఆత్మన్యూనతా భావం రానీయనని మాటిచ్చారు. మానసిక స్థితి, ఆలోచన ధోరణిలో మార్పు తీసుకువచ్చేందుకు, టెక్నాలజీ, అక్షరాస్యత, చదువు అవసరం లేదు. అలసిన బాటసారికి కాసింత నీడ, ఓ తియ్యని పండును ఇవ్వలేని కర్జూర చెట్టు వలన ఏమి ప్రయోజనం అన్నట్లు మనం, మన సంస్కృతిలో అంతర్లీనంగా ఉన్న జీవితం, జీవిత విజయాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేక పోతున్నాము. మనం ఈ వాస్తవాన్ని గుర్తించినప్పుడు, అన్ని ప్రశ్నలకు సమాధానాలు గోచరిస్తాయి. మనకే కాదు ప్రపంచానికి కూడా మనం దారి చూపగలుగు తాము. ఎట్టి పరిస్థితిలో ఇది మనం చేసి తీరవలసిందే. ఎందుకంటే, అది చీకటిదారి, ఎక్కడికి చేరుస్తుందో తెలియని, లోతులు తెలియని చీకటి బావి..

**కొవిడ్ 19 మహమ్మారి కేవలం వ్యక్తులు, కుటుంబాలనే కాదు, ప్రపంచ స్థితిగతులనే మార్చి వేసింది. ఇప్పుడు అందరూ కొత్త ప్రపంచం గురించి మట్లాడుతున్నారు. కొవిడ్ కాలంలో చోటుచేసుకున్న ఒడిదుడుకులు, మార్పుల నేపథ్యంలో రానున్న రోజుల్లో భారత్' స్థానం ఏమిటి? ఈ నూతన ప్రపంచంలో భారత్ పోషించే పాత్ర ఏమిటి? భారత దేశంలో సంఘ్' పోషించే పాత్ర ఏమిటి?**

నిజం. కొవిడ్ సంక్లిష్ట సమయంలో భారతదేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందుకు, కొవిడ్ మహమ్మారి కారణం కాకపోవచ్చును. కానీ, కొవిడ్ కారణంగా ప్రపంచానికి మనం ఆశాజ్యోతిగా నిలిచాము. నిజానికి, మనలో మార్పులేదు. మనం మనం గానే ఉన్నాము. మనం సరైన దారిలో ముందుకు సాగుతున్నాము. అంటే, మనం ఇప్పుడే మిటో, అప్పుడు (మహమ్మారికి ముందు) అదే ఆలోచనల వెంట అడుగులు వేశాము. కానీ, అప్పుడు, ప్రపంచం మనల్ని స్పష్టంగా చూడలేదు. మేఘాల మాటున మసకబారిన ప్రపంచ దృష్టిని కొవిడ్ 19 సంక్షోభం తొలిగించింది. కొవిడ్ సంక్షోభానికి పరిష్కారాల కోసం ప్రపంచ ప్రజలు భారతదేశం వైపు చూశారు. మన దేశం పట్ల ప్రపంచ దృక్కోణంలో మార్పు వచ్చింది. భారతదేశం శీఘ్రంగా వాక్సిన్ తయారుచేసింది. అంతే కాదు, తయారుచేసిన వాక్సిన్ కుప్పలు పోయకుండా, ఇతర దేశాలకు పంచింది. లాభ నష్టాలు బేరీజు వేసుకోకుండా ఇతర దేశాలకు సహాయం చేసిన ఇలాంటి సందర్భాలు గతంలోనూ ఉన్నాయి. ఉదాహరణకు భారతదేశం గతంలో శ్రీలంకకు సహాయం చేసింది, ఇప్పుడు ఉక్రెయిన్‌కు సహాయం అందిస్తోంది.

నిజానికి ఇదే భారతీయత సారాంశం. ఇప్పుడు ప్రజలు చూస్తున్నారు. గుర్తిస్తున్నారు. ప్రపంచ ప్రాధాన్యతా క్రమంలో పూర్వ వైభవాన్ని పొందు తోంది. అందుకే, ప్రపంచ ప్రజలు మనల్ని మెచ్చు కుంటున్నారు. రష్యా మన దేశాన్ని మెచ్చుకుంటుంది. గౌరవిస్తోంది. అలాగే, అమెరికా... బలమైన ఆర్థిక వ్యవస్థ, భారీ సైన్యం ఉన్న ఈ దేశాలు, మన దేశాన్ని అనుకరించవలసిన, అభినందించవలసిన అవసరం లేదు. అయినా అవి కూడా, భారతదేశాన్ని ఘనంగా కీర్తిస్తున్నాయి. ఇందుకు ఒకటే కారణం, భారత దేశాన్ని ఆ దేశాలు సుగుణ సంపన్న దేశంగా చూస్తున్నాయి. భారతదేశం అభివృద్ధినీ, గమ్యాన్నీ గుర్తించారు. అందుకే, భారతదేశాన్ని గుర్తిస్తున్నారు. గౌరవిస్తున్నారు.


అయితే, ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్న మన ప్రత్యేకత, ప్రత్యేక లక్షణం ఏమిటి? ఇది ఏదో గమ్మత్తు, ఆధునిక విజ్ఞాన శాస్త్రం చేసిన మ్యాజిక్కు కాదు. మన దేశ వ్యాపారవేత్తల గొప్పతనం కాదు. మన దేశ వ్యాపారవేత్తలు ఇప్పుడే కాదు, గతంలోనూ వ్యాపార నిపుణులు గానే ఉన్నారు. అయితే, అప్పటికీ, ఇప్పటికీ ఉన్న తేడా, ప్రామాణికత. భారతీయ ప్రామాణిక సుగుణాలు ప్రజలను, ముఖ్యంగా యువతను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ మరో ప్రశ్న వస్తుంది. సంఘ్ యువతను ఎందుకు ఆకర్షిస్తోంది? అందుకు సమాధానం, నిజాయతీ. అవును, దేశభక్తి,

నిస్వార్థసేవ విషయంలో సంఘ్ చూపే నిజాయతీ యువతను ఆకట్టుకుంటోంది. భారతదేశం వంటి దేశం ఇతరులకు సహాయం చేసేందుకు ప్రయత్నించి నప్పుడు, సహజంగానే, ప్రజలు ప్రామాణికతను, నిజాయతీని చూస్తారు. ఇతరులను ఆదుకునే విషయంలో భారతదేశం స్వార్థంతో వ్యవహరించదు. భారతీయులకు తెలివితేటలున్నాయి. శక్తి ఉంది. ఏ విషయంలోనూ ఇతరులకు తీసిపోరు. భారతదేశం ఈ వాస్తవం తెలుసుకుంటోంది. మేల్కొంటోంది. విజయాన్ని ఆకాంక్షిస్తోంది.

భారత విజయం, ప్రపంచానికి కూడా మేలు చేస్తుంది. ప్రయోజనం చేకూరుస్తుంది. భారతదేశం కొత్త మార్గం చూపాలని, ప్రపంచ ప్రజలు కోరుకుంటున్నారు. ఒక్క భారత్‌కు మాత్రమే అది సాధ్యమవుతుందని ఆశిస్తున్నారు. అయితే, భారత్ ఈ ప్రగతిమార్గంలో పయనించాలంటే, ప్రతి భారతీయుడు మన దేశ 'స్వస్థ' (స్వీయ సామర్థ్యం) గుర్తించి, చావైనా బతుకైనా అందుకే అనే బలమైన కాంక్షతో ఉండడం అవసరం. అలాంటి వాతావరణ నిర్మాణం కోసం అంకిత భావంతో పనిచేసే కార్యకర్తల బృందాలను తయారు చేయడంలో సంఘ్ పాత్ర కీలకమైనది. ఇది శాశ్వత మారునకు దారితీస్తుంది. భారత పాత్రను బలోపేతం చేయడం సంఘ్ పాత్ర, ప్రపంచాన్ని బలోపేతం చేయడంలో భారత్ పాత్ర కీలకం.

**కొవిడ్ సమయంలో మీరు కూడా ఆత్మనిర్భర్ భారత్ అనే పదాన్ని పదే పదే పేర్కొన్నారు. అయితే, ప్రపంచ సరఫరా చట్రం (గ్లోబల్ డిస్ట్రిబ్యూషన్ చైన్)లో ఫార్మాస్యూటికల్ రంగం నుంచి చిన్న తరహా పరిశ్రమల వరకు వివిధ రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఏమంటారు? ఈ సవాళ్లను మీరు ఎలా చూస్తారు? ఎంతో మంది జీవనోపాధిని కోల్పోయారు. చిన్న చిన్న పరిశ్రమలు పునరుత్తేజం పొందేందుకు సతమతమవుతున్నాయి. అంతే కాకుండా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఆర్థికవ్యవస్థ, విదేశీ మారక ద్రవ్యం, వడ్డీ రేట్లకు సంబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితులలో 'ఆత్మ నిర్భర్ భారత్' భావన ఎలా వాస్తవ రూపం దాలుస్తుంది?**

ఆత్మ నిర్భర్ భారత్ భావన తప్పక వాస్తవరూపం దాలుస్తుంది. ఒకరి శక్తికి తగిన విధంగా, ఆత్మబలం ఆధారంగా అభివృద్ధి జరుగుతుంది. అయితే అందుకు హైబ్రీడ్ రంగులు అద్దకూడదు. శిక్షణ ఇచ్చి ఒక ఏనుగు చేత ఫుట్‌బాల్ ఆడించవచ్చును. అయితే, అది ఏనుగు పురోగతి కాదు. ఈ అద్భుత క్రీడను చూసేందుకు ప్రజలు టికెట్లు కొనుక్కుని రావచ్చును. అయినా అది ఏనుగు సాధించిన అభివృద్ధి కాదు. ఒక సింహం గొర్రె పిల్ల పక్కన కూర్చుని, ప్రశాంతంగా విందారాగిస్తే, అది ప్రగతి సంకేతం




**వినియోగవాదం, దీర్ఘకాలంలో తీవ్ర విపత్తుకు దారి తీసే ప్రమాదం ఎప్పడూ పొంచి ఉంటుంది. కాబట్టి ఆత్మ నిర్భర్ అంటే, ఈ ప్రపంచ పోటీలో గెలవడం కాదు. ఆత్మ నిర్భర్ అంటే, భౌతిక సదుపా యాలు, భద్రత. భవిష్యత్ జీవితానికి హామీ/భరోసా ఇవ్వడమే కాకుండా, ప్రశాంత భావన, ఆత్మతృప్తి ఇచ్చే నూతన వాణిజ్య నమూనా.**

కాదు. అది సింహం పౌరుషాన్ని ఒక ప్రహసనంగా మార్చివేస్తుంది. సింహం అడవిలోనే ఎదుగుతుంది. కాబట్టి మనం ఆత్మ నిర్భర్ భారత్ గురించి మాట్లాడినప్పుడు, ఈ విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

అత్మ నిర్భర్ అంటే కేవలం అన్నీ వస్తువులను భారతదేశం ఉత్పత్తి చేయడమో, అన్నీ దేశంలోనే తయారుకావడమో కాదు. ఇంతవరకు ప్రపంచ ఆర్థిక పోకడలు కార్పొరేట్ లాజిక్‌ను అనుసరిస్తున్నాయి. ప్రతిదీ కేంద్రీకృతమైంది. భారత ఆర్థిక తర్కం, అందుకు విరుద్ధం. వికేంద్రీకరణ వలన ఉత్పత్తి పెరుగుతుందని, భారత ఆర్థిక తర్కం విశ్వసిస్తుంది. అలాగే, ఉత్పత్తుల అమ్మకంతో వినియోగ స్వభావం బలపడుతుందని కాదు. వినియోగంపై నియంత్రణ ఉంటే, ధరలు తగ్గుతాయి. పాశ్చాత్య దేశాలలో వాణిజ్యమే జీవిత ప్రధాన పునాది కాబట్టి, ఆ దేశాల వారు ధరల పెరుగుదలను సమర్థిస్తారు. అందుకు వినియోగదారులు అవసరం, అది మళ్లీ వ్యక్తిత్వ వాదంపై ఆధారపడి ఉంటుంది. ఈ విషవలయంలో ఒక దానిని ఒకటి అనుసరిస్తూ ఉంటాయి.

వినియోగవాదం, దీర్ఘకాలంలో తీవ్ర విపత్తుకు దారి తీసే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. కాబట్టి ఆత్మ నిర్భర్ అంటే, ఈ ప్రపంచ పోటీలో గెలవడం కాదు. ఆత్మనిర్భర్ అంటే, భౌతిక సదుపాయాలు, భద్రత. భవిష్యత్ జీవితానికి భరోసా ఇవ్వడమే కాకుండా, ప్రశాంత భావన, ఆత్మతృప్తి ఇచ్చే నూతన వాణిజ్య నమూనా. అందుకోసం, ఆత్మతో సయోధ్య కలిగి ఉండే భవనాలను, నూతన పద్ధతులను నిర్మించుకోవలసి ఉంటుంది. వలసపాలన భావనలను పూర్తిగా వదిలించుకుని, మన గురించి మనం ఉన్నతంగా ఆలోచించుకోవలసి ఉంటుంది. ఆ తర్వాత సైంటిఫిక్ అనుకుంటున్న వాటిలో వేటిని మన దృక్కోణంలో చేర్చుకోవాలి, వేటిని వదిలేయాలి అనేది నిర్ధారించుకోవలసి ఉంటుంది. తెలియక ఏవైనా తప్పుడు పద్ధతులు పాటిస్తుంటే, వాటిని వదిలించుకోవలసి ఉంటుంది. ప్రపంచంలోని ఉత్తమమైన వాటిని వడపోసి, మనకు అనుకూలమైన నూతన విధానాన్ని నిర్మించు కోవలసి ఉంటుంది. అయితే నూతన మార్గాన్ని, కొత్త రోడ్డును మన విలువల పునాదుల ఆధారంగా నిర్మించుకోవసిందే కానీ, మరోలా కాదు. 'సర్వే భవంతు సుఖినః' అందరూ ఆనందంగా, తృప్తిగా




ఉండాలి, అనేది మన దృష్టికోణం. అంతేకానీ, బడిత ఉన్నవాడిదే బర్రె అనే భావన కానీ, ఎక్కువమందికి ఎక్కువ ప్రయోజనం అనే భావన కానీ భారతీయ భావన కాదు. మనం కష్టపడితే అందరికీ ఆనందం లభిస్తుంది. ప్రపంచంలో అయినా అంతే.. ఇదీ మన భావన. మన విధానం. మన విశ్వాసం. అందుకే 2000 సంవత్సరాలకు పైగా అనేక ప్రయోగాలు చేసి ఫలితం లేక చివరకు ప్రపంచం సామరస్య నమూనా మార్గం కోసం మన దేశం వైపు చూస్తోంది. మనం మన ఆత్మను ఆవిష్కరించడం ద్వారా మాత్రమే అలాంటి మార్గాన్ని కనుగొనగలుగుతాము. ఆత్మ మీద ఆధారపడమే ఆత్మనిర్భర్. అంతేగానీ, ఇది ప్రపంచ పోటీలో గెలవడమో, ఓడడమో కాదు.

**ఇక్కడ మన సమాజం ఎదుర్కుంటున్న మరో సమస్య ఉంది. అది జనాభా సమస్య. అసంతుల్య జనాభా ఎదుగుదల సమస్య. ఈ సమస్యను సంఘ్ లేవనెత్తింది, నొక్కి చెప్పింది. ఇదొక సంక్లిష్ట సమస్య. ఈ సమస్యను హిందు, ముస్లిం సమస్యగా చిత్రించే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమస్యకు పరిష్కారంగా ఏకాభిప్రాయం సాధ్యమేనా?**

ముందుగా, మెజారిటీలైన హిందువులు ఈ సమస్యను అర్థం చేసుకోవాలి. హిందువులకు దేశం గురించి నాదీ అనే ఆత్మీయతా భావం ఉంటుంది. హిందువుల అభ్యున్నతితో దేశం క్షేమంగా, సుభిక్షితంగా ఉంటుంది. కాబట్టి, ముందుగా హిందువులు ఈ విషయాన్ని తెలుసుకోవలసి ఉంటుంది. జనాభా ఒక సంపద. అదే సమయంలో అది భారీ భారం. నేను ఆ ఉపన్యాసంలో పేర్కొన్నట్లుగా, మనం లోతైన ఆలోచనలతో దీర్ఘకాల, జనాభా విధానాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉంది. అలాగే, ఆ విధానాన్ని అందరికీ సమానంగా వర్తింప చేయవలసిన అవసరం ఉంది. అయితే, ఇది బలవంతంగా చేయరాదు. ప్రజలకు అవగాహన కలిపించి, ఆ విధంగా అమలు చేయాలి.

**జనాభా అసమతుల్యత ఒక వాస్తవ సమస్య. ఎక్కడెక్కడైతే జనాభా అసమతుల్యత చోటు చేసుకున్నదో అక్కడక్కడ దేశ విభజనలు జరిగాయి. ఇదొక అంతర్జాతీయ వరవడి. వాస్తవం. అక్కడి ప్రజలు, నాగరికతల దురుసు ప్రవర్తన, దూకుడు స్వభావం వలన, ఈ వరవడి కొనసాగుతోంది. ఇందుకు హిందూ సమాజం ఒక్కటే మినహాయింపు. హిందూ సమాజం ఎప్పుడు ఎక్కడా దూకుడుగా పోలేదు. దురాక్రమణకు పాల్పడలేదు. శాంతివాదం, అహింస, ప్రజాస్వామ్యం, లౌకికవాదం మొదలైన వాటి పరిరక్షణ కోసం, దూకుడు చూపక పోవడం అవసరం.అయితే, శాంతిమార్గం అనుసరించడం వలన, తైమూర్, సూడాన్, పాకిస్తాన్‌లలో విపత్కర ఫలితాలు చూశాము. ఇందుకు సంబంధించి బుజ్జగింపు రాజకీయాలకు అంతం పలకవలసి ఉంది. హిందువులు లేదా ఇతరులపట్ల ఎలాంటి వివక్ష లేకుండా, పాకిస్తాన్ సృష్టికి కారణం ఏమిటని నిష్పాక్షికంగా అడగవలసి ఉంది?**



హిందుస్తాన్.. హిందుస్తాన్‌గానే ఉండాలి.. ఇదే సాధారణ సత్యం. ఈ రోజు భారతదేశంలో జీవిస్తున్న ముస్లింలకు ఎలాంటి ముప్పూ లేదు. వారు తమ విశ్వాసాలకు కట్టుబడి ఉండాలంటే, ఉండవచ్చును. లేదు, తమ పూర్వికుల విశ్వాసాలకు తిరిగి రావాలను కుంటే, రావచ్చును. అది పూర్తిగా వారి ఇష్టం. ఇందుకు సంబంధించి హిందువులలో ఎలాంటి మొండి పట్టుదల లేదు. అయితే అదే సమయంలో, ముస్లింలు తమ ఆవేశపూరిత ఆధిపత్య ధోరణిని వదులుకోవలసి ఉంటుంది.

చారిత్రిక అధారాల ప్రకారం, భారతదేశం ఒకప్పుడు అఖండ దేశంగా వెలుగొందింది. ఆ తర్వాత శతాబ్దాల పాటు సాగిన ఇస్లాం దుర్మార్గపు దాడులు అంతమైన తర్వాత దేశ విభజన జరిగింది. దేశ విభజన ఎలా జరిగింది? ఇందుకు నాకు ఒకే ఒక్క కారణం కనిపిస్తోంది. హిందూ భావ కో జబ్ – జబ్ భూలే ఆయా... ఎప్పుడయితే, మనం హిందూ మూల భావనను మరిచిపోయామో, అప్పుడప్పుడల్లా, మనం విపత్తులను ఎదుర్కున్నాం. సోదరులు విడిపోయారు. భూమిని కోల్పోయాం. మత వ్యవస్థలు ధ్వంస మయ్యాయి.

నేను ఎవరికి వ్యతిరేకంగా మాట్లాడే ప్రయత్నం చేయడం లేదు. కానీ, భారతదేశం చరిత్ర చూడని స్థాయిలో రక్తపాతాన్ని చూసింది. ఇది నిజం. మనం కళింగ యుద్ధం గురించి అనుకుంటే, ఇది ఒక విధంగా స్థానిక యుద్ధం. త్వరగానే ముగిసి పోయింది. మనం , నేను హిందువును, అనే మౌలిక హిందూ భావనను విస్మరించడం వల్లనే మనం ఈ పరిస్థితి ఎదుర్కొనవలసి వచ్చింది. మనం హిందూ భావం గురించి మాట్లాడినా, అందులో ఇస్లామిక్ ప్రార్థనా పద్ధతులకు ఎలాంటి విఘాతం కల్గించ లేదు.

హిందూ అనేది మన గుర్తింపు, మన జాతీయత, ప్రతి దాన్ని మనదిగా భావించే మన నాగరికత లక్షణం. ప్రతి ఒక్కరినీ కలుపుకుని పోయే మన నాగరికతా చిహ్నం. ఏనాడూ మనం మేము చెప్పిందే నిజం, ఇతరులు చెప్పింది అబద్ధం అని చెప్పలేదు. మీ దగ్గర మీరు చెప్పింది నిజం. మాదగ్గర మేము చెప్పింది నిజం. తగవు ఎందుకు, కలిసి కదులుదాం– ఇదీ హిందుత్వ భావన. ఈ విలువలకు కట్టుబడిన వారు మెజారిటీగా ఉన్నంత వరకు భారతదేశం ఐక్యంగా ఉంటుంది. ఐక్య భారతదేశం ప్రపంచాన్ని ఏకతాటిపై నడిపిస్తుంది. ఐక్యంగా, శక్తిమంతంగా ఉంచుతుంది. ఇది కేవలం భారతదేశానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు, సమస్త మానవాళి సంక్షేమానికి సంబంధించిన విషయం. హిందూ సమాజం అదృశ్య మైతే, పరిస్థితి ఏమిటో ఒక్క క్షణం ఆలోచించుకోండి. ఇతర జాతులు ఆధిక్యం కోసం యుద్ధాలు మొదలెడ తాయి. అది అనివార్యం. అదే జరిగితే, అప్పుడు ఎదురయ్యే విపరిణామాల నుంచి మనల్ని రక్షించేది హిందువుల ఉనికి మాత్రమే. అదొక్కటే మనల్ని రక్షిస్తుంది.

హిందుస్తాన్.. హిందుస్తాన్‌గానే ఉండాలి.. ఇదే సాధారణ సత్యం. ఈ రోజు భారతదేశంలో జీవిస్తున్న ముస్లింలకు ఎలాంటి ముప్పూ లేదు. వారు తమ విశ్వాసాలకు కట్టుబడి ఉండాలంటే, ఉండవచ్చును. లేదు, తమ పూర్వికుల విశ్వాసాలకు తిరిగి రావాలను కుంటే, రావచ్చును. అది పూర్తిగా వారి ఇష్టం. ఇందుకు సంబంధించి హిందువులలో ఎలాంటి మొండి పట్టుదల లేదు. అయితే అదే సమయంలో, ముస్లింలు తమ ఆవేశపూరిత ఆధిపత్య ధోరణిని వదులుకోవలసి ఉంటుంది. మాది ఒక ఉన్నత జాతి, ఒకప్పుడు మేము ఈ ప్రాంతాన్ని పాలించాము, మళ్లీ మరోమారు పాలిస్తాము. మేము అనుసరించే మార్గమే సరైనది, ఇతర మార్గాలన్నీ తప్పుడు మార్గాలు. మేము భిన్నం, కాబట్టి మేము ఇలానే ఉంటాము; మేము కలసి జీవించము, వంటి అనేక అహంకారపూరిత ధోరణిని వదులుకోవలసి ఉంటుంది. నిజానికి, ఒక్క ముస్లింలు మాత్రమే కాదు, ఇక్కడ జీవించే ఏ హిందువు అయినా, ఒక కమ్యూనిస్ట్ అయినా ఈ తర్కాన్ని వదులుకోక తప్పదు.

కాబట్టి, జనాభా అసమతుల్యత అనేది ఒక ముఖ్యమైన ప్రశ్న. మనం దీని గురించి లోతుగా ఆలోచించాలి. ఇది చెపుతున్నప్పుడు, నాతో విభేదించే వారు, నన్ను తప్పుపట్టే వారు, నాపై ఆరోపణలు చేసే ఉంటారనే విషయం నాకు తెలుసు. అయితే, అదే వ్యక్తులు, పరిపాలన బాధ్యతలలో ఉన్నప్పుడు, కచ్చితంగా అదే చేస్తారు. స్వతంత్ర భారతదేశం తొలినాళ్ల నుంచి ఈ రోజు వరకు ప్రభుత్వ కార్యకలాపాలను చూస్తే అధికారంలో ఉన్నవారు,

వారి విశ్వాసాలు ఏవైనప్పటికీ, ఈ విషయంలో ఆందోళన చెందుతూనే ఉన్నారు. అధికారంలో ఉన్నవారు, భారత సర్వోన్నతిని కోరుకునేవారు, తప్పక ఈ విషయాన్ని ఆలోచిస్తారు. ఏమి చేయాలో, ఏది అవసరమో అది చేస్తారు. కాబట్టి, అందరికీ తెలిసిన విషయాన్నే మేము పునరుద్ఘాటిస్తున్నాము.

మేము ఎవరికీ వ్యతిరేకం కాదు. ఎవరినీ వ్యతిరేకించము. ఇది జననాల రేటు (బర్త్ రేట్)కు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. జనాభా అసమతుల్యతకు మత మార్పిళ్లు, అక్రమ వలసలు ప్రధాన కారణం. వీటిని నిరోధిస్తే, సమతుల్యత సాధ్యమవుతుంది. కాబట్టి, జనాభా విధానం, ఈ సమతుల్యతను నిర్ధారించే విధంగా ఉండాలి. బర్త్ రేట్, ఇతర కారణాల వలన స్వల్ప అసమతుల్యత ఉంటే ఉండవచ్చును, దానిని కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

**ఇక్కడ హిందువుల మానవ హక్కుల విషయం కూడా దృష్టికి వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా హిందూ సమాజం దృఢంగా ఉంటోంది. అమెరికా వంటి దేశాలలో హిందూ ఆలయాలు, సంస్థలు హిందువులకు సంబంధించిన విషయాలకు సంబంధించి తీర్మానాలు ప్రతిపాదిస్తున్నారు. ఓ వంక హిందుత్వంపై జరిగే, విద్యాపరమైన సదస్సులు, సమ్మేళనాలలో సంఘ్ కారణంగా హిందూ సమాజం దూకుడు చూపుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవంక, బర్మింగ్‌హామ్, లీసెస్టర్‌లలో సంఘ్ పేరున హిందువులపై దాడులు జరుగుతున్న ఉదాహరణలున్నాయి. ఈ అవగాహనను పూర్వపక్షం చేసేందుకు సంఘ్ ఏమైనా ఆలోచన చేస్తోందా? ప్రపంచ స్థాయిలో హిందువుల మానవ హక్కుల గురించి, హిందు ఫోబియా గురించిన అలోచన ఉందా?**

హిందువుల గురించి అనేక మంది మాట్లాడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మేముగా ఒక వేదికను ఏర్పాటు చేసే అలోచన ఏదీ లేదు. ప్రస్తుతమున్న సంస్థలు, వేదికలకు మరింత బలాన్ని సమకూర్చాలనేది మా ఆలోచన. హిందూ సమాజం జాగృతం అవుతున్న నేపథ్యంలో మనం ఈ ఘర్షణాత్మక మార్గం ద్వారా కూడా వెళ్లవలసి ఉంటుంది. మా ఎదుగుదలవలన ఎవరి స్వార్థ ప్రయోజనాలు అయితే దెబ్బతింటున్నాయో వారే ఉద్రిక్తలు సృష్టిస్తున్నారు. అదే సమయంలో దాడులకు దిగుతున్నారు. అయితే ఇప్పుడు హిందువులు మేల్కొంటున్నారు. సరైన రీతిలో సమాధానం ఇస్తున్నారు.

అయితే, హిందువులు ఏ మార్గం ఎంచుకున్నా, అందరినీ కలుపుకుని వెళతారు. హిందూ సమాజంపై దాడులకు సంబంధించి, ఈ దాడులను వ్యతిరేకించే వారందరికీ, గ్లోబల్ హిందూ సొసైటీ సంపూర్ణ మద్దతు ఉంటుంది. సంఘ్ అలాంటి పరిస్థితి సుదీర్ఘ కాలం కొనసాగకుండా, కాలక్రమంలో మరింత పెరగకుండా చూస్తుంది. అవగాహన పెంచే విషయానికి వస్తే, మేము ఇందుకు సంబంధించి ఏదో ఒకటి చేయవలసి ఉంది. ఈ అవగాహన భావన అంతర్జాతీయ స్థాయిలోనే కాదు, భారత్‌లో కూడా ఉంది. ఈ విషయంపై మేము ఇప్పటికే దృష్టిని కేంద్రీకరించాము. మీడియా సంభాషణలు పెంచాము. ప్రజలకు చేరువయ్యే అవుట్ రీచ్ చర్యలు మొదలయ్యాయి. ఇక ఇప్పుడు వీటి విస్తరణ మిగిలుంది. కాలక్రమంలో ఆశించిన ఫలితాలు సాధించేందుకు, సరైన సమయంలో, సరైన వ్యూహంతో చర్యలు తీసుకోవాలి. త్వరలోనే తీసుకుంటాము.


**2025 నాటికి సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకుంటోంది. ప్రపంచం మొత్తం ఈ పరిణామాన్ని ఆసక్తిగా గమనిస్తున్నది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సంఘ్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించే ఆలోచన చేస్తోందా? అలాగే కొత్త ప్రతిజ్ఞ లేదా కొత్త కోణం చేర్చడం వంటివి ఏమైనా ఉంటాయా?**

సంఘ్ కార్యంలో అనేక దశలున్నాయి. ఇది కేవలం సహజ పురోగతి మాత్రమే. ప్రపంచం దీనిని ప్రత్యేకంగా చూస్తోంది. డాక్టర్‌జీ జీవించి ఉన్న కాలంలో 1940 వరకు అనేక ప్రయోగాలు చేసి, హిందూ సమాజ నిర్మాణ కార్య పద్ధతుల నిర్ణయం జరిగింది. డాక్టర్‌జీ వెళ్లిపోయారు. ఆ పద్ధతిలో సంఘ్ కార్యక్షేత్రం విస్తరించింది. దేశంలోని అనేక ప్రాంతాలకు సంఘ్ కార్యక్రమాలు విస్తరించాయి. ముందు జిల్లా స్థాయి వరకు. ఆ తర్వాత ఆ కిందకు సంఘ్ విస్తరించింది. ఇదంతా గురూజీ సమయంలో జరిగింది. అదే సమయంలో శిక్షణ పొందిన స్వయంసేవకులు విభిన్న క్షేత్రాలలో పనిచేయడం మొదలైంది. స్వయంసేవకులు ఏ క్షేత్రాన్ని వదిలివేయలేదు. బాలాసాహెబ్ దేవరస్‌జీ రోజుల్లో సంఘ్ విస్తరణ కార్యక్రమం మరింత ఊపందుకుంది. చురుగ్గా సాగింది. సంఘ్ సమాజ ఆధారిత సంస్థగా రూపు దిద్దుకుంది. సామాజిక బాధ్యతలను స్వీకరించింది. ఫలితంగా రాజకీయరంగంలో కొంత ప్రగతి కనిపించింది. రజ్జు భయ్యా, సుదర్శన్ జీ కాలంలో మనం ఈ ప్రగతిని స్పష్టంగా చూస్తాము. ఈ రోజున సమాజంతో సంఘ్ బలమైన బంధాన్ని పెనవేసుకుంది. సహజ పరిణామ క్రమంలో సంఘ్ విస్తరిస్తోంది. హిందూ సమాజంలో అవసరమైన పరివర్తన, సమన్వయం కోసం సంఘ్ పనిచేస్తుంది. స్వయంసేవకులు, సమాజంలోని ఉన్నత ఆశయాలు కలిగిన నిజాయతీపరులతో కలసి ఈ కార్యాన్ని నిర్వర్తిస్తారు. కలసి పనిచేస్తారు. మన దేశాన్ని కీర్తి శిఖరాలకు చేరుస్తారు. ఇందుకోసంగా, వందేళ్లు పూర్తయ్యే సమయానికి, శాఖలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవలసి ఉంటుంది. స్వయంసేవకులు అందుకు అవరమైన ఏర్పాట్లు చూస్తారు.

ఈ కార్యక్రమాల అవసరాల కోసం మరింత మంది స్వయంసేవకులను సమీకరించవలసి ఉంటుంది. అలా చేయడం వలన వందేళ్లు పూర్తయిన తర్వాత, ఈ పునాదులపై నిర్మాణం కొనసాగించే స్థితిలో ఉంటారు. సంఘ్ వ్యక్తి నిర్మాణ కార్యక్రమం కొనసాగిస్తుంది. వందేళ్లు చేరుకునే సమయానికి సంఘ్‌ను సర్వవ్యాపి చేయాలి.. అంతటకు విస్తరించాలి, సమాజంలోని అన్ని వర్గాలతో సంబంధాలు ఏర్పరచుకోవాలి, తద్వారా, ప్రజలు ఉత్తమ ఉదాహరణలను అనుసరించగలుగుతారు; బాలీవుడ్ సినిమాలు, మీడియా, రాజకీయాలకు ఇప్పుడు ఇస్తున్న అతి ప్రాధాన్యత తగ్గుతుంది. ప్రజలు వారి సామాజిక బాధ్యతలను గుర్తిస్తారు. సమాజం ఉన్నత వ్యక్తులతో, ఉదాత్త శక్తిగా నిలుస్తుంది. జాతీయ ప్రయోజనాలతో ముడిపడిన సామరస్యపూర్వక సత్సంబంధాలతో పనిచేయవలసి ఉంటుంది. ఇందుకు అవసరమైన శక్తి, సామర్థ్యాలను, మేము 2025 వరకు సమకూకుర్చుకోవలసి వుంది. ఈ కార్యంలో మేము ఏమి సాధించగలమో, ఆ మేరకు మేము ముందుకు సాగుతాం.. ముందడుగు వేస్తాం.

**(అయిపోయింది)**

**అను: రాజనాల బాలకృష్ణ**



సంఘ్ కార్యంలో అనేక దశలున్నాయి. ఇది కేవలం సహజ పురోగతి మాత్రమే. ప్రపంచం దీనిని ప్రత్యేకంగా చూస్తోంది. డాక్టర్‌జీ జీవించి ఉన్న కాలంలో 1940 వరకు అనేక ప్రయోగాలు చేసి, హిందూ సమాజ నిర్మాణ కార్య పద్ధతుల నిర్ణయం జరిగింది. డాక్టర్‌జీ వెళ్లిపోయారు. ఆ పద్ధతిలో సంఘ్ కార్యక్షేత్రం విస్తరించింది. దేశంలోని అనేక ప్రాంతాలకు సంఘ్ కార్యక్రమాలు విస్తరించాయి. ముందు జిల్లా స్థాయి వరకు. ఆ తర్వాత ఆ కిందకు సంఘ్ విస్తరించింది. ఇదంతా గురూజీ సమయంలో జరిగింది.

కథ

# రైతుకు దిక్కెవరు?

బద్ది గణేశ్

"మీకు దండం బెడ్తా సేటు, ఈ ఇత్తునాలు మీ సాపుల్నే దిస్కున్న, నా ఇమానంగా జేప్తున్నా, మీ తాన్నే దీస్కున్న మీరట్ల అవద్దమాడొద్దు.., మీకు రెండు శేతుల మొక్కుతున్న మీరట్లంటే నాకు ఇక సావుమర్నమే." కండ్లలో నీరు ఉబికి వత్తాంటే, తన శేతిలల్ల వున్న ఏపుగా పెరిగి కాతపూత లేని పత్తి మొక్కలతో శేతులు జోడించి దండం బెడుతు ఇత్తనాల షాపు ఓనర్ రమేష్ సేటు కాళ్ల మీద పడి పట్టుకున్న కాళ్లను అస్సలు ఇడుస్తలేడు రైతు రంగయ్య.

"నీ యవ్వ ఎవర్రా నువ్వు. యాడ్నుంచి వచ్చినవ్..! ఛేల్... థూ.." ఒక్కసారిగా కాళ్ల మీదున్న రంగయ్యను బలంగా తన్నడంతో ఔవుతల పడ్డడు. బనీను, ధోతి నిండా ఇంకాస్తా మట్టి అంటుకుంది. తువ్వాల, శేతులున్న పత్తి చేట్లు అటు దూరంగా పడ్డాయ్. రంగయ్యకేల్లి కోపంగా కళ్లెర్రజేసి, పళ్లు కొరుకుతూ కోపంగా చూస్తుండు షాపు ఓనర్. అది మండల కేంద్రం, మంచి సెంటర్. రోడ్డు మీద పోయేటోళ్లు ఆగి మరి చూస్తాంఁడ్రు, ఒక్కొక్కరుగా జనం పెరుగుతున్నరు, ఆ జనంలో కొందరు రైతులు గూడ ఉన్నరు. అందరూ అలా చూసే వరకు సేటుకు ఇజ్జతు పోయినట్టు అనిపిస్తాంటే, మరోపక్క ఇంత జరిగితే తన దగ్గర్కి ఇక ఏ రైతు రాడన్న భయం పట్టుకుంది రమేష్కు. రైతు రంగయ్యకు యాభై ఏండ్ల దాక ఉంటాయ్, భార్య పేరు రామక్క పోతే శెల్క వత్తే ఇల్లే. ఇంట్లే ముచ్చట్లు తప్ప బయటి యవ్వారం తెల్వని అమాయకత్వం . రంగయ్యకు అవ్వయ్యలు పంచి ఇచ్చిన రెండెకరాల శెల్కుంది, అదైన అయింత కాలం అయితేనే ఇంత పంట పండుద్ది. ఎన్నో ఏండ్ల సంది ఎవుసాయం జేస్తున్నగానీ ఇంత ఘోరంగా పత్తి ఎన్నడు కాత పూత లేకుంటా లేదు. బోర్ల మీద బోర్లు ఏపిచ్చి బొందల పడ్డడ్డు అయ్యింది రంగయ్య బతుకు. సూడు సుడని సందుట్ల వానలు పడే సర్కి తన గెట్టు పక్కనున్న ఇంకో నాలుగెకురాలు మక్తకు తీసుకోని వర్షధారమే అని పత్తి పెట్టిండు.

"తులుతూ లేచి ఆడ పడున్న తువ్వాల భుజం మీదేస్కోని మీరు నన్ను కొట్టుర్రి, తిట్టుండ్రి నాకు మీరే న్యాయం జేయ్యాలే "..పోయ్నా పంటకు డబ్బులు కట్టియ్యాలి. దీనంగా కండ్లనీరు తీసుకుంటునే ఆ సేటును బత్మిలాడుతండూ రంగయ్య. షాపు ముందు జనం ఇంకాస్తా జమైండ్రు. టైం పగటిలి పదకొండు కావొత్తంది. పంటల మందుల కోసం ఆషాపు దగ్గర్కి వచ్చి ఈ తతంగమంతా చుస్తాండ్రు ఆసాములు.

"మీరు జేప్తేనే కదా సేటు నేను తీసుకుంది. మీరే కదసేటు ఇయ్యి కొత్త ఇత్తనాలు, మంచి కాపు వత్తది అన్నది, నేను కొత్తయి వద్దు అన్న. ఆడ అట్ట పండింది, ఇడ ఇట్ట పండింది అని ఏవో పోట్వాలు చూపిచ్చి మరి నాకు ఇచ్చిర్రు, మర్శిపోయిండ్రా?. నీ మాటలు నమ్మి తీస్కపోతే మూడు ఎరుకాలు....!. ఏపుగా నా యేత్తు పెరిగే సర్కి చూట్టు పక్కల రైతులచ్చి రంగయ్య నీ అప్పులన్నీ ఉష్కాకి అయినట్టే పటు. ఈ కాపుతోని, నువ్వు బొర్లేప్పిచ్చిన పైసలన్ని ఉత్తగనే తీర్తయ్ తీయ్. రందిపెట్టుకోకు ఇక నీ కష్టాలు తీర్నట్టే , అట్నే నీకు మస్తు ఇకమతు ఉంటదే, మన పట్టేకు ఎవ్వలు తేని ఇత్తునం తెచ్చినవ్ పో.. అని అంటుంటే నేనే ఇంకేదో అనుకున్న. ఇంగో ఇట్లుంది సేటు నా ఇకమతు ఇచ్చకపోయినట్టు అన్నడు రంగయ్య జీరబోయిన గొంతుతో.

"నీ యవ్వ నాది గూడ ఒక ఎరుకం గీట్లనే అయ్యింది జనం లోంచి ఓ రైతు. షాక్ కొట్టినట్టు చూసిండు షాపు ఓనరు. "మా దూరపు సుట్టాల ఊల్లే కూడ గిట్లనే ఓ రైతుకు అయ్యింది అంటా!" ఆ జనంలోంచి ఇంకో గొంతు.

సేటుకు చెమటలు పడ్తున్నాయ్, అందులో పన్జేసేటోల్లు మాకు ఏం తెల్వదన్నట్టు ఆ షాపులో ఏవో సద్రుతున్నరు. ఇట్నే సూత్తే లొల్లి ఇంకాస్తా పెద్దతి అయ్యేతట్టు ఉంది, ఆ రంగయ్య ఊకునే కోపు కానొత్తలేదు, ఏం జేయ్యాలో పాలుపోవడం లేదు, ఆ ఇత్తునాలన్ని ఈ రంగయ్యకే పోవాల్నా తనను తానే తిట్టుకుండు షాపు ఓనర్. జనమంత షాపుకేలే సూత్తాండ్రు, కొందరు రైతులు రంగయ్య పీక్కొచ్చిన పత్తి చేట్లను పరిశీలనగ చూస్తాండ్రు.

"ఓ సేటు..! ఎంతగనం చూడాలే మాకు న్యాయం జేత్తర జేయ్యరా..? గొంతు పెంచిండు రంగయ్య?" న్యాయం జేయ్యాల్సిందే అని గట్టిగ్నే అన్నరు తోటి రైతులు. వాళ్లు అలా అనేసర్కి



రంగయ్యకు కొంచె ధైర్నం వచ్చింది. అప్పట్కే మంచిమాటేమ్మటి మూడుసార్లు వచ్చిండు రంగయ్య పత్తి కాత పూత లేదని. అప్పుడు ఏదో మత్పరిచ్చి పంపిండు రమేష్.

ఏదైదే అదైందని గట్టిగానే రంగయ్య మీద్కిఎదురు తిర్గిండు షాపు ఓనరు. మల్లోపాలి ధైర్నం చేసి సేటు దగర్కి పోవాల్ని చూసిండు రంగయ్య. అట్ట రెండు అడుగుల వేసిండో లేదో అగబట్టి వెనక్కు గుంజుక పోయింద్రు ఆ షాపులో పన్జేసేటోళ్లు.

రంగయ్యకు గబారా గబారా అయితంది. పొద్దున ఇంత పచ్చిపుల్సు, ఉల్లిగడ్డతో తిన్నడు. శెల్కాడికి పోయి అట్లే పత్తి శేట్లు పీక్కోని శీద పట్నం వచ్చిండు. 'ఇయ్యాల న్యాయం జరిగే వరకు ఈడ్నే కూసుంట నా పానం బోయిన ఏంకాదు' భీష్మించిండు రంగయ్య. కోపం తెచ్చుకున్న సేటు రెక్క పట్టుకోని గుంజేసర్కి బొర్లబొక్కల పడ్డడు రంగయ్య తలకాయ కొట్టుకపోయి రక్తం కార్తంది. "మా రైతుల ఊసురు తల్గి నాశ్నం అయిపోతవ్, పురుగులు పట్టి పోతవ్, బాధతో నిండిన కోపంతో శాపనార్థలు పెడ్తుండు రంగయ్య.

ఇట్టకాదు అందరం ఈ షాపు మందట్నే కూసోని ధర్నాం చేద్దాం పటు..! అందులో ఒక రైతు అనంగనే అందరూ కూసోని మాకు న్యాయం జరగాలే అంటు గట్టిన అన్నరు. ఇక ఇది ఇప్పటితో ఆగదు అనుకున్న షాప్ ఓనర్ తన పలుకుబడిని ఉపయోగించిండు.

కుయ్... కుయ్ మంటు పోలీస్ వ్యాన్ రానే వచ్చింది. ఆ సప్పుడుకు కొందరు భయపడి ఆడ్నూంచి పోయింద్రు. అక్కడ రైతులు మాత్రమే ఉన్నరు. పోలీసులు షాప్ దగ్గర్కి రావే వచ్చింద్రు. వాళ్లను చూశ్నా రైతులకు కొంచెం బెరుకు అనిపించినా ధైర్యంగానే ఉన్నరు.

ఎస్సై లింగయ్య రైతు రంగయ్య తాన్కి వచ్చిండు. "ఏమైంది ధర్నా చేస్తాంద్రు రంగయ్యను అడిగిండు..! తన సమస్యను ఏ మాత్రం జంకకుండ ఎస్సైకి చెప్పిండు రంగయ్య". కొంచెం బాధతోనే ఆలోచన చేసిన ఎస్సై అగ్రికల్చర్ ఆఫీసర్ని పిలిపించిండు. సమస్యకు పరిష్కారం చూపలన్నడు. విత్తనాలు తీసుకపోయినప్పడు ఉన్న బిల్లు ఉంటే ఏదైన న్యాయం చేయేచ్చు అని సలహా ఇచ్చిండు ఆఫీసర్.

"ఆ.. రంగయ్య...! విత్తనాలు తీసుకునేటప్పడు బిల్లు తీస్కున్నావా ?

"ఆ మాగ తీస్కున్న సారు.."

అది ఉంటే మీ సమస్యకు కొంతైన పరిష్కారం దొరుకుతుంది. "ఇప్పుడుందా బిల్లు...? రంగయ్యకు మల్లో ప్రశ్న వేసిండు ఎస్సై.

"ఆది... సారు ఆరోజు ఇత్తనాలు తీస్కోని శీదా బాయికాడ్కి పోయిన. ఎప్పుడన్న మంచిగనే పండుతాయి అనుకోని ఆ బిల్లు మీద శ్రద్ధ పెట్టలె..!. ఇప్పుడు అది యాడుందో లేక మట్టిలోనే కలిసి పోయిందో ఏందో సారు. మీకు దండం బెడుతా ఈ పేద రైతుకు మీరే నాయం జేయ్యాలే. ఏడుస్తు ఎస్సై కాళ్ల మీద పడపోయిండు రంగయ్య". రంగయ్య బాధను చూశ్నా ఎస్సై మనసు కశిబిశయ్యింది.

దీన్ని గమనించిన షాపు ఓనర్, ఇదే సందు అనుకోని. ఆడు నా దగ్గర అస్సలు కొనబోలే సార్. ఎస్సై ముందు గట్టిగనే అన్నడు షాప్ ఓనర్. ఇది విన్న రంగయ్య మొఖం తెల్లబడ్డది. రైతు, అందులోను పెద్ద మన్శిని పట్టుకోని ఏంటా మాటలు రమేష్ కేలి జూసి కండ్లేర్ర జేసిండు ఎస్సై.

ఇంగో రమేష్ నువ్వు అమ్మిన బిల్లు ఉంటదిగా అది చూపియ్యి..! ఎస్సై షాప్ ఓనర్ని అడిగిండు. సారు నా దగ్గర తీస్కనే పోలేదు..! సమాధానం ఎల్లతల్గనే ఎస్సై ఫోన్ మోగింది. ఏదో కొద్ది సేపు మాట్లాడిన ఎస్సైకి ఏం చేయాల్నో అర్థం అయితలేదు. తన చేతులోంచి పరిష్కర మార్గం దాటిపోయినందుకు బాధపడ్డడు. ఒక్కసారిగా షాప్ ఓనర్ వైపు ఓరగా చూసి.. రైతు రంగయ్యతోని ఇప్పుడు నీ సమస్య పరిష్కర మార్గం నా చేతుల్లో లేదు. అర్థం చేసుకో రంగయ్య తన చేతిని రంగయ్య చేతిలో పెట్టి...ఇప్పుడు ఇక్కడ ధర్నా బంద్ చేయ్యి. నీకు న్యాయం జరిగేలా చూస్తా ఇక ఇంటికి పో.. చేప్పిండు ఎస్సై. 'మీరే న్యాయం జేయ్యాలే సారూ!' అక్కడున్న రైతులందరు ఆ ఎస్సైని వేడుకున్నరు. ఆ ఎస్సై వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిండు , అందుకే న్యాయం జరుగుద్దని ఒక్క మాటతోని ధర్నా బంద్ చేసింద్రు రైతులు.

"ఆ రైతుల్ని చూసి ఒక వెకిలి నవ్వు నవ్వాడు షాప్ ఓనర్..."

మన బతుకలు ఇంతే అనుకోని ఆడ్నూంచి కదులుతూ... ఎస్సై సార్కు ఫోన్ ఎవలు జేపిచ్చిఉంటరో? అందులోంచి ఓ రైతు అడిగాడు. ఈ షాపోడు ఏం జేసిండో! ఏమో మనకు న్యాయం జరుగుద్దో లేదో? ఆ పత్తి చేట్లు ఆ షాప్ కాన్నే వదిలేసి అక్కడి నుంచి కదిలిలారు.




"వద్దురో..ముండా కొడుకా ఈ శేత వద్దురో..

పట్నంల రంగయ్య విత్తనాలు తీసుకున్న షాపుల విచారణ చేపడుతుండ్రు అధికారులు. ఆ షాప్ ఓనర్ ఎవలెవలకి అమ్మిండో రికార్డులు తీసి ఆ పత్తివిత్త నాలు తీసుకున్న రైతుల వివరాలు, ఈ విత్తనాల లాట్ వివరాలు రాసుకోని మల్లీ ఆ రైతుల శేన్ల దగ్గర్కి పోయిండ్రు విచారణకు. ఒక్కసారిగా షాక్కి గురి అయ్యారు ఆపీసర్లు... విత్తనాలు అమ్మి రైతును ముంచె తెలివి ప్రదర్శిం చిండు. షాప్ ఓనర్ తప్పు చేశాడు కానీ రూల్స్ ప్రకారం రంగయ్యకు నష్టం పరిహారం ఇప్పియ్యలేని పరిస్థితి ఏర్పడ్డది.




అని మొత్తుకున్న!. మనయ్ అసలే ముసలిపాణాలు. మనది మనం జేసుకుంటే సాలు పోరగాళ్లు పెద్దగైరు ఆళ్ల కష్టం వాళ్లు పడ్తరు. ఈ శాతనయ్ శాతకానీ ఈ వయసులో ఇంత ఎవుసాయం వద్దు అని నిరుడునిండి తలకొట్టుకుంటున్న ఇనడే. ఈనే పెద్ద ఆసామి, ఊళ్లో ఇంక ఎవ్వలు లేరన్నట్టు ఇంకో నాలుగెకురాలు మక్తకు తీసుకుండూ. పత్తి చేట్ల ముచ్చట ఎర్రైనంక మొగన్ని తిట్టుకుంటూనే బొగ్గుల పోయ్యి మీద బువ్వొండుతుంది రామక్క".

"వాన పడుతుంది. చలిపెడుతుంది ఆ సలికి రెండు బుక్కలు సుట్టాతాగుదాన్ని తడకకు శెక్కివుంచిన పాత సుట్టా తీసుకో జకముకతో అంటియ్యవోతుంటే ఆ సల్లదానానికి నిప్పురవ్వలు రాల్లేదు. ఆ వర్షం సప్పుడుకు రామక్క అంటున్న మాటలు ఏవో కొన్ని ఇనొచ్చి వినబడనట్టు వినిపిస్తున్నయ్. ఏమోపో దాని లొల్లి అన్నట్టు మల్ల జమకుక కొట్టిండు. అస్సలు రాకపోగ వున్న పత్తి కూడ అయిపోయింది". అది సద్ది మల్ల ఆ సంచి దోతిలో కట్టుకోని ఎనుక బాజుకు మల్లిండు. బొగ్గుల పొయ్యిల అన్నం వండుతున్న రామక్క కనబడ్డది. నీయవ్వ అట్ల బొగ్గుల పోయ్యిల్నన్నా సుట్ట అంటించుకుట కుతి గుంజి పొడైతంది, ఆడ ఒర్రి ఒర్రి తలకాయంతా నొయ్యబట్టే చేతులు భుమిని ఆసరగా చేసుకోని లేచి బొగ్గుల పోయ్యికాడ్కి పోయిండు రంగయ్య.

"నీ యవ్వ ఏందో గుల్గుతున్నవ్.. ఏందో సాపుగా జేప్పేదాన్కే..!" సుట్టను అంటించుకుంటా రామక్కను అడుగుతుండు. అప్పుడు తిట్టిన తిట్లన్ని మల్ల అందుకుంది రామక్క. సప్ప సప్ప గుడిసెలోనే పొగ పీల్చుకుంటా సుట్ట అంటుకుందా లేదా అని మల్లోసరి తిప్పి చూసి సుట్టతాగుతుండు రంగయ్య. ఆ సుట్ట పొగ పడకా దగ్గుతునే అట్లే తిడుతుంది రామక్క. ఆ తిట్లకు కోపానికొచ్చిన రంగయ్య." థూ... నీయవ్వ గట్టిగ కాండ్రిచి బైట తడకకు ఉంచి, ఆ చెట్లు పూతపిందలేక ఎట్లరో ఏందిరో అప్పుల సంగతి అని, నాకు సావుమర్నం అయిందిరో అని నేను సత్తాంటే నువ్వు నీ మాటలు ఏందే" రామక్క కెలి కండ్లేర్ర జేసి చూసిండు రంగయ్య. అప్పుడే బువ్వ గిన్నే దింపేసర్కి ఆ కొర్కాసుల ఎరుపు రంగయ్య కండ్లలోకి పడేసర్కి ఆయన కండ్లు మండుతున్న సూర్యునోలే అవుపిత్తున్నయ్.

ఆలుమగలు ఒకల్నిఒగలు గట్టిగానే అనుకుంటున్నరు. వర్షం జోరు కొనసాగుతునే ఉంది. "ఇప్పట్కే అప్పులు మన తలకు మించిన భారమైనయ్, ఈ సంగతి తెల్సినకాంచి ఒకటికి రెండు సార్లు వచ్చిపోతాండ్రు అప్పిచ్చినోళ్లు. ఈ కాలం ఇట్లుంటే ఈ ఏడు మాగ కాలం అయితదని అని ఇంకొంత భూమి తీసుకుంటివి. అండ్లకత అట్లుండే ఇప్పుడు కొంచెం బాధతో చెప్తుంది రామక్క. ఏం జేద్దమే... మన శేతుల్ల ఏముంది పండన్వి పండేటివి మనం చూడబోయ్నామా? ఇన్ని రూపాలిచ్చి తెచ్చి భూమిలో పెట్టుడేనాయో. అవి మంచివా కాదా ? అని తెలుసుకుందాన్కి నాకు అచ్చరం ముక్క రాకాపాయే అదే తల్చుకోని రందిపడుతుండు రంగయ్య". ఎప్పుడు ఏం పాపం చేసిన్నో..! ఇప్పుడు పంట పండక ఈ కతకావట్టే. మన బతుకులు ఇంతేపో..!. అట్ల కాలం కాగ కొంత ఆగం అయితే.. ఇగ్గో ఇట్ల కాతపూత లేక అగం కావట్టే..! అది తల్సుకోని మల్ల కండ్లనీరు దీసిండు. ట్రాక్టర్ దున్నుడు, నాగలి దున్నుడు, కూల్లోళ్లు. అడుగు మందు, పై మందులు కొట్టి మొక్కలను చిన్నపిల్లల లెక్క సాత్తే ఇగ్గో ఇట్ల మోద్లారే. తోటి రైతుల్వి మంచిగానే ఉన్నయ్. ఒక ఎరుకం పోతే ఏం కాకపోవు గని గీట్ల జరుగుద్దని అనుకుంటిమా..! పొద్దున ధర్నా చేశ్నాం న్యాయం జేత్తం అన్నరు. చూడాలే వాన తగ్గే కొపు కనబడ్తలేదు గనీ ఇంత తిందం పటు గాబర అయితంది. శేతనైతలేదు ఓ ముద్ద తిని అట్ల మంచంల ఒర్గుతా..!. బువ్వేసింది రామక్క. రందితో ఓ నాలుగు ముద్దలు తిని మంచంలకు ఒర్గిండు రంగయ్య.

"ఓ రంగయ్య మామా యేడిదాంకొచ్చింది.. గప్పుడేప్పుడో ధర్నా చేసిండ్రు. ఓ ఉల్కు లేదు పల్కు లేదు".. గెట్టు పక్కపొంటి పత్తి చేన్లో గుంటుక ఆపి మరి అడుగుతుండు మల్లయ్య. "ఏమోరా మల్లి సూడాలి మొన్న అట్ట పంచాతీ ఆపీస్ కాడ తెల్సినోళ్లను అడిగితే ఇయ్యాల రేపట్ల ఆపీసర్లు వత్తరని చెప్పిర్రు" అన్నడు. రంగయ్య మాటల్లో, మొఖంలో దిగాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. "అట్లకాదే మామా అయ్యింయేదో అయ్యిందిగనీ ఉన్నదాన్ని పీకి పారేసి జొన్నలో ఏదో ఒకటి అల్కు. అట్ట ఉత్తగా ఉంటే ఏమొత్తదే..అది రాకపోగ భూమి బలం దండగా" చెప్పుకుంటా హెూ... అని ఎద్దుకి బుట్టిపెట్టిన పచ్చగ అగుబడేసరికి పత్తి చేట్లను తిందాన్కి గుంజుకుంటే పగ్గం గుంచి ఆగబట్టిండు మల్లయ్య. "ఇంగ అదే ఉపాయం జేయ్యాలే గానీ ఆపీసర్లు వచ్చిపోతే ఏదో ఒకటి తెల్తది కదా" ఆ పత్తి శేన్ల నుంచి నడ్సుకుంటా కొట్టంకెలి కదిలిండు ఆడ యాప చేట్టుకు కట్టేశిన బర్రెకు గడ్డేదాన్కి. "పాపం మామా... ఇది వరకు కాలం గాక బోర్లేపిచ్చి మస్తు అప్పులైనయ్... పేదోడి మీదే కష్టాల వానన్నట్టు ఈ కత అయ్యే... అయిన ఈ సేటుకు ఎట్ల పానం



దరిచ్చిందో? గీసోంటి ఇత్తనాలు ఇచ్చిండు. ఏమన్న అయితే గట్టిన కొట్లడలేదు అని కావొచ్చు" గుంటక పండ్లకు అంటివున్న గడ్డి మట్టిని ముల్లు గర్రతోని తీసి హై... చో.. చో.. ఎడ్లను అదిలిచ్చిండు మల్లయ్య.

ఆ రోజు పత్తి శేను కాడ్కి రానే వచ్చింద్రు ఆపీసర్లు. "ఓ... రంగయ్య మామా... ఓ... రంగయ్య మామా ఆపీసర్లు వచ్చింద్రే" గుంటుక ఇడ్సి యాపశెట్టు కింద బువ్వ తింటున్న మల్లయ్య బోర్లే బర్రెను మోపుతున్న రంగయ్యను కూత్తేతాండు.

"ఆ..ఏంది "

"ఆపీసర్లు... సార్లు వచ్చింద్రు ఇట్రా.."

"ఆ వత్తన్న వత్తన్నా.."

బర్రెను చూడమని సత్తెన్నకి చెప్పి ఆపీసర్ల కాడికి మల్లిండు.

"రంగయ్య అంటే నువ్వేనా?" "ఆ నేనే సారు అట్ట కాత పూత లేకుండ కనబడేదంతా నాదే సారు... మీరే న్యాయం జేయ్యాలి సారు. కంటినీటిని తువ్వాల తోని అదిమిపట్టి బాధతో కూడిన బొంగురు గొంతుతో పదే పదే వేడుకుటుంటు వాళ్లు ఇంకో ప్రశ్న అడగనీయకుండానే చెప్పిండు రంగయ్య.

రంగయ్య చెప్పిన వివరాలన్ని ఓ డైరీలో రాసుకున్నరు ఆపీసర్లు. ఇంగో రంగయ్య నీ బాధను మీం అర్థం చేసుకోగలం. కానీ మేము రూల్స్ ప్రకారం నడవాలి కాబట్టి ఆ షాపులో కూడ విచారణ చేసినంక పూర్తి వివరాలు చెప్తాం. నీవేం దిగులు పడకు రంగయ్యకు కొంచెం ధైర్నం చెప్పమని ఆడ్నేవున్న మల్లయ్యకి చెప్పి కదిలింద్రు ఆపీసర్లు.

* * *

పట్నంల రంగయ్య విత్తనాలు తీసుకున్న షాపుల విచారణ చేపడుతుంద్రు అధికారులు. ఆ షాప్ ఓనర్ ఎవలెవలకి అమ్మిండో రికార్డులు తీసి ఆ పత్తివిత్త నాలు తీసుకున్న రైతుల వివరాలు, ఈ విత్తనాల లాట్ వివరాలు రాసుకోని మళ్లీ ఆ రైతుల శేన్ల దగ్గర్కి పోయింద్రు విచారణకు.

ఒక్కసారిగా షాక్కి గురి అయ్యారు ఆపీసర్లు... విత్తనాలు అమ్మి రైతును ముంచె తెలివి ప్రదర్శిం చిండు. షాప్ ఓనర్ తప్పు చేశాడు కానీ రూల్స్ ప్రకారం రంగయ్యకు నష్టం పరిహారం ఇప్పియ్యలేని పరిస్థితి ఏర్పడ్డది.

ఇదే విషయాన్ని ఆ గ్రామ షేష్మందుల ద్వారా రంగయ్యకు చెప్పించింద్రు అధికారులు. "రంగయ్య మొఖంలో ఎలాంటి ఆందోళన లేదు" మందే ఉహించినట్టు ఉన్నడు ఇదే ఫలితం వస్తుంది కాబోలు అని..!

అప్పిచ్చినోల్లకు ఎట్లా తెలిసిందో ఏందో నష్టపరిహారం రాదని. ఒక్కొక్కరుగా ఏదో మాట ముచ్చట లెక్క వస్తున్నారు ఇచ్చిన అప్పు అడుగు తున్నరు. ఇదే ఇషయం తన కొడుకులకు చెప్తే పెద్దోన్ని అడిగితే చిన్నోని, చిన్నోన్ని అడిగితే అన్న పేరు చెప్తున్నాడు. ఇక వీళ్లను అడుగుడు దండుగ అనుకుండూ రంగయ్య. కొన్ని రోజులుగా రంగయ్య వాలకం సూత్తాంటే రామక్కను ఏదో అనుమానం కొడ్తంది కానీ ఏం లేదని దాటేస్తున్నడు..! ఆ పత్తిశేను చికాకే అనుకోని తను మౌనంగ ఉంది.


ఆ రోజు రాత్రి ఇంత తిని ఎప్పటిలాగానే మంచంలకు వొరిగిండు కానీ నిద్రపట్టడం లేదు. కన్ను ముస్తే అప్పుల ఆలోచనలు. ఉన్నశేను పీకేస్తే మల్ల ఏదైన వేయ్యాలన్నా పెట్టుబడి కావాలి. ఈ పరిస్థితుల్లో మల్ల అప్పు పుట్టదని అర్థం అయ్యి. మల్ల కొత్త పంట వాయిదా వైపు రంగయ్య ఆలోచనలు కదులుతున్నాయి. పుట్టినప్పటి నుంచి పుట్టేడు కష్టాలు ఈ రైతు బతుకు ఎందుకని తన రైతు బతుకు మీద తనకే వికారం కలిగింది. అవే ఆలోచనలతో ఎప్పుడు కన్నంటుకుందో ఏందో అట్లనే నిద్రపోయిండు రంగయ్య.

ఎన్నడు లేంది వానొత్తదని కావొచ్చు ఆ రోజు సంకల కవరు పెట్టుకోని శెల్కాడ్కి పోయిండు రంగయ్య. "ఓ మామా ఎన్నడు లేంది ఇయ్యాలా ఇంత పొద్దుగాల వచ్చినవ్.." ఆ.. మా దగ్గరి సుట్టపోల్లది ఓ పంచన్ ఉండే బర్రె బట్టే ఉండేగా ఒకపాలి చూసిపోదాన్కి వచ్చిన. "అంటే ఇయ్యాల రేపు తున్కల పట్టు అన్నట్టు.. అయితేమాయేగని ఇంటికాడ బువ్వతిని పోకు ముక్కలు పట్టయ్.." అనుకుంటా నవ్విండు యాప పుల్లతోని పల్లుతోముతున్న మల్లయ్య. ఆ ముచ్చటకు రంగయ్య కూడ నవ్వుకుంటా శెల్కలకు కదిలిండు. శెల్కమొత్తం ఒకపాలి కలియదిరిగిండు బర్రెను చూసి సందెదు గడ్డివేసిండు. కాత పూత లేకున్న అవి కూడ చేట్లేనని గుండెలకు హత్తుకోని ముద్దాడిండు.

చిన్న చిత్క పనులు చూసుకున్న మల్లయ్య ఇంటికి పోదాన్కి తయారుగా ఉన్నడు. ఒక్కసారిగా పక్షుల కిలకిలలు వినిపిస్తున్నయి. అక్కడ అవి అరుదు అని లుంగీ, తువ్వాల సద్రుకోని ఆడ్నుంచి బయలు దేరుదం అనుకోని ఒక్క క్షణం ఆగిండు పక్షులు చేసే శబ్దం ఏదోతేడ కొడ్తుంది. పోయేవాడు ఒక్కసారిగా తల వెనక్కి తిప్పాడు. ఆ పక్షుల గుంపు ఆ పత్తిశేన్లో చూట్టు తిరుగుతు శబ్దం చేస్తున్నాయి. ఏదో పామో, ఉడుమో, అడవి జంతువు అనుకుండు, మళ్లీ ఆలోచన... కొంచెం భయం భయంగానే అటుకేలే సుత్తాండు.. కానీ ఏం కనిపిస్తలేదు.. పత్తి శేట్లు ఏపుగా పెరిగి ఉన్నయ్. కొంచెం ముందుకొచ్చి ఒక బడితే అందుకోని ఏదైన అడవి జంతువు అనుకోని మెల్లిగా అడుగులు వేస్తుండు. మల్లయ్య దగ్గర్కి పోతున్న కొద్ది పక్షులు దూరం పోతున్నాయి.


అక్కడ్కి చేరుకున్న మల్లయ్య బిత్తరపోయి సూత్తాండు. తనకు తెల్వకుండానే కన్నీరు బొటబొట కారుతోంది. కాళ్లు వణుకుతున్నయ్, ఏదో తెలియని భయం తనలో జొరబడ్డది. రంగయ్య మామా... బిగ్గరగా అరిచాడు. రంగయ్య పక్కన కవరు, కొంచెం దూరంలో ఏదో డబ్బా పడివుంది... మామా మామా... అనుకుంటా చెంపలను తలకాయను కదిలిస్తుండు, చిన్న కదలిక, నోట్లోంచి తెల్లని నురగా కారుతోంది చూట్టు పక్కోల్లను కూతేశిండు... ఎవ్వరు దరిదాపుల్లో లేరు. ఆగమాగం ఉరికి తండకు చేరుకోని వాళ్లను తీసుకోని ఎడ్ల బండి సాయంతో ఊర్లోకి తీసుకపోతున్నారు రంగయ్యను. ఎడ్ల బండి ఊర్లోని చేరుకునే సరికి అప్పట్కే జనం బాగనే జమయింద్రు. రామక్క అనుమానం నిజమైంది. రంగయ్యను ఆటోలో పడుకొబెట్టి మల్లయ్య, రామక్క కూడ ఎక్కినంగా ఆటో పట్నం వైపు కదిలింది.

'రైతుల ప్రాణాలు తీస్తున్న నకిలీ విత్తనాలు' నకిలీ రాయుళ్ల ఆగడాలు ఇంకెన్నాళ్లు అంటూ మంగలి షాపులోంచి రేడియోలో వార్తలు వస్తున్నాయి. ★







# అఘోరనాథ్‌కు నిజాం రాజ్య బహిష్కరణ



ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామాన్ని అణచి వేయడంలో సాయపడినందుకుగానూ నిజాం రాజ్యానికి ఆంగ్లేయుల బెడద వదిలింది. హైదరాబాద్ రాజ్యం స్వతంత్రం అయింది. నామమాత్రపు ఆంగ్లేయుల పెత్తనం తప్ప నిజాం రాజు స్వతంత్రుడు. అతని రాజ్య విస్తీర్ణం 82,698 మైళ్లు. ఇది ఇంగ్లండ్, స్కాట్‌లాండ్‌ల కంటే పెద్దది. హైదరాబాద్ రాజ్యానికి సొంత కరెన్సీ ఉండేది. దీన్ని హాలీసిక్కా (ఏడు హాలీ రూపాయలకు ఆరు బ్రిటిష్ రూపాయలు) అనేవారు. రాజ్యానికి సొంత పోస్టల్ సర్వీస్. సొంత కస్టమ్స్ ఉండేవి.

అఫ్జలుద్దౌల తర్వాత నిజాం మహబూబ్ ఆలీ ఖాన్ గద్దెనెక్కాడు. అప్పుడు అతని వయస్సు 3 సంవత్సరాలు. అయితే సమర్థుడైన ప్రధాని సాలార్ జంగ్ నేతృత్వంలో ఎటువంటి ఒడుదొడుకులు లేకుండా రాజ్యపాలన సాగింది. ఆర్థిక అనిశ్చితి దూరమైంది. వ్యాపారాభివృద్ధి కోసం రైలు వచ్చింది. విద్యుత్ వచ్చింది. టెలిఫోన్, టెలిగ్రాఫ్ వచ్చింది. కొన్ని ఉర్దూ పాఠశాలలు వెలిశాయి. ఉర్దూ పత్రికల కోసం గ్రంథాలయాలు తెరిచారు. అనేకమంది విద్వాంసులను, ప్రతిభావంతులను, హైదరాబాద్‌కు చేర్చారు. వారిలో అఘోరనాథ్ చటోపాధ్యాయ ఒకరు. ఈయన సరోజినీ నాయుడు తండ్రి.

అఘోరనాథ్ చటోపాధ్యాయను సాలార్‌జంగ్ హైదరాబాద్ కాలేజీ (నిజాం కాలేజీ) ప్రిన్సిపాల్‌గా నియమించాడు. చటోపాధ్యాయ బాల్యవివాహాలను వ్యతిరేకించేవారు. వింతంతు వివాహాలను ప్రోత్స హించేవారు. సమాజంలో నెలకొన్న వివిధ సాంఘిక సమస్యల పరిష్కారం కోసం ఆయన వద్దకు ప్రజలు వచ్చేవారు. ఆయన ఎప్పుడూ ప్రభుత్వాన్ని విమర్శించ లేదు. కాని సంస్కరణలకు సంబంధించిన మాటలు కూడా సహించలేని కరడుగట్టిన ఫ్యూడల్ ప్రభుత్వం అది. దీంతో ప్రభుత్వం అఘోరనాథ్‌ను అసహనంగా చూసింది. విప్లవకారుడని శంకించింది. అయినా ఆయన కాలేజీ ప్రిన్సిపాల్ కాబట్టి సమయం కోసం వేచి చూసింది.



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

1887లో బ్రిటిష్ వారు అఫ్గన్ యుద్ధాలలో మునిగిపోయారు. 60 లక్షల రూపాయల నగదు, పెద్దసంఖ్యలో సైన్యం పంపి నిజాం బ్రిటిష్ వారిని ఆదుకున్నాడు. 1902లో వైస్రాయ్ లార్డ్ కర్జన్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు బీరారును తమకు శాశ్వతంగా ఇచ్చివేస్తున్నట్లు నిజాంతో సనద్ రాయించుకున్నాడు.

మరోవైపు హైదరాబాద్ స్టేట్‌లో గల సంస్కృత పండితుడు శ్రీపాద దామోదర్ సాత్వాలేకర్.. ఆర్య సమాజ నాయకుడు కేశవరావ్‌తో కలిసి స్వదేశీ ఉద్యమం లేవదీశారు. అఘోర్‌నాద్ చటోపాధ్యాయ, దత్తు, అప్పాజీ తుల్జాపూర్‌కర్, వామనరావులు వీరితో చేతులు కలిపారు. నిజాం రాష్ట్రం మీద స్వదేశీ ఉద్యమ ప్రభావం కూడా పడింది. దీనికి కారకుడు అఘోర్‌నాథ్ చటోపాధ్యాయేనని బ్రిటిష్ రెసిడెంట్ భావించాడు. అంతేకాదు. 1907 నిజాం తన దూతను సాత్వాలేకర్ దగ్గరకు పంపాడు. 'లెక్చర్లివ్వడం మానుకో. పాట కచేరీలు జరుపు. చిత్ర లేఖనంతో డబ్బు సంపాదించుకో' అని తాఖీదు విడుదల చేశాడు. అందుకు ఆయన సమ్మతించలేదు. దీంతో ఆయనకు రాజ్య బహిష్కరణ శిక్ష వేశారు.

సాలార్‌జంగ్ ప్రారంభించిన రైల్వే లైను విషయంలో వివాదం ఏర్పడింది. రైల్వే లైన్ బ్రిటిష్ వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిందని, దాని కోసం రాజ్యంలో ఒక భాగం తాకట్టు పెట్టాల్సి వస్తుందని వదంతి వచ్చింది. ఈ విషయంలో ప్రభుత్వం కొన్ని యదార్థాలను దాస్తుందని, వాటిని బయట పెట్టాలని కొందరు నగర పెద్దలు కోరారు. చటోపాధ్యాయ దానికి నాయకత్వం వహించారు. ఆయన ప్రభుత్వాన్నే సవాలు చేస్తున్నారని, రాజ్య ద్రోహానికి పాల్పడుతున్నారని పాలకులు భావించారు. ఆయనను హైదరాబాద్ నుండి బహిష్కరిస్తూ శిక్ష విధించారు.

పోలీసు నాజవ్ ఒకరోజు సాయంత్రం చటోపాధ్యాయ ఇంటికి పోలీసులను తీసుకుని వచ్చి ఓ కాగితం చూపించి రైల్వేస్టేషన్‌కు నడవమన్నాడు. చటోపాధ్యాయకు కనీసం తలపాగా తీసుకునే సమయం కూడా ఇవ్వకుండా బయటకు నడిపించాడు. అప్పటికి ఆయన కూతురు సరోజినీదేవి వయస్సు నాలుగు సంవత్సరాలు. తండ్రిని తీసుకు వెళుతుంటే దిగాలుగా చూసింది. రైల్వే స్టేషన్‌లో అఘోరనాథ్ చటోపాధ్యాయను గంటల తరబడి ఉంచారు. ఇతరులను అతని దరికి చేరనీయలేదు. ఇంతలో ఒక రైలు వచ్చింది. ఓ 12 మంది పోలీసులు అతనికి కాపలాగా ఉండి రెండవ తరగతి పెట్టెలో ఎక్కించారు. కాజీపేట తీసుకువచ్చారు. అక్కడ మరో రైలులోకి మార్చి హైదరాబాద్ రాజ్యం దాటించారు. కొన్నాళ్లు ఆయన అక్కడే ఉన్నారు. తర్వాత ఆయన వైస్రాయికి అప్పీలు చేసుకోగా వైస్రాయ్ కలగజేసుకుని రెసిడెంటును బయటకు పంపించి వేసి అఘోరనాథ్‌ను తిరిగి ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈవిధంగా అఘోరనాథ్ హైదరా బాద్ స్వాతంత్రోద్యమానికి తొలి కేక వేశారు. ★

అసలు సిసలు సాంప్రదాయ టెస్టు క్రికెట్లో భారత్ విజయపరంపర కొనసాగుతోంది. స్వదేశీ సిరీస్‌ల్లో అజేయ విజయాలతో సరికొత్త ప్రపంచ రికార్డులతో దూసుకుపోతోంది. టెస్టు క్రికెట్లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జట్టు ఆస్ట్రేలియాతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి రెండు టెస్టులు నెగ్గడం ద్వారా స్వదేశీ సిరీస్‌ల్లో అజేయజట్టుగా రికార్డు నెలకొల్పింది.




# స్వదేశీ సిరీస్‌ల్లో అజేయ భారత్!

2019 సెప్టెంబర్ నుంచి 2023 ఫిబ్రవరి 19 వరకూ.. క్రికెట్ మూడు ఫార్మాట్లలోను కలిపి సొంతగడ్డపై 26వ సిరీస్ ఆడుతున్న భారత్.. గత 25 సిరీస్‌ల్లో అజేయంగా నిలవడం ద్వారా సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఇక 26వ సిరీస్ విజయంతో తన ప్రపంచ రికార్డును తానే అధిగమించడానికి ఉరకలేస్తోంది. 2019లో సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2–3తో చివరిసారిగా ఓటమి పొందిన భారత్.. ఆ తర్వాత నుంచి గత 25 సిరీస్‌ల్లో కనీసం ఒక్క ఓటమి లేకుండా అజేయంగా నిలుస్తూ రావడం విశేషం. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ప్రస్తుత నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి రెండు టెస్టులూ అలవోకగా నెగ్గడం ద్వారా 26వ సిరీస్‌ను ఇప్పటికే ఖాయం చేసుకోగలిగింది.

స్వదేశంలో జరిగిన టీ–20 సిరీస్‌ల్లో భారత్ అత్యధిక విజయాలతో తిరుగులేని జట్టుగా నిలిచింది. న్యూజిలాండ్‌తో ముగిసిన 2023 టీ–20 సిరీస్‌లో అతిపెద్ద విజయంతో 2–1తో సిరీస్ నెగ్గిన భారత్.. సొంతగడ్డపై 50వ టీ–20 విజయం నమోదు చేసింది. తమ తమ దేశాలలో అత్యధిక టీ–20 మ్యాచ్‌లు నెగ్గిన జట్లలో న్యూజిలాండ్ (42), దక్షిణాఫ్రికా (37), ఆస్ట్రేలియా (36), వెస్టిండీస్ (36).. టాప్ ర్యాంకర్ భారత్ తర్వాతి స్థానాలలో నిలిచాయి.



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

గత దశాబ్దకాలంలో సొంతగడ్డపై ఆడిన టెస్టు సిరీస్‌ల్లో భారత్‌కు 88 శాతం విజయాలున్నాయి. మొత్తం ఆడిన 17 సిరీస్‌ల్లో 15 విజయాలు, ఓ సిరీస్ ఓటమి, ఓ సిరీస్ డ్రా రికార్డు ఉంది. 88 శాతం విజయాలు, 94 శాతం డ్రా ఫలితాలు సాధించడం విశేషం. భారత్ తర్వాతి స్థానంలో ఇంగ్లండ్ నిలిచింది. స్వదేశంలో ఇంగ్లండ్ విజయాల శాతం 75 కాగా.. డ్రాల శాతం 90గా నమోదయ్యింది. 50 ఓవర్ల వన్డే క్రికెట్లో భారత్ వేదికగా గత దశాబ్దకాలంలో ఆడిన 17 సిరీస్‌ల్లో 14 విజయాలు, 3 పరాజయాలతో 85 శాతం విజయాలు నమోదు చేసింది. 76 శాతం విజయాలతో దక్షిణాఫ్రికా రెండు, 68 శాతం విజయాలతో ఇంగ్లండ్ మూడుస్థానాలలో నిలిచాయి. మహేంద్రసింగ్ ధోనీ నాయకత్వంలో భారత్ రికార్డు స్థాయిలో స్వదేశీ సిరీస్ విజయాలు సాధించడం మరో అరుదైన రికార్డుగా నిలిచిపోతుంది. ధోనీ తర్వాత సొంతగడ్డపై అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. టెస్ట్ హోదా పొందిన మొత్తం తొమ్మిది దేశాల జట్లు తమ తమ దేశాలలో ఆడిన సిరీస్‌లు, సాధించిన విజయాల గణాంకాలు చూస్తే భారత్ తిరుగులేని జట్టుగా నిలిచింది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ లాంటి అగ్రశ్రేణి జట్లపై భారత్ మెరుగైన ఫలితాలు సాధించగలిగింది. సాంప్రదాయ టెస్టు క్రికెట్లో భారత విజయాల శాతం 45 నుంచి 69కి, వన్డే క్రికెట్లో విజయాల శాతం 55 నుంచి 70కి పెరగటం విశేషం.

## 2023లో హవా..

2023 క్రికెట్ సీజన్‌ను భారతజట్టు అత్యంత విజయవంతంగా ప్రారంభించింది. ప్రపంచ మాజీ చాంపియన్ శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో క్లీన్ స్వీప్ విజయం సాధించిన భారత్.. వన్డే, టీ–20 ఫార్మాట్లలో న్యూజిలాండ్‌ను చిత్తుచేయడం ద్వారా అజేయంగా నిలిచింది.

2014–15 బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ సిరీస్ నుంచి ప్రస్తుత 2023 సిరీస్ వరకూ ఆస్ట్రేలియాతో ఆడిన 16 టెస్టుల్లో 10 విజయాలు, 3 పరాజయాలు, 3 డ్రా ఫలితాలతో భారత్ వరుసగా సిరీస్‌లు గెలుచుకొంటూ వస్తోంది. అంతేకాదు, గత 15 సంవత్సరాలుగా స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఆడిన భారత్‌కు సిరీస్ ఓటమి అన్నదే లేకపోడం మరో అరుదైన ఘనతగా మిగిలిపోతుంది. ప్రస్తుత సిరీస్‌లోని మొదటి రెండు టెస్టులతో కలుపుకొని ఆస్ట్రేలియాతో ఆడిన 16 టెస్టుల్లో 12 గెలుపు, ఒకేఒక్క ఓటమి, మూడు డ్రా ఫలితాలతో 75 విజయ శాతాన్ని భారత్ నమోదు చేసింది.

## బ్యాటింగ్‌లో పూజారా- బౌలింగ్‌లో రవీంద్ర జడేజా!


బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌ల్లో భారత జట్టులోని సౌరాష్ట్ర జోడీ చతేశ్వర్ పూజారా, రవీంద్ర జడేజాలకు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలలో కళ్లు చెదిరే రికార్డే ఉంది. ప్రస్తుత సిరీస్‌లోని ఢిల్లీ టెస్టు వరకూ 14 మ్యాచ్‌లు ఆడిన పూజారా నాలుగు శతకాలు, అర డజను అర్ధశతకాలతో సహా 1235 పరుగులు సాధించాడు. 51.45 సగటుతో నంబర్ వన్ బ్యాటర్‌గా నిలిచాడు. ఇక.. బౌలింగ్‌లో లెఫ్టామ్ స్పిన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 2016–17 సిరీస్ నుంచి ప్రస్తుత 2023 సిరీస్‌లోని మొదటి రెండు టెస్టుల వరకూ 10 మ్యాచ్‌లు ఆడి 56 వికెట్లు పడగొట్టాడు. అందులో నాలుగుసార్లు ఒక్కో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, ఒక్కసారి ఓ టెస్టులో 10 వికెట్లు పడగొట్టిన ఘనత జడేజాకు మాత్రమే సొంతం. ఆస్ట్రేలియాతో సిరీస్‌ల్లో పూజారా, జడేజా చెరో మూడుసార్లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలుచుకోడంతో పాటు చెరోసారి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. ★




# బాల్యవివాహాలపై

**అస్సాంలో ఏం జరుగుతోంది? పెద్దసంఖ్యలో అరెస్టులు ఎందుకు జరుగుతున్నాయి? బాల్య వివాహాల కారణంతో అరెస్టులు చేస్తారా? ఇదంతా ఒక మతం వారినే లక్ష్యంగా చేసుకుని చేస్తున్నారా? ఇటీవల దేశమంతా జరుగుతోన్న చర్చ ఇది. ఇది తమ 'పర్సనల్ లా'కు వ్యతిరేకం అని కొందరు వాదిస్తున్నా.. బాలికల భవిష్యత్తును కాపాడే దిశగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ అభినందించాల్సిందే. బాల్య వివాహాలను అరికట్టేందుకు తీవ్ర చర్యలు తీసుకోవాలని అస్సాం రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించిన నేపథ్యంలో ఈ సాంఘిక దురాచారానికి వ్యతిరేకంగా వెంటనే కార్యాచరణ మొదలైంది. ఫిబ్రవరి 2 నుంచి 12 వరకు.. 10 రోజుల్లో 3,015 మంది అరెస్టు చేశారు. 4,074 కేసులు నమోదయ్యాయి. ఇంకా అరెస్టు చేయాల్సిన వారు 8000 మందికి పైగా ఉన్నారు.**

అస్సాం ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు కలకలం సృష్టించాయి. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్రభుత్వం కొత్తగా ఎలాంటి చట్టాలను తీసుకురాలేదు. ఇప్పటికే అమలులో ఉన్న చట్టాల ప్రకారం చర్యలను వేగవంతం చేసింది. రాష్ట్రంలో మాతా, శిశు మరణాలను తగ్గించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది కూడా. 14 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలను వివాహం చేసుకున్న వారిని బాల్యవివాహాల నిరోధక చట్టం కింద; 14 ఏళ్ల లోపు వారిని పెళ్లి చేసుకుంటే పోక్సో చట్టం కింద అరెస్టు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు పంచాయతీలో బాల్య వివాహాల నిరోధక అధికారిని కూడా నియమించింది.


ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ

రాష్ట్రంలో దాదాపు 31 శాతం వివాహాలు తక్కువ వయసులోనే జరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వీటిని అరికట్టకపోతే పరిస్థితులు దారుణంగా మారే అవకాశం ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (ఎన్‌హెచ్ఎఫ్ఎస్)పై రాష్ట్ర మంత్రివర్గం సవివరంగా చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

బాల్యవివాహం చేసుకున్నవారితో పాటు వివాహం చేసిన పురోహితులు, ఖాజీలను వివాహాన్ని ప్రోత్సహించిన వారిని కూడా అరెస్టు చేస్తున్నారు. బాలికల తల్లిదండ్రులకు మాత్రం నోటీసులు జారీచేస్తామని పోలీసులు వెల్లడించారు. గత కొంతకాలంగా అస్సాంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతోంది. రానున్న రెండు మూడేళ్లలో రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని డీజీపీ జీపీ సింగ్ తెలిపారు. బాల్య వివాహాలకు పాల్పడినందుకు అరెస్టయిన విదేశీయుల కోసం అస్సాం ప్రభుత్వం రెండు డిటెన్షన్ కేంద్రాలను తాత్కాలిక జైళ్లుగా మార్చినట్లు అధికారులు తెలిపారు. గోల్‌పరా జిల్లాలోని మాటియా ట్రాన్సిట్ క్యాంప్, కాచర్ జిల్లాలోని నేషనల్ ఆటోమోటివ్ టెస్టింగ్, ఆర్ అండ్ డి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ ప్రాంగణం ఇందుకోసం ఉపయోగిస్తున్నారు.

**చట్టం ఏం చెబుతోంది?**

స్వాతంత్ర్యం రాక ముందే మన దేశంలో బాల్య వివాహాల నిరోధక చట్టం అమల్లో ఉంది. దాని ప్రకారం వివాహానికి చట్టబద్ధమైన వయస్సు అబ్బాయిలకు 18 ఏళ్లు. అమ్మాయిలకు 14 ఏళ్లు. ఈ చట్టాన్ని 1978లో సవరించారు. వివాహ వయస్సును అబ్బాయిలకు 21 సంవత్సరాలు, బాలికలకు 18 ఏళ్లకు పెంచారు. 2006లో మళ్లీ సవరణ చేసి బాల్య వివాహాన్ని నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణించారు. ఈ చట్టం ప్రకారం మైనర్‌ను వివాహం చేసుకున్న వ్యక్తికి రెండేళ్ల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించనున్నారు. అంతేకాదు, ఆ వివాహం కూడా చెల్లుబాటు కాదని కోర్టు ప్రకటించింది. 2012లో లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ కోసం పోక్సో చట్టం తీసుకువచ్చారు. ఇది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయిలు, బాలికలకు వర్తిస్తుంది. ఈ చట్టాన్ని కూడా 2019లో సవరించి, దోషులకు మరణశిక్షను కూడా జోడించారు. ఈ చట్టం ప్రకారం 7 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష పడే అవకాశం ఉంది.

**అస్సాంలోనే ఎందుకిలా?**

సాధారణంగా సగటు అస్సామీ చట్టప్రకారం 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేసుకుంటారు. ఎక్కువగా 25-30 ఏళ్ల వయసులో పెళ్లిళ్లు అవుతుంటాయి. వీరు ఇద్దరు లేదా ముగ్గురిని కంటున్నారు. కానీ సరిహద్దు జిల్లాల్లో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన కుటుంబాల వారు 13-14 ఏళ్లకే వివాహాలు చేస్తున్నారు. వీరు కనీసం 5-6 మందిని కనేస్తున్నారు. ఈ ప్రభావంతో అస్సాంలో కొన్ని దశాబ్దాలుగా భౌగోళిక జనసాంద్రత పెరిగి పోతోంది. ఇప్పటికే స్థానిక అస్సామీల జనాభా కన్నా వలస వచ్చిన వారి సంతతే ఎక్కువగా ఉంది. సాంస్కృతికంగా రాష్ట్రానికి ఇది ఆందోళన కలిగించే పరిణామం.

బాల్య వివాహాలు ఎక్కువగా ఎగువ, దిగువ-మధ్య అస్సాం జిల్లాల్లో జరుగుతున్నట్లు గుర్తించారు. ధుబ్రి, నాగావ్, మోరిగావ్, హోజాయ్, ఉదల్గురి, ధేమాజీ, మజులి, శివసాగర్ జిల్లాల్లో ఈ సమస్య




# ఉక్కుపాదం

ఎక్కువగా ఉంది. ఇక్కడ బంగ్లాదేశ్ వలసదారులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. ఈ ప్రాంతంలో 2,278 మంది నిందితులను అరెస్టు చేశారు. అత్యధికంగా ధుబ్రి జిల్లాలో 374 మందిని అరెస్టు చేయగా, హోజాయ్ జిల్లాలో 255 మంది, మోరిగావ్‌లో 224 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. గౌహతి పోలీస్ కమిషనరేట్‌లో 192 కేసులు నమోదయ్యాయి. అరెస్టులు మొదలైన తరవాత దక్షిణ అస్సాంలోని బరాక్ వ్యాలీ ప్రాంతాల్లో వందకు పైగా బాల్య వివాహాలు రద్దు లేదా వాయిదా పడ్డాయి.

**విమర్శలెందుకు?**

అస్సాం ప్రభుత్వం చేపట్టిన చర్యలు సహజంగానే కొన్ని వర్గాల్లో ఆందోళన కలిగించాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు మొదలయ్యాయి. పోలీసు స్టేషన్ల ముందు మహిళలు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. తమ భర్తలను, కుమారులను అరెస్టు చేస్తే ఎలా జీవించాలని.. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని ఈ చట్టాన్ని అమలు చేస్తున్నారని అస్సాంలో ప్రతిపక్ష కాంగ్రెస్ నాయుడు భూపేన్ కుమార్ బోరా, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రిపున్ బోరా ఆరోపించారు. పలు ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. అరెస్టయిన వారిలో ఎక్కువ మంది ముస్లింలే ఉన్నారని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) చీఫ్, ధుబ్రి ఎంపీ బద్రుద్దీన్ అజ్మల్ ఆరోపించారు. బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చిన ముస్లింలకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అస్సాం ప్రభుత్వ చర్యలను తప్పుపట్టిన వారిలో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ కూడా ఉన్నారు. ఒవైసీ పార్టీ ప్రభావం ఎక్కువగా ఉన్న హైదరాబాద్ పాతబస్తీలో బాల్య వివాహాలపై ఆయన పెద్దగా నోరు మెదపరు. ఇక్కడ ఎంతో మంది బాలికలను గల్ఫ్ దేశాల నుంచి వచ్చే వృద్ధ షేక్‌లు నిఖా చేసుకుని తీసుకెళ్తున్నారు. అక్కడ పనిమనుషులుగా, సెక్స్ వర్కర్లుగా మారుస్తున్నారు. కానీ ఇవేమీ ఒవైసీకి పట్టవు. అరెస్టయిన వారిలో 58% మంది మాత్రమే ముస్లింలు ఉన్నారని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనలను ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ తిప్పికొట్టారు. దీనిని రాజకీయం చేయొద్దని, కేవలం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యలుగా భావించాలని విపక్షాలను కోరారు.

**పర్సనల్ లా చెల్లుతుందా?**

అస్సాంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా చేపట్టిన చర్యలను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) నిర్ణయించింది. ఈ సంస్థ సభ్యులు లక్నోలో అత్యవసరంగా సమావేశమయ్యారు. ముస్లిం పర్సనల్ లా ప్రకారం బాలికల కనీస వివాహ వయస్సు 15 సంవత్సరాలని, ముస్లిం బాలిక 15 ఏళ్లు నిండిన తర్వాత తనకు నచ్చిన



వ్యక్తిని పెళ్లి చేసుకోవచ్చని వారు చెబుతున్నారు. పంజాబ్, హర్యానా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు గురించి కూడా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ తీర్పు ప్రకారం బాల్యవివాహాలపై తాజాగా వేసే కేసులో పార్టీగా మారాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు విజ్ఞప్తి చేస్తుందని సీనియర్ న్యాయవాది ఒకరు తెలియజేశారు. అయితే, హైకోర్టు నాటి తీర్పును జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఆ కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. సాధారణంగా పర్సనల్ లా, క్రిమినల్ లా మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు క్రిమినల్ లానే చెల్లుబాటు అవుతుందని న్యాయ నిపుణులు కూడా చెబుతున్నారు.

**ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

బాల్య వివాహ బాధితుల పునరావాసం కోసం అస్సాం ప్రభుత్వం ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రాష్ట్ర మంత్రివర్గంలో ముగ్గురు క్యాబినెట్ మంత్రులను ఇందుకోసం నియమించి 15 రోజుల్లో ముసాయిదాను ఖరారు చేయాలని ఆదేశించారు. బలవంతపు బాల్యవివాహాల బాధితులకు పరిహారం చెల్లించే విధానాన్ని ఖరారు చేయనున్నారు. ఇప్పటికే కేసులను అధ్యయనం చేస్తున్నామన్నారు. బలవంతంగా పెళ్లి చేసుకున్న మైనర్ బాలికలకు పునరావాసం ఎలా కల్పించాలి? అనే అంశంపైనా దృష్టి సారిస్తున్నారు.

**ప్రమాదకరంగా గర్భధారణ రేటు**


అస్సాం బాలికల్లో గర్భధారణ రేటు ప్రమాదకరంగా ఉంది. ఇది 2022లో 16.8% నమోదైంది. ఆ సంవత్సరం రాష్ట్రంలో 6,20,867 మంది బాలికలు గర్భం దాల్చారు. ఇందులో 1,04,264 మంది బాలికలు తల్లులయ్యారు. ఇందులో బార్పేట జిల్లా 28.7%తో అగ్రస్థానంలో ఉంది. ధుబ్రి, దక్షిణ సల్మారా 27.9%, గోల్‌పరా 24.1% తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ధుబ్రి, దక్షిణ సల్మారా జిల్లాలో 51,831 కేసులు నమోదయ్యాయి. ఇది ఒకరకంగా ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. వారిలో చాలా మంది చివరి బిడ్డను కన్నప్పుడు మొదటి బిడ్డ వయస్సు తొమ్మిదేళ్లు ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. చిన్నవయస్సులోనే బాలికలు గర్భం దాల్చితే వారి ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. నిర్ణీత వయస్సు కంటే ముందు పిల్లలు పుట్టినా లేదా ఆలస్యంగా జన్మించినా రకరకాల సమస్యలు ఉత్పన్నమవుతాయి. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల పిల్లలు జన్యుపరమైన లోపాలతో పుడుతున్నారని రాష్ట్రం ప్రభుత్వం తెలిపింది. బాల్యవివాహాలను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రజలు సహకరించాలని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ కోరారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రజారోగ్యం, సంక్షేమం కోసమేనని స్పష్టం చేశారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

# బాలజాగృతి


## తెలుసుకుందాం

# వేంకటేశ్వరస్వామి దేవాలయం - రాయగిరి



తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా, రాయగిరి గ్రామంలో ఈ ఆలయం కొలువుదీరింది. యాదాద్రికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీనిని కాకతీయుల కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడికి సమీపంలోని మల్లన్నగుట్ట మీద రాయగిరి కోట ఉంది. ఈ ఆలయంలోని మెట్లబావి (కోనేరు) 16వ శతాబ్దం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. ఏటా ఫిబ్రవరి మొదటి వారంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

## కథ | చెప్పుడు మాటలు!



భీమయ్య, సోమయ్య చాలా కాలం నుంచి మంచి స్నేహితులు.

ఉన్నట్టుండి వాళ్ల మధ్య మాటలు నిలిచిపోయాయి. భీమయ్య మీద సోమయ్య, సోమయ్య మీద భీమయ్య ద్వేషం పెంచుకున్నారు.

ఒకసారి ఊరిబయట శివాలయం దగ్గర ఒకరికొకరు ఎదురయ్యారు.

అప్పుడు భీమయ్య కలుగచేసుకొని 'ఇదిగో, సోమయ్యా.. మనిషి అన్నాక కాస్త ముందూ వెనకా ఆలోచించాలి" అన్నాడు.

'నువ్వేం అంటున్నావో, నాకు అర్థం కావడం లేదు.' అన్నాడు సోమయ్య.

'ఎలా అర్థం అవుతుందిలే! చెడు కోరే వాళ్ల మాటలైతే నీకు అర్థం అవుతాయి" అన్నాడు భీమయ్య.

'వివరంగా చెప్పాలి గాని, ఆ ఎత్తిపొడుపులెందుకు?' అన్నాడు సోమయ్య.

'అదే.. ఆ చంద్రయ్య చెప్పుడు మాటలు విని, నా మీద కక్ష పెంచుకున్నావట! నా అంతు చూస్తానని అన్నావట. ఎవరైనా

## పద్యం

**ఎరుగ వాని దెలుప నెవ్వడైనను జాలు**
**నొరుల వశముగాదు ఓగుదెల్ప**
**యేటివంక దీర్ప నెవ్వరి తరమయా?**
**విశ్వదాభిరామ, వినుర వేమ!**

**భావం :** తెలుసుకోవాలనే జిజ్ఞాస గల వారికి తెలియజెప్పడం సులభమే. తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు అని వాదించటం మూర్ఖుని సహజ లక్షణం. అలాంటి వారికి తెలియజెప్పటం ఎవరి తరం కాదు. ఏటికుండే ప్రకృతి సిద్ధమైన వంపును సరిచేయటం ఎవరికీ సాధ్యం కాదు కదా.

## శ్లోకం

**మరణాంతని వైరాణి**

**'మరణాంతని వైరాణి**
**ప్రసవానంతం చ యౌవనం**
**కోపితా ప్రణతాంతా హి**
**యాచితాంతం చ గౌరవం'**

**భావం :** మరణంతో పగ చెల్లిపోతుంది. ప్రసవంతో శరీర పటుత్వం (యౌవనం) తగ్గిపోతుంది. నమస్కారం(దండం)తో ఎదుటి వారిలోని కోపం దిగిపోతుంది. యాచనతో గౌరవం తగ్గుతుంది. ('కోపితా ప్రణయాంతా హి'అని పాఠాంతరం)

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| రెసిస్టెన్స్ | ఆంపియర్ |
| కరెంట్ | న్యూటన్ |
| ఫోర్స్ | వాట్ |
| పవర్ | ఓమ్ |

**జవాబులు :** రెసిస్టెన్స్–ఓమ్, కరెంట్–ఆంపియర్, ఫోర్స్–న్యూటన్, పవర్–వాట్.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ఇందుమతి చిమన్‌లాల్ షేత్



గుజరాత్‌కు చెందిన భారత స్వాతంత్ర్యోద్యమరాలు, రాజకీయవేత్త, సామాజిక కార్యకర్త, విద్యావేత్త. ఈమె 1906లో అహ్మదాబాద్‌లో జన్మించారు. గాంధీచే ప్రభావితమై ఉద్యమంలో చేరారు. సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని అరెస్ట్ కూడా అయ్యారు. ఖాదీ వస్త్ర ప్రచారం కోసం అహ్మదాబాద్‌లో ఖాదీ మందిర్‌ను స్థాపించారు. విద్య, ఉపాధి ద్వారా మహిళల్ని ఉద్ధరించడానికి సమ్మున్నతి ట్రస్ట్ స్థాపించారు. ఇందుమతి చిమన్‌లాల్ 1985లో మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. భారతదేశంలో మొదటి రైల్వే లైన్‌ను ఎప్పుడు ప్రారంభించారు?
2. ప్రపంచ బ్యాంక్ ప్రధాన కార్యాలయం ఎక్కడుంది?
3. మీనాక్షి దేవాలయం ఏ రాష్ట్రంలో ఉంది?

జవాబులు : 1. 1853 (ముంబై నుంచి థానే వరకు); 2. వాషింగ్టన్ డి.సి. (యునైటెడ్ స్టేట్స్); 3. తమిళనాడు (మధురై).



గిట్టక ఏదైనా చెడుగా చెబితే వెంటనే నమ్మడమేనా?' అని ప్రశ్నించాడు భీమయ్య.

'అవునూ.. ఇంతకీ నేను నిన్నలా అనరాని మాటలు అన్నానని నువ్వెలా అనుకుంటున్నావు?' అని అడిగాడు సోమయ్య.

'ఆ కామయ్య చెప్పాడులే.. అంతా' అన్నాడు భీమయ్య.

'చెప్పుడు మాటలు వినరాదని నాకు చెబుతూ.. చివరికి నువ్వు చేసిందేమిటి?' అంటూ నవ్వసాగాడు సోమయ్య.

భీమయ్యకు దాంతో అసలు సంగతి అర్థమై, తనూ నవ్వసాగాడు. ★

## మెదడుకు మేత

కాటుక రంగు,
కమలపు హంగు,
విప్పిన పొంగు,
ముడిచిన క్రుంగు..
ఏమిటది?

జవాబు : గొడుగు

## మంచిమాట

**నీ ప్రతిభ గుర్తింపు పొందాలంటే ఇతరుల ప్రతిభను గుర్తించడం నువ్వూ నేర్చుకోవాలి!**




# వారఫలాలు

**27 ఫిబ్రవరి-05 మార్చి 2023**




సింహంభట్ల సుబ్బారావు
6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆర్థిక వ్యవహారాలలో ఇబ్బందులున్నా అధిగమిస్తారు. ఆస్తులు కొంటారు. ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. వాహనాలు, నగలు కొంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధుల్లో సత్తా చాటతారు. రాజకీయవేత్తల దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 3,4 తేదీల్లో ఖర్చులు. శ్రమ పెరుగుతుంది. దూరప్రయాణాలు. శివాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

కుటుంబ సమస్యలు తీరి ఉపశమనం లభిస్తుంది. విలువైన వస్తువులు సేకరిస్తారు. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వాహనసౌఖ్యం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగుల ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. వైద్యులు, వ్యవసాయదారులకు సంతోషదాయకమైన సమాచారం. 27, 28 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. మానసిక ఆందోళన. నృసింహ స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ముఖ్య కార్యక్రమాలు నిదానంగా సాగినా చివరికి పూర్తిచేస్తారు. ఆదాయానికి ఇబ్బందులు ఉండవు. స్థిరాస్తుల కొనుగోలులో సమస్యలు తీరతాయి. ఇంటి నిర్మాణ యత్నాలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారస్తులకు ఒడిదుడుకులు తొలగుతాయి. ఉద్యోగులకు విధులు ప్రశాంతంగా గడుస్తాయి. 1, 2 తేదీల్లో కుటుంబ సమస్యలు. ఆరోగ్యం కొంత ఇబ్బంది కలిగించవచ్చు. శ్రీరామరక్షా స్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో అనుకున్నది సాధిస్తారు. వ్యాపారస్తులు విస్తరణ కార్యక్రమాలు ముమ్మరం చేస్తారు. ఉద్యోగులకు విధుల్లో ప్రోత్సాహకరం. కళాకారులకు కార్యసిద్ధి. క్రీడాకారులు, వైద్యులకు శుభవార్తలు. 2,3 తేదీల్లో వృథా ఖర్చులు. వ్యయప్రయాసలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

బాకీలు వసూలవుతాయి. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యతిరేక పరిస్థితులను చక్కదిద్దుకుని ముందడుగు వేస్తారు. వ్యాపారులకు స్వయంకృషితో లాభాలు. ఉద్యోగులు సమస్యలను అధిగమిస్తారు. రాజకీయవేత్తలు అంచనాలు నిజం చేసుకుంటారు. క్రీడాకారులు, రచయితల యత్నాలు కొలిక్కి వస్తాయి. 27,28 తేదీలలో దూరప్రయాణాలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

రాబడి సమకూరి అవసరాలు తీరతాయి. ఆస్తి వివాదాలు తీరతాయి. వాహనాలు కొంటారు. వ్యాపారులు గతం కంటే లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు బాధ్యతలు కొంతమేర తగ్గి ఊరట లభిస్తుంది. రాజకీయవేత్తలు ఊహించని పదవులు దక్కించుకుంటారు. వైద్యులు, వ్యవసాయదారుల కలలు ఫలిస్తాయి. 28, 1 తేదీల్లో అనుకోని ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. గాయత్రీ ధ్యానం మంచిది.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఆదాయానికి ఇబ్బంది ఏర్పడినా స్నేహితులు ఆదుకుంటారు. స్థిరాస్తుల కొనుగోలులో అగ్రిమెంట్లు చేసుకుంటారు. వ్యాపారులు పెట్టుబడుల రాకకు నిరీక్షిస్తారు. ఉద్యోగస్తులు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. కళాకారులకు సంతోషకరమైన విషయాలు తెలుస్తాయి. రచయితలు, క్రీడాకారులకు అవకాశాలు. 2, 3 తేదీల్లో ప్రయాణాలు. మానసిక అశాంతి. శివనామ స్మరణ మంచిది.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆర్థిక పరిస్థితిలో కొంత గందరగోళం నెలకొంటుంది. అనుకున్నది సాధించాలన్న తపన పెరుగుతుంది. విద్యార్థులకు ఊహించని అవకాశాలు. దూరప్రయాణాలు. ప్రతి నిర్ణయానికి మరింత ఆలోచన ముఖ్యం. ఉద్యోగుల విధి నిర్వహణ కొంత తేలికపడుతుంది. కళాకారులకు అంచనాలు కొంత ఫలించవచ్చు. 1,2 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. కష్టపడ్డా ఫలితం కనిపించదు. శ్రీరామరక్షా స్తోత్రం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

విజయాల బాటలో నడుస్తారు. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. వాహనాలు, ఆభరణాలు సమకూర్చుకుంటారు. వ్యాపారులు స్వయంకృషితో లాభాలు గడిస్తారు. ఉద్యోగులకు విధులు సాఫీగా సాగిపోతాయి. కళాకారులకు సంతోషకర సమాచారం. రచయితలు, క్రీడాకారులకు అవకాశాలు దక్కుతాయి. 4, 5 తేదీల్లో వ్యయప్రయాసలు. వృథా ఖర్చులు. శివపంచాక్షరి పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

దూరప్రాంతాల నుంచి శుభవార్తలు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వాహనాలు, భూములు కొనుగోలు యత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారులు పెట్టుబడులపై వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారు. ఉద్యోగులకు ఉన్నతమైన పోస్టులు రావచ్చు. వైద్యులు, క్రీడాకారులకు శుభవార్తలు అందుతాయి. 28,1 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ముఖ్యమైన కార్యక్రమాలలో కొంత జాప్యం. ప్రయాణాలు వాయిదా వేస్తారు. ఆస్తి విషయాలలో సోదరుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు ముందుకు సాగవు. ఆదాయం విషయంలో కొంత తడబాటు. రావలసిన సొమ్ము అందక ఇబ్బంది పడతారు. ఇంట్లో కొన్ని వేడుకలు వాయిదా పడతాయి. 27,28 తేదీల్లో వస్తులాభాలు. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

శ్రమకు ఫలితం కనిపిస్తుంది. ఆప్తుల నుంచి ముఖ్య విషయాలు తెలుస్తాయి. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. అయితే ఖర్చులు అదుపు చేసుకోవడం మంచిది. సోదరులతో వివాదాలు పరిష్కారం. వ్యాపారులకు లాభనష్టాలు సమానం. ఉద్యోగులకు విధి నిర్వహణలో ప్రోత్సాహం. రాజకీయవేత్తలకు విదేశీ పర్యటనలు. 2, 3 తేదీలలో మానసిక అశాంతి. కుటుంబంలో సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి. ★

# పదరసం-405

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ✠ | 3 | | ✠ | 4 | | 5 |
| | ✠ | 6 | | | ✠ | 7 సీ | | ✠ | |
| | ✠ | | ✠ | 8 | 9 | | | ✠ | |
| ✠ | 10 | | 11 | ✠ | | ✠ | 12 | 13 | ✠ |
| 14 | | ✠ | 15 | 16 | | 17 | ✠ | 18 | 19 |
| 20 | | 21 | ✠ | | ✠ | | ✠ | ✠ | |
| ✠ | 22 | | 23 | ✠ | ✠ | ✠ | 24 | 25 | ✠ |
| 26 | ✠ | 27 | | ✠ | 28 | 29 | ✠ | 30 | 31 |
| 32 | 33 | ✠ | 34 | 35 | ✠ | 36 | 37 | ✠ | |
| 38 | | | ✠ | 39 | | ✠ | 40 | | |

**పదరసం – 405**

పేరు : ..............................................................................................

చిరునామా:..............................................................................................

..............................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

## ఆధారాలు

**అడ్డం**

1. ద్వారాబంధము (3)
3. పరిణామము (2)
4. గారాబము, పెంకెపట్టు (3)
6. ఏడ్పు (3)
7. డబ్బా కాదు గాజుది (2)
8. కొత్త జనరేషన్ (4)
10. కోరిక, ఈప్స (3)
12. గంజాయితో చేసే మత్తు పదార్థం (2)
14. ఇది రాగోరుతుందని సామెత, ఓ లోహం (2)
15. ఇది తలాపిడికెదు అని సామెత (4)
18. స్వర్గము (2)
20. వేతనము (3)
22. సంతోషము (3)
24. రాట వంటిదే! (2)
27. పోక కాదు ఆగమనం (2)
28. పులి విసిరేది (2)
30. రావణుని రాజ్యం (2)
32. ధ్వనిమోత (2)
34. స్త్రీల కంఠాభరణం (2)
36. సముద్రతీర ప్రసిద్ధ ప్రాంతం ముంబయ్ నుండి...(2)
38. మానససరోవర పక్షులు (3)
39. చెలికత్తె (2)
40. ఆదికవి తెలుగుకు!? (3)

**నిలువు :**

1. శరీరము (3)
2. ముదుకెళ్లేవాడు (4)
3. మన్నన, గౌరవము (3)
4. నెల మొదలు అనే! (4)
5. అద్దం (3)
7. జానకి (2)
9. చెదిరిన పావలా (3)
10. పేపర్ (4)
11. లోహపు తీగ (2)
13. గుత్తి, పెడతల (2)
14. సయోధ్య, సంధి, ఒడంబడిక (2)
16. సన్నము కాదు (2)
17. ఫలము (2)
21. మినహాయింపు, రాయితీ (3)
23. తలక్రిందయిన స్వర్గము (3)
25. నీరు (2)
26. చెట్టు (3)
29. హిందీలో మేలుకో! (2)
31. శ్రీకృష్ణుని ముద్దుపేరు (3)
33. తిరగబడ్డ భార్య (2)
35. దురద, గొంతుకలో వచ్చే పొడి దగ్గు (2)
37. వర్షము (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మార్చి 13 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 401 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | ✠ | 1 జా | 2 తి | 3 పి | త | ✠ | 4 ఏ | ✠ | ✠ |
| ✠ | 5 కే | ✠ | 6 ను | సి | ✠ | 7 రా | కొ | 8 సి | ✠ |
| 9 అం | కి | 10 తం | ✠ | 11 ని | 12 శి | ✠ | 13 ద | రి | 14 ద్రం |
| బ | ✠ | 15 బు | వ్వ | ✠ | 16 వా | 17 రా | శి | ✠ | భ |
| 18 రం | 19 గు | రా | ✠ | 20 భూ | ✠ | ణి | ✠ | 21 మ | ✠ |
| ✠ | ట్టు | ✠ | 22 బొ | మి | 23 క | ✠ | 24 అ | ర | 25 ఖి |
| 26 భ | ✠ | 27 ము | గ్గ | ✠ | 28 ర | వి | క | ✠ | ష్మ |
| 29 లే | 30 ప | ధ్దు | ✠ | 31 జిం | క | ✠ | 32 రం | 33 గ | డు |
| ✠ | 34 వి | కృ | తి | ✠ | 35 మ | 36 ల | ✠ | ద్దె | ✠ |
| ✠ | ✠ | ష్ట | ✠ | 37 హా | లం | త | ము | ✠ | ✠ |

**విజేతలు:** ఆర్.సి.కాశీభట్ల, కె.ప్రభావతిదేవి, డా.బి. ధన్వంతరి, ఎస్.రాజు, వెల్లాలి ఉమామహేశ్వరశర్మ, రాయవరపు శేషు, వై.సోమేశ్వరరావు, కల్లూరి వెంకట రమణమూర్తి, పి.శాంతకుమారి, ఆర్.అంజనీదేవి, బి. ఇందుశేఖర్, జి. భారతి, కుండ్ల రుషిత, గుండు జ్యోతి, వారణాసి సరస్వతి, కె.శ్రీనిధి, ఎ. ఇందిరాదేవి, కె.బాల రాజు, కె.ఎన్.స్వామి, భోగపందరి, వనమాల రామలింగా చారి, యం. విజయలక్ష్మి, ఎ. ప్రవీణ్‌కుమార్, సి.గిరిజా శంకరరావు, పూలకంటి రాజేశ్వరరావు, ఆర్.సి.వనమాల, కె.వి.ఎస్.ఎన్.మూర్తి,వి.పద్మారంగనాథ్, కొవ్వూరు సంపత్‌కుమార్, మణిమాల ప్రభు, ఆర్.ఎస్.పి.కౌముది

**బహుమతి పొందిన విజేత : చెరుకు మహేశ్వరమ్మ, జగిత్యాల**

సినిమా

అరుణ



# విద్యావ్యాపారాన్ని ప్రతిఘటించిన సార్

**వైద్యంతో పాటే విద్య కూడా ఇవాళ లాభసాటి వ్యాపారం అయిపోయింది. అయిన వారి ప్రాణాలను దక్కించుకోవడానికి కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్లి ఆస్తులను అమ్ముకుంటున్నట్టుగానే, పిల్లలను పేరున్న విద్యా సంస్థలలో చదివించడం కోసం మధ్య తరగతి మనుషులు ఆస్తులను, ఒంటి మీద బంగారాన్ని తాకట్టుపెట్టే పరిస్థితి వచ్చింది. సేవాభావంతో విద్యను వ్యాప్తి చేయాల్సిన వ్యక్తులు దాన్ని లాభసాటి వ్యవహారంగా భావించి, అందిన కాడికి దోచుకోవడం మొదలు పెడితే ఓ యువకుడు ఎలా ప్రతిఘటించాడన్నదే 'సార్' చిత్ర కథాంశం. అయితే.. ఇది రెండున్నర దశాబ్దాల క్రితం కథ. చిత్రం ఏమంటే.. అప్పటికీ ఇప్పటికీ విద్యపేరుతో దోచుకోవడం పెరిగింది తప్పితే తగ్గలేదు.**


బాల గంగాధర్ తిలక్ (బాలు: ధనుష్) శ్రీనివాస త్రిపాఠి (సముతిర ఖని) నిర్వహించే త్రిపాఠి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో జూనియర్ లెక్చరర్. ప్రైవేటు విద్యాసంస్థలను ప్రభుత్వం కంట్రోల్ చేయాలని చూస్తున్న సమయంలో అధికారంలోని పెద్దలను మేనేజ్ చేసి త్రిపాఠి ఓ కొత్త ప్రపోజల్ పెడతాడు. ప్రభుత్వ కళాశాలలను తాను దత్తత తీసుకుని మంచి ఫలితాలను అందిస్తానని ఓ ఒప్పందం కుదుర్చుకుంటాడు. అయితే ఆ కళాశాలలకు ఎలాంటి అనుభవం లేని లెక్చరర్స్‌ను పంపి, వాటిని నిర్వీర్యం చేయాలన్నది అతని అసలు ఎత్తుగడ. అయితే ఇది తెలియని బాలు... సిరిపురం అనే గ్రామంలోని జూనియర్ కాలేజీకి లెక్చరర్‌గా వెళతాడు. అక్కడి గ్రామస్థులలో చైతన్యం తీసుకొచ్చి, అందరు పిల్లలను కాలేజీకి వచ్చేలా చేస్తాడు. అంతేకాదు.. ఫస్ట్ ఇంటర్‌లో మంచి ఫలితాలు చూపిస్తాడు. దీంతో దిమ్మతిరిగిన త్రిపాఠి తన ప్లాన్ బాలు వల్ల బెడిసి కొడుతోందని తెలిసి, ఊరి ప్రెసిడెంట్‌గా ఉన్న పత్తి పాపారావు (సాయి కుమార్)ను పావుగా ఉపయోగించి, ఆ ఊరి నుండి బాలును వెలివేయిస్తాడు. త్రిపాఠి పన్నాగం తెలిసిన తర్వాత బాలు ఎలాంటి చర్యలు తీసుకున్నాడు? ఊరికి దూరంగా ఉండి కూడా అక్కడి విద్యార్థులు ఎంసెట్‌లో ర్యాంక్ తెచ్చుకునేలా ఎలాంటి పథక రచన చేశాడు? ఇందుకు అతనికి అదే కాలేజీలోని లెక్చరర్ మీనాక్షి (సంయుక్త మీనాన్) ఎలాంటి సాయం చేసింది? అనేది మిగతా కథ.

విద్యావ్యాపారం అనేది ఇవాళ మొదలైంది కాదు. దాదాపు మూడునాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్నదే. కొన్ని కార్పొరేట్ సంస్థలు ఈ రంగాన్ని తమ గుప్పెట్లోకి తీసుకుని ప్రభుత్వాలను సైతం అజమాయిషీ చేసే స్థాయికి చేరిపోయాయి. పాతికేళ్ల క్రితం ఇలాంటి ఓ సంస్థతో ఓ యువ అధ్యాపకుడు ఎలాంటి పోరాటం చేశాడనే దానిని దర్శకుడు వెంకీ అట్లూరి కథగా రాసుకున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అంశం మీద వరుసగా సినిమాలు వస్తూనే ఉన్నాయి. అయితే ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే కానీ కాలేజీలు వసూలు చేసే డొనేషన్లకు అడ్డుకట్ట పడదు. కానీ ఎవరి స్వార్థం వారిది అన్నట్టుగా ఇవాళ వ్యవస్థ ఉంది. నిస్వార్థంగా ఎవరికి వారు తమ పరిధిలో ఉచితంగా విద్యను అందించగలిగితే, సమాజానికి ఎంతోకొంత మేలు చేసిన వారు అవుతారనే విషయాన్ని ఈ సినిమా ద్వారా దర్శకుడు చెప్పాడు. అయితే ఈ సినిమా చూస్తుంటే గతంలో ఇదే అంశం మీద వచ్చిన పలు చిత్రాలు మదిలో మెదులుతాయి. అలానే 'సూపర్ 30' బయోపిక్‌కు కారణమైన ఆనంద్ కుమార్ సైతం కళ్ల ముందు కనిపిస్తాడు. విశేషం ఏమంటే.. దర్శకుడు వెంకీ అట్లూరి కేవలం విద్యా వ్యవస్థలోని దోపిడీతో ఆగిపోకుండా, పాతికేళ్ల క్రితం పల్లెల్లో కులం ఎలాంటి ప్రతిబంధకాలకు కారణమైందో చూపించాడు. గుడిలోకి అట్టడుగు వర్గాలను అనుమతించకపోవడంతో, కథానాయకుడు బాల గంగాధర్ తిలక్ నాలుగు రోడ్ల కూడలిలో గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేసి, అదే వర్గం వారితో పూజలు చేయించినట్టు చూపడం బాగుంది. కొన్ని సన్నివేశాలు సినిమాటిక్‌గా ఉన్నా, ఎంచుకున్న అంశం మంచిది కావడంతో అవన్నీ పెద్దంతగా పట్టించుకోవాల్సినవి కావనిపిస్తుంది.

బాలు పాత్రను ధనుష్ తన భుజానికెత్తుకుని ముందుకు తీసుకెళ్లాడు. అయితే ఆ పాత్ర క్యారెక్టరైజేషన్స్‌లో కొన్ని లోపాలు కనిపిస్తాయి. సినిమా ప్రారంభంలోనే తన శిష్యులను కొట్టినందుకు దుండగులకు తన కండబలంతో బుద్ధి చెప్పిన బాల... ద్వితీయార్థంలో తన పాఠశాల పాకను కూల్చేస్తుంటే నిస్సహాయుడిగా వ్యవహరించడం సబబుగా అనిపించదు. ఇక కథానాయిక పాత్రను కూడా అంత ఎఫెక్టివ్‌గా మలచలేదు. వినోదానికీ పెద్దంత ప్రాధాన్యం ఇవ్వలేదు. ప్రథమార్థంలో హైపర్ ఆది, శివ షారలతో చేయించిన కామెడీ పెద్దంత పండలేదు. ఇతర ప్రధాన పాత్రలను సముతిర ఖని, సాయికుమార్, భరణి, 'ఆడుకాలం' నరేన్, హరీశ్ పేరడి, 'టెంపర్' శివ, నాగమహేశ్, తోటపల్లి మధు, మొట్ట రాజేంద్రన్, కల్పలత, పమ్మి సాయి, నర్రా శ్రీనివాస్ తదితరులు పోషించారు. సుమంత్‌తో ప్రత్యేక పాత్రను, తమిళ దర్శకుడు భారతీరాజాతో అతిథి పాత్రను చేయించారు. జీవీ ప్రకాశ్ కుమార్ నేపథ్య సంగీతం ఫర్వాలేదు కానీ పాటలు పెద్దంత గొప్పగా లేవు. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం హీరోగా తమిళనాట ఎంట్రీ ఇచ్చిన ధనుష్ నటించిన తొలి తెలుగు సినిమా ఇదే కావడం విశేషం. అతనితో అర్థవంతమైన సినిమాను నిర్మించిన సూర్యదేవర నాగవంశీ, త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సాయి సౌజన్యలను అభినందించాలి. ఇంతవరకూ మూడు ప్రేమకథా చిత్రాలను రూపొందించిన దర్శకుడు వెంకీ అట్లూరి ఆ పరిధిని దాటి సందేశాత్మక చిత్రాన్ని తెరకెక్కించడం విశేషం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.695/-




వెల :₹.799/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 19

Estd : 1997



# G.NARAYANAMMA ISTITUTE OF TECHNOLOGY & SCIENCE FOR WOMEN

*AUTONOMOUS*

SPONSORED BY G.PULLA REDDY CHARITIES TRUST, HYDERABAD

ACCREDITED BY NBA & NAAC, AFFILILATED TO J N T U H & APPROVED BY A. I. C. T. E

Shaikpet, Hyderabad - 500 104.

Ph: 040 2956 5856 / 2956 7756 Website : www.gints.ac.in, Email: principal@gnits.ac.in

COURSES OFFERED

## B.Tech Courses

- Electronics & Communication Engineering
- Computer Science & Engineering
- Electrical & Electronics Engineering
- Information Technology
- Electronics & Telematics Engineering
- Computer Science & Engineering (Artificial Intelligence & Machine Learning)
- Computer Science & Engineering (Data Science)
- Computer Science & Technology

## M.Tech Courses

- M.Tech in Power Electronics & Electric Drives
- M.Tech in Computer Science & Engineering
- M.Tech in Digital Electronics & Communication Systems
- M.Tech in Computer Networks & Information Security
- M.Tech in Wireless & Mobile Communications

## OTHER INSTITUTIONS RUN BY THE TRUST

1. G. Pulla Reddy Engineering College, Kurnool.
2. G. Pulla Reddy College of Pharmacy, Mehdipatnam, Hyderabad.
3. G. Pulla Reddy Degree & PG College, Mehdipatnam, Hyderabad.
4. G. Pulla Reddy Junior College, Abids, Hyderabad.
5. G. Pulla Reddy High School, Mehdipatnam, Hyderabad.
6. G. Pulla Reddy Memorial School, Dilsukhnagar, Hyderabad.
7. G. Pulla Reddy Government Polytechnic, Kurnool.
8. G.Narayanamma High School, Mehdipatnam, Hyd.
9. G. Narayanamma Hospital, Gokavaram, Atmakuru Taluk, Kurnool.
10. G. Narayanamma Pulla Reddy Respite Home for Mentally Retarded Women, Kurnool.
11. Vignana Peetham (Orphanage), Kurnool.
12. Samskruta Bhasha Prachara Samithi, Nampally Station Road, Hyderabad.
13. G. Pulla Reddy Dental College & Hospital at Kurnool.

CHAIRMAN
P. Subba Reddy

TREASURER
G. Raghava Reddy

PRINCIPAL
Dr. K. Ramesh Reddy